
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
06-05-2026
RNI No : TGTEL/25/A1676
సంపుటి : 01 | సంచిక : 294 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




# ఈ గెలుపులో యువతది కీలక పాత్ర

- తమిళనాడు ప్రజలకు జీవితాంతం కృతజ్ఞుడనై ఉంటా
- ఎన్నికల రణరంగంలో మేం ఎంతో ధైర్యంగా, నిర్భయంగా నిలబడ్డాం
- యావత్తు భారత్ రాజకీయాల్లోనే పెను ప్రకంపనలు సృష్టించిన ఈ ఎన్నికలు
- చారిత్రక విజయంపై టీవీకే చీఫ్ విజయ్ ఎమోషనల్ ట్వీట్

2




# నేను రాజీనామా చేయను

- ప్రజాతీర్పు వల్ల కాదు.. కుట్ర కారణంగానే తాము ఓడిపోయాం
- పశ్చిమ బెంగాల్‌లో తాము బీజేపీతో పోరాడలేదు
- ఆ పార్టీ కోసం పనిచేసిన ఎన్నికల సంఘంతో పోరాడాం
- ఇకపై 'ఇండియా' కూటమి బలోపేతానికి కృషి చేస్తా
- ఈవీఎంలను తారుమారు చేస్తూ.. సీఈసీ ఓ విలన్‌గా మారారు
- టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ

2





### తెలంగాణ

# భవిష్యత్ ప్రణాళికలపై సమావేశం

**పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు ఏఐపై కమిటీ వేస్తామన్న సీఎం**

**సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్‌ను సీఎం**

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎంకు పలు సూచనలు
- ఏఐని సరైన విధానంలో వినియోగిస్తే అందరికి మేలు
- యువత నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు
- మానవ వనరుల అభివృద్ధి కోసం పోషకాహార లోపం సమస్య తగ్గించుకోవాలి
- కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు ప్రభుత్వాల సులభతర వ్యాపార విధానాలపై ఆధారపడి ఉంటాయి
- స్టార్టప్‌లను ప్రోత్సహిస్తే మరింత ఉపయోగం ఉంటుంది
- మూడు, నాలుగు నెలల్లో హైదరాబాద్ పర్యటనకు రానున్నట్లు తెలిపిన రఘురాం
- ఉద్యోగాల కల్పన కోసం స్కిల్స్ యూనివర్సిటీ, ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించిన సీఎం
- రాష్ట్రంలో పరిశ్రమలకు అవసరమైన అన్ని సదపాయాలు ఉన్నాయన్న డిప్యూటీ సీఎం భట్టి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో**

పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు సిలబస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై కమిటీ వేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కమిటీకి అవసరమైన సూచనలు ఇవ్వాలని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్‌ను సీఎం కోరారు. ఏఐని సరైన విధానంలో వినియోగిస్తే అందరికి మేలు జరుగుతుందని రఘురాం రాజన్ పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలపై జరిగిన సమావేశంలో ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని పలు సూచనలు చేశారు. యువత నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని రఘురాం రాజన్ అన్నారు. మానవ వనరుల అభివృద్ధి కోసం పోషకాహార లోపం సమస్య తగ్గించుకోవాలని సూచించారు. కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు ప్రభుత్వాల సులభతర వ్యాపార విధానాలపై ఆధారపడి ఉంటాయని రఘురాం రాజన్ అన్నారు. స్టార్టప్‌లను ప్రోత్సహిస్తే మరింత ఉపయోగం ఉంటుందన్నారు. తమిళనాడు తరహా పారిశ్రామిక విధానం ఉంటే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చునని రఘురాం రాజన్ తెలంగాణ ప్రభుత్వానికి సూచించారు. డేటా సెంటర్లకు విద్యుత్, నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని ఆర్బీఐ మాజీ గవర్నర్ అభిప్రాయపడ్డారు. మూడు నాలుగు నెలల్లో హైదరాబాద్ పర్యటనకు రానున్నట్లు రాజన్ తెలిపారు. మిడిల్ లెవల్ ఉద్యోగాల కల్పన కోసం స్కిల్స్ యూనివర్సిటీ, ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నట్లు రఘురాం రాజన్‌కు సీఎం వివరించారు. రాష్ట్రంలో పరిశ్రమలకు అవసరమైన అన్ని సదపాయాలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో సులభతర వ్యాపారానికి అనువైన పరిస్థితులు ఉన్నాయని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సమావేశంలో సీఎస్ రామక్రిష్ణారావు, ఉన్నతాధికారులు శేషాద్రి, అజిత్ రెడ్డి, జయేష్ రంజన్, వాణీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల, ఉన్నత, సాంకేతిక, వైద్య విద్య పాఠ్యాంశాలలో.. మిగతా2లో...

### అంగన్వాడీ వ్యవస్థను

# మరింత బలోపేతానికి కృషి

- ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తాం
- అంగన్వాడీ కేంద్రాలకు సొంతభవనాలు మంజూరు చేస్తాం
- మహిళా సాధికారత కు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది
- విద్యా, వైద్య, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

2



### ప్రజా సమస్యలపై

## ప్రజా విశ్వంభర పోరాటం ఆపొద్దు

- వార్తల శరవేగాన్ని తట్టుకుంటూ ముందుకు వెళ్లాలి
- శాసనమండలి విపక్ష నేత మధుసూదనాచారి
- విశ్వంభర దినపత్రిక ప్రజల పక్షం
- సమాజంలో మంచి మార్పు కోసమే మీడియా రంగంలో అడుగుపెట్టాం
- ప్రజా సమస్యలపై పోరాటం చేస్తాం.. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటాం..
- చైర్మన్ కాచం సత్యనారాయణ

2



### ప్రాణహిత-చేవెళ్లకు

## జాతీయ హోదా ఇవ్వాలి

- ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం
- తెలంగాణలో ఒక్క ప్రాజెక్టుకు కూడా ఆ హోదా ఇవ్వలేదు
- తెలంగాణ రాష్ట్రం పట్ల చూపుతున్న వివక్షతకు నిదర్శనం : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



2

### మూడు, నాలుగు రోజుల్లో

## రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

- తెలంగాణలో రైతుపక్షపాత ప్రభుత్వం నడుస్తోంది
- రైతులకు మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నాం
- గత ప్రభుత్వ హయాంలో వరి వేస్తే ఉరి అన్నారు
- తాము మాత్రం రైతును రాజు చేసే వరకు విశ్రమించబోం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి




2

### రాష్ట్రాన్ని రక్షించేందుకే..

# తెలంగాణ రక్షణ సేన

**మోతే గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరాలయాన్ని సందర్శించిన కవిత**

**టీఆర్ఎస్ పార్టీ జెండాకు, కండువాలకు ప్రత్యేక పూజలు**

**విశ్వంభర, మోతే :** రాష్ట్రాన్ని రక్షించేందుకే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) స్థాపించడం జరిగిందని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సామాజిక న్యాయం, ప్రజాసేవలో టీఆర్ఎస్ నిమగ్నమౌతుందని పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలం మోతే గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరాలయాన్ని సందర్శించారు. అనంతరం టీఆర్ఎస్ పార్టీ జెండాకు, కండువాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట పలువురు టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులున్నారు.



### ప్రాణాలకు తెగించి మరీ

## రౌడీషీటర్‌ను పట్టుకున్న ఆటోడ్రైవర్

- ఆటోతో ఢీకొట్టి నిలువరించిన వైనం
- సీసీటీవీలో వెలుగుచూసిన సాహసం
- ఆటోడ్రైవర్‌ను నగదు, ప్రశంసాపత్రంతో సన్మానించిన సీపీ సజ్జనార్

2



### అవమానపరిచే మాటలు

## మాట్లాడడం మంచిది కాదు

- ప్రధాని మోడీ ఆధ్వర్యంలో భారతదేశం ప్రగతి పథంపై పరుగులు పెడుతుంది
- ఈ నెల 10వ తేదీన రాష్ట్రానికి వస్తుండటంతో ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలకాలి
- బెంగాల్‌లో 100 సీట్లలో ఓట్ చోరీ జరిగిందని మమత విమర్శలు చేసింది
- దీనికి రాహుల్ గాంధీ కూడా మద్దతు తెలపడం హాస్యాస్పదం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు

2



ప్రజా విశ్వంభర
V3 NEWS

# ప్రజా సమస్యలపై ప్రజా విశ్వంభర పోరాటం ఆపొద్దు



విశ్వంభర, హైదరాబాద్ : ప్రజా విశ్వంభర దినపత్రిక ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఆపకుండా నిరంతరం కృషి చేయాలని, వార్తల శరవేగాన్ని తట్టుకుంటూ ముందుకు వెళ్లాలని శాసనమండలి విపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ప్రజా విశ్వంభర దినపత్రిక ద్వితీయ వార్షికోత్సవం వి త్రీ ఛానల్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ ఆధ్వర్యంలో కర్మన్ ఘాట్ లోని శ్రీ లక్ష్మీ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి , యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మధుసూదనాచారి మాట్లాడుతూ గత 27 సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో కాచం సత్యనారాయణ తో కలిసి , మెలిసి పనిచేయడం జరిగిందని గుర్తుకు చేశారు. పని పట్ల స్పష్టత నిర్దిష్టమైన లక్ష్యాలతో పనిచేసే వ్యక్తి అని, అలాంటి సంకల్పంతో మొదలుపెట్టిన ఏ పనైనా తప్పక విజయం సాధిస్తుందని అన్నారు. వి త్రీ ఛానల్, విశ్వంబర దినపత్రిక ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ పాఠకుల ఆదరభిమానాన్ని చురగొనడం ఆయన పడ్డ కష్టానికి ఫలితమేనని అన్నారు. లక్ష్యం, ఆశయం, తపనతో పనిచేసే కాచం సత్యనారాయణ కష్టనష్టాలను తట్టుకుంటూ ముందుకు వెళ్లడం గొప్ప విషయమని, సమాజంలోని పేదలకు ఏదో చేయాలని తపన ఉన్న వ్యక్తి అని అన్నారు. వృత్తికి భిన్నంగా ఈ రంగాన్ని ఎంచుకొని రాణిస్తున్నాడని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జీవితం వడ్డించిన విస్తరి కాదని ప్రతినిత్యం కష్టపడుతూ ముందుకు సాగాలని అన్నారు. పాత్రికేయ రంగంలో ఎన్నెన్నో మార్పులు వచ్చాయని ఆ మార్పులను తట్టుకుంటూ ముందుకు వెళ్లినప్పుడే అనుకున్న లక్ష్యానికి చేరుకుంటారని తెలిపారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే నిద్రలేని రాత్రులు ఎన్నో గడపాల్సి ఉంటుందని , అలా గడిపినప్పుడే ప్రపంచం మనల్ని గుర్తిస్తుందని అన్నారు. మన ప్రయత్నంలోనే ప్రయాస ఉంటుందని, వాటిని తట్టుకొని ముందుకు వెళ్లాలని సూచించారు.

అనంతరం చైర్మన్ కాచం సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వంభర దినపత్రిక ప్రజల కోసం, ప్రజల పక్షాన్ని పనిచేస్తుందని అన్నారు.తన ద్వారా సమాజంలో మంచి మార్పు కోసమే ఈ రంగంలోకి అడుగుపెట్టడం జరిగిందని, ఏ పార్టీకి ఎవరికి కొమ్ము కాయకుండా ప్రజా సమస్యలను వెలికి తీసి వారికి ఉపయోగపడే విధంగా పత్రిక నడుస్తుందని తెలిపారు. కోవిడ్ తర్వాత పత్రికా రంగం కొత్త పుంతలు తొక్కుతూ ఎంతో మార్పు జరిగిందని తెలిపారు. శాటిలైట్ చానల్స్, యూట్యూబ్ లాంటి మాధ్యమాల ద్వారా క్షణాల్లో ప్రజలకు విషయం వేసే ఈ రోజుల్లో , పత్రికను నడిపివ్వాలంటే కత్తి మీద సాము లాంటి వ్యవహారమే అని అన్నారు. అలాంటి వడిదొడుకులు ఎదుర్కొంటూ విశ్వంభర దినపత్రికను రెండు సంవత్సరాలు పూర్తి చేసి మూడో సంవత్సరంలోకి అడుగు పట్టడం జరిగిందన్నారు. పేపర్ను స్థాపించేటప్పుడు కొంతమంది పని కట్టుకొని తనపై విమర్శలు చేయడం జరిగిందని, వారందరికీ ఈ ద్వితీయ వార్షికోత్సవంతో తమ శక్తిని నిరూపించడం జరిగిందని తెలిపారు. ప్రజా సమస్యలపై ఇలానే పోరాటం చేస్తూ, ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటామని తెలిపారు.

(మరిన్ని ఫొటోలు 3, 11, 12 పేజీల్లో)



## DUDDILLA SRIDHAR BABU GARU

**The Architect of People. Centric Victories Across India**
**From Karnataka to Telangana... From Telangana to Kerala.**
**A Continuing Journey of Strategy, Vision, and Success**

In the landscape of Indian politics, some victories may appear incidental. But a series of consistent electoral successes across states often points to something deeper. A leadership defined by clarity of thought, strategic depth, and an unwavering commitment to people. Duddilla Sridhar Babu Garu represents precisely that rare combination.

His strategic brilliance in Karnataka, his visionary leadership in shaping a people centric manifesto in Telangana, and his decisive role in steering success in Kerala together reflect not coincidence, but a clear and purposeful pattern of leadership.

Sridhar Babu Garu is not a leader who merely contests elections. He is one who understands the pulse of the people with remarkable precision. He does not stop at promises, he designs governance frameworks rooted in real needs. He does not shy away from challenges, instead, he transforms them into opportunities, turning ideas into impactful mass movements.

In May 2023, Karnataka witnessed a political revival driven by clarity, commitment, and a well executed strategy. In November 2023, Telangana embraced a manifesto that resonated deeply with the aspirations of its people. And now, Kerala stands as yet another testament to a model built on insight, inclusiveness, and effective execution.

This is the hallmark of a true political architect. One who approaches every state with understanding, respects every voter with sincerity, and builds every victory on the foundation of credibility.

At a time when politics often risks drifting toward rhetoric and short term narratives, Sridhar Babu Garu represents a refreshing shift toward substance, strategy, and service. His journey offers a powerful lesson to political leaders across the country. Elections are not won through slogans, but through solutions that genuinely address people's concerns.

It is not about momentary influence, it is about creating meaningful and lasting impact. It is not about visibility alone, it is about credibility earned through consistent delivery.

Winning elections is not about slogans, it is about solutions.

It is not about momentary influence, it is about meaningful impact.

A troubleshooter who resolves challenges with clarity.
A planner who envisions longterm progress...
A strategist who connects deeply with the people...
This is leadership that delivers.
This is the direction modern Indian politics needs.

**VEDIRE**
**YOGESHWAR REDDY**
**TPCC Official Spokesperson.**

## ప్రాణాలకు తెగించి మరీ రౌడీషీటర్‌ను పట్టుకున్న ఆటోడ్రైవర్

(మొదటి పేజీ తరువాయి)

వచ్చింది. వివరాల్లోకి వెళితే బేగంబజార్ జిన్సీ చౌరాహా ప్రాంతంలో ఓ మహిళ తన కోడలితో కలిసి ఉదయపునడక(మార్నింగ్ వాక్‌కు) వెళ్లారు. ఈ క్రమంలోనే డబీర్‌పురా ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ మహ్మద్ సోహేల్ ఆమె మెడలోని గోల్డ్ చైన్‌ను లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలోనే దొంగ స్కూటీ అదుపుతప్పి కిందపడబోయాడు. అప్పటికే అప్రమత్తమైన బాధితురాలు ఒక్కసారిగా గట్టిగా కేకలు వేయడంతో అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ గమనించారు.వెంటనే ఆటోను వెనక్కి తిప్పి వాహనంపై నుంచి లేచి అక్కడి నుంచి ఉడాయించేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్‌ను తన ఆటోతో ఢీకొట్టాడు. ఈ క్రమంలోనే నిందితుడు ఆటో డ్రైవర్‌పై కర్రతో దాడికి దిగాడు. అయినప్పటికీ లెక్క చేయకుండా ఆటో డ్రైవర్ రౌడీషీటర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. కాగా సీసీటీవీ కెమేరాల్లో ఘటనా దృశ్యాలు నమోదయ్యాయి. సీపీ సజ్జనార్ ఆటో డ్రైవర్ జుహెర్‌ను సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ శ్రీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ చూపిన సాహసం సమాజానికి ఆదర్శమన్నారు. "చూస్తుండగానే నేరాలు జరుగుతున్నా పట్టించుకోని ఈ రోజుల్లో, ప్రాణాలకు తెగించి మరీ రౌడీ షీటర్ ను అడ్డుకున్న జాహెర్ సమాజానికి నిజమైన రోల్ మోడల్. ఆయనలో ఒక అద్భుతమైన ప్రజా పోలీస్ ఉన్నారు. ఎలాంటి ప్రతిఫలం కూడా ఆశించలేదు. ఇలాంటి బాధ్యతాయుతమైన పౌరులు ఉన్నప్పుడే నేరస్తులకు భయం పుడుతుంది" అని ప్రశంసించారు. జాహెర్‌కు ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారాన్ని అందజేశారు. నేరం జరుగుతున్నప్పుడు భయపడకుండా, మహమ్మద్ జాహెర్ వలె ధైర్యంతో స్పందించి వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని నగరవాసులకు ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ పిలుపునిచ్చారు.

## ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా ఇవ్వాలి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కరీంనగర్ పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిజైన్ చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట గ్రామంలోని పంతులుగారి తోటలో బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం మంత్రులు శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని ఇచ్చిన హామీని కేంద్రం విస్మరించిందని భట్టి విక్రమార్క విమర్శించారు. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం, తెలంగాణలో ఒక్క ప్రాజెక్టుకు కూడా ఆ హోదా ఇవ్వకపోవడం తెలంగాణ రాష్ట్రం పట్ల చూపుతున్న వివక్షతకు నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని తీసుకోవడంలో కేంద్రం కొర్రీలు పెడుతోందని, నిధుల విడుదలలో జాప్యం చేస్తూ రైతులను మోసం చేస్తోందని డిప్యూటీ సీఎం ఆరోపించారు. కేవలం కొన్ని పంటలకే మద్దతు ధర ఇచ్చి తప్పించుకోకుండా, రాష్ట్రం సేకరించిన ప్రతి గింజను కేంద్రమే సేకరించి, సకాలంలో నిధులు చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగానే వరి గడ్డి నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేసే ప్లాంట్లను ప్రోత్సహిస్తున్నామని భట్టి తెలిపారు. పంట కోతల తర్వాత గడ్డిని కాల్చడం వల్ల ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోతోందని, దీన్ని నివారించేందుకు బయో గ్యాస్ ప్లాంట్లు ఉపయోగపడతాయన్నారు. గడ్డిని కాల్చకుండా ప్లాంట్‌లకు సరఫరా చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. రైతులు కేవలం వరి మీదనే ఆధారపడకుండా లాభదాయకమైన పంటల వైపు మళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్, ఉద్యానవన పంటలు, చిరుధాన్యాల సాగుతో ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. పాత పద్ధతులు వదిలి ఆధునిక సాగు విధానాలను అవలంబిస్తేనే వ్యవసాయం పండుగలా మారుతుందని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న తమ ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకు కనీస మద్దతు ధర కల్పించేందుకు కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

## అవమానపరిచే మాటలు మాట్లాడడం మంచిది కాదు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** యావత్ ప్రపంచం ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతుంటే ప్రధాని మోడీ ఆధ్వర్యంలో భారతదేశం ప్రగతి పథంపై పరుగులు పెడుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన రాష్ట్రానికి వస్తుండటంతో ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలకాలని కోరారు. మంగళవారం బహిరంగ సభ విజయవంతం కోసం తార్నకలో వాల్‌రైటింగ్‌క్యాంపెయిన్‌లో పాల్గొన్ని మాట్లాడుతూ.. బెంగాల్‌లో 100 సీట్లలో ఓట్ చోరీ జరిగిందని మమత విమర్శలు చేస్తే దీనికి రాహుల్ గాంధీ కూడా మద్దతు తెలపడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఓటు చోరీ చేసేటోళ్లే చోరీ గురించి మాట్లాడుతున్నారని, వీళ్ళందరికీ చోరీ అలవాటు ఉంటే అప్పుడు గెలిచారని, ఇప్పుడు వారి చోరీ నడవట్లేదన్నారు. ఎన్నికల్లో ఓడిపోతే ప్రజల తీర్పుని అంగీకరించాలి, ప్రజలను అవమానపరిచే మాటలు మాట్లాడడం మంచిది కాదని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పు సర్వశక్తివంతమైనది దానిని అవమాన పరుస్తుంటే కాంగ్రెస్ మద్దతు తెలపడం ఘోరమన్నారు. మూడు సార్లు మమతా గెలిచినప్పుడు తమ పార్టీ ఏమి అనలేదని, ప్రజా తీర్పును గౌరవించామన్నారు. కానీ వాళ్లు ఓడిపోతే ఈవీఎంలు, ఈసీఐ, దేశాన్ని నిందిస్తారు. ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పుని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు.

## మూడు, నాలుగు రోజుల్లో రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాతి ప్రభుత్వం నడుస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని ఆయన ఎద్దేవా చేశారు. వారు(బీఆర్ఎస్) రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా రైతులకు రూ.21 వేల కోట్లు చెల్లించామన్న ఆయన వరి వేసిన రైతులకు మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. హనుమకొండలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి మెగా రైతు మేళాను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో వరి వేస్తే ఉరి అన్నారని, తాము మాత్రం రైతును రాజు చేసే వరకు విశ్రమించబోమని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతులకు ఎకరానికి రూ.12 వేలతో పాటు వ్యవసాయ పరికరాలు ఇస్తూ, కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంటుకు రూ.1200 కోట్లు చెల్లిస్తున్నామన్నారు. మూడు, నాలుగు రోజుల్లో రైతుల సమస్యలు పరిష్కరిస్తామని, ఆ బాధ్యత ఇన్‌ఛార్జ్ మంత్రులు తీసుకుంటారని తెలిపారు. ధాన్యం కొనుగోలులో జాప్యం చేస్తూ ప్రభుత్వం రైతులను అరిగోసలు పెడుతుందని కేంద్ర హోంశాఖ సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా తూకాలు వేయడం లేదని మండిపడ్డారు. కరీంనగర్ జిల్లా ఖాజీపూర్ వద్ద కొనుగోలు కేంద్రానికి వెళ్లిన బండి సంజయ్ రైతుల బాధలను అడిగి తెలుసుకున్నారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు వస్తే ఇప్పటివరకు 15 లక్షల మెట్రిక్ టన్నులే కొన్నారని తెలిపారు. తాలు, తరుగు, తేమ పేరుతో రైతులను అడ్డగోలుగా దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. కల్లాల్లో వడ్లు పోసి కళ్లల్లో ఒత్తులేసుకొని చూస్తున్న రైతుల గోడును పట్టించుకొని కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం పెద్దచెప్యాల కూడలిలో ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ధర్నా చేశారు. కలెక్టర్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అటు రైతులు, ఇటు క్షేత్రస్థాయి అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. కింది స్థాయి నుంచి ఉన్నత పదవికి ఎదిగిన కలెక్టర్‌కు క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న అవస్థలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగకపోతే కర్షకులతో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. అధికారులకు సరైన దిశా నిర్దేశం చేయడంలో కలెక్టర్ పూర్తిగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. రైతన్నల కష్టార్జితానికి గిట్టుబాటు ధర లభించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

## రూ.453 కోట్లతో ఐటీపీ ఏరో ఇండియా ప్లాంట్

**భూమిపూజ చేసిన మంత్రి శ్రీధర్ బాబు**

**ఈ ప్రాజెక్ట్‌తో రాష్ట్రం ఏరోస్పేస్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో మరింత బలోపేతం**

**ప్లాంట్ నిర్మాణం దశలవారీగా కొనసాగి 2027 నాటికి పూర్తి స్థాయిలో ప్రారంభం కానున్న ఆపరేషన్స్**



**విశ్వంభర, శంషాబాద్ :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ హార్డ్‌వేర్ పార్క్ (ఫేజ్ 3)లో అధునాతన ఏరోస్పేస్ తయారీ రంగానికి మరింత ఊతమిచ్చేలా రూ.453 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న "ఐటీపీ ఏరో ఇండియా" ప్లాంట్‌కు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం భూమి పూజ నిర్వహించారు. 10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ ప్లాంట్ ద్వారా విమాన ఇంజన్లలో వినియోగించే రిజిడ్ ట్యూబ్స్‌కు అవసరమైన ఎండ్‌ఫిట్టింగ్స్, బ్రాకెట్లు వంటి కీలక భాగాలను తయారు చేయనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రిసిషన్ ఇంజనీరింగ్ ఆధారంగా ఈ యూనిట్ రూపుదిద్దుకోనుండటం తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి కీలకంగా భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌తో రాష్ట్రం ఏరోస్పేస్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో మరింత బలోపేతం కానుంది. శంషాబాద్ పరిసర ప్రాంతం ఇప్పటికే విమానయాన, హార్డ్‌వేర్, తయారీ రంగాలకు కేంద్రంగా ఎదుగుతున్న నేపథ్యంలో ఐటీపీ ఏరో ఇండియా ప్లాంట్ కీలక పెట్టుబడిగా నిలవనుంది. ప్లాంట్ నిర్మాణం దశలవారీగా కొనసాగి 2027 నాటికి పూర్తి స్థాయిలో ఆపరేషన్స్ ప్రారంభం కానున్నాయి. ప్రిసిషన్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో తొలి దశలోనే 350 మంది హైస్కిల్డ్ యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రానున్న రోజుల్లో ఉద్యోగాల సంఖ్య 600కు పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా స్థానికంగా నైపుణ్య ఆధారిత ఉద్యోగ అవకాశాలు పెరగడంతో పాటు, తెలంగాణను ప్రపంచ ఏరోస్పేస్ సరఫరా గొలుసులో మరింత బలంగా నిలబెట్టే దిశగా ఇది కీలక అడుగుగా పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

## బిసి గురుకులాల్లో ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

**విశ్వంభర, ఎల్బీనగర్ :** మహాత్మా జ్యోతిభాపూలే తెలంగాణ బిసి గురుకుల ఇంటర్మీడియట్ కళాశాలల్లో 202627 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల కోసం విద్యార్ధులు దరఖాస్తు చేసుకోవాలనీ హైదారాబాద్ ఉమ్మడి జిల్లాల బిసి గురుకులాల పాఠశాలలు , కళాశాలల రీజినల్ కో ఆర్డినేటర్ (ఆర్ సి ఓ ) గౌతం కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 202526 సంవత్సరం లో పదవ తరగతి లో ఉత్తీర్ణులైన విద్యార్ధులు ఈ నెల 12 వ తేదీ లోగా మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. హైదారాబాద్ జిల్లాలో 14 బాలుర , 14 బాలికల కళాశాలలు(ఇంగ్లీష్ మీడియం) ఉన్నాయని, ఎంపీసీ, బైపిసి, సీఈసీ, హెచ్ఈసి , ఈ సంవత్సరం ఏసీఈ కొత్త గ్రూప్ అందుబాటులో ఉన్నాయని, వృత్తి విద్యా కోర్సులో కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్ కూడా ఉన్నాయని ఆర్సీవో తెలిపారు. విద్యార్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో బిసి గురుకులం కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారనీ ఆర్సీఓ చెప్పారు.

## తెలంగాణ భవిష్యత్ ప్రణాళికలపై సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

ఏఐని ఏకీకృతం చేయడంపై సిఫార్సులు అందించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయడంలో సహాయపడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్‌ను కోరారు. మధ్యస్థాయి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాష్ట్రంలో స్కిల్స్ యూనివర్సిటీ, అధునాతన శిక్షణా కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఏఐని సక్రమంగా వినియోగించడం వల్ల సమాజంలోని అన్ని వర్గాలకూ ప్రయోజనం చేకూరుతుందని రాజన్ పేర్కొన్నారు. పారిశ్రామిక వృద్ధికి అవసరమైన భూమి లభ్యత, పటిష్టమైన ప్రాథమిక సౌకర్యాలతో సహ అన్ని మౌలిక సదుపాయాలు తెలంగాణలో ఉన్నాయని, భవిష్యత్ అవసరాలను తీర్చడానికి విద్యుత్ ఉత్పత్తిని విస్తరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలతో పాటు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్ వంటి కీలక మౌలిక సదుపాయాలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్ల కోసం ప్రణాళికలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.రాష్ట్రంలో పటిష్టమైన శాంతిభద్రతలు ఉన్నాయని, మొత్తం మూడు ప్రాంతాలుగా విభజించి అభివృద్ధిని సాధిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ మోడల్‌తో ముందుకు సాగుతోందని యువత నైపుణ్యాలను పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని స్థాపించామన్నారు. అధునాతన శిక్షణను అందించడానికి ఐటీఐలను ఏటీసీలుగా ఉన్నతీకరిస్తున్నట్లు తెలిపారు. వ్యాపార సౌలభ్యానికి తెలంగాణ అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తోందని, ఫార్మా, ఐటీ, డేటా సెంటర్ల వంటి రంగాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

## ఈ గెలుపులో యువతది కీలత పాత్ర

**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 108 సీట్లలో విజయం సాధించి తమిళ వెట్రి కళగం పార్టీ విజయఢంకా మోగించింది. ఈ చారిత్రక విజయంపై టీవీకే చీఫ్ విజయ్ తొలిసారి స్పందించారు. ఇంతటి ఘన విజయాన్ని సాకారం చేసిన రాష్ట్ర ప్రజలకు జీవితాంతం కృతజ్ఞతుడనై ఉంటానని అన్నారు. దీన్ని 'అద్భుతమైన విజయం'గా అభివర్ణిస్తూ ఈ గెలుపులో యువత కీలక పాత్ర పోషించిందని అన్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రజలనుద్దేశించి ఎమోషనల్ ట్వీట్ చేశారు.నా హృదయంలో కొలువై ఉన్న ప్రతి ఒక్కరికీ నా నమస్కారాలు. మన పార్టీ ఆవిర్భవించిన తొలిరోజు నుంచే, మమ్మల్ని ఆదరించి గౌరవించిన వారి కంటే, మమ్మల్ని చూసి ఎగతాళి చేసినోళ్లు, మాపై విమర్శల బాణాలు సంధించిన వారే ఎక్కువగా ఎదురయ్యారు. ఇది రాజకీయాల స్వభావమని గుర్తించి, మేము ఆ విషయాలను పక్కన పెట్టేసి ముందుకు సాగాం. ప్రజల మీద తప్ప ఇంకెవరిపైనా ఆధారపడకుండా, ఎన్నికల రణరంగంలో మేం ఎంతో ధైర్యంగా, నిర్భయంగా నిలబడ్డాం. విమర్శ అనే ముసుగులో మాపై నిందారోపణలు ఎన్నో చేశారు. అయినప్పటికీ, తమిళనాడు ప్రజలు మాపై ఒక తల్లి చూపించే నిస్వార్థ ప్రేమను కురిపిస్తూ మమ్మల్ని తమ గుండెల్లో పెట్టుకున్నారు'. 'ఆ ప్రేమతోనే ఈ ఎన్నికల్లో మాపై అపారమైన ప్రేమాభిమానాలను కురిపించి, మాకు భారీ విజయాన్ని అందించారు. యావత్తు భారత్ రాజకీయాల్లోనే పెను ప్రకంపనలు సృష్టించిన ఈ ఎన్నికలు ఒక "అద్భుతమైన ఎన్నికలు"గా నిలుస్తాయని మేము ముందే ప్రకటించాము. ఆ అంచనా ఇప్పుడు నిజమైంది. మార్పు కోసం జరిగిన ఈ పోరాటంలో, టీవీకే పార్టీ మాత్రమే కాదు, తమిళ ప్రజల ఆకాంక్ష, భావోద్వేగ ప్రజాస్వామ్యం కూడా ఘన విజయం సాధించింది. ఫలితంగా, తమిళనాడులో ఒక ఆధిపత్య రాజకీయ సంస్కృతిగా మారి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ఒక అవినీతి శక్తిగా పరిణమించిన ధనస్వామ్యం ఇప్పుడు పూర్తిగా వేళ్లతో సహా పెకిలించబడి, శాశ్వతంగా సమాధి అయ్యింది. టీవీకే ఈ రాష్ట్రంలో మార్పును తీసుకొచ్చే శక్తిమంతమైనదిగా నిలుస్తుందని రుజువైంది. ఒకప్పుడు అసాధ్యమని, ఇది ఎప్పటికీ జరగదని భావించిన ఇలాంటి విజయాన్ని సాకారం చేసిన నా తమిళనాడు ప్రజలకు జీవితాంతం కృతజ్ఞతుడనై ఉంటాను. మా మద్దతుదారులకు నా కృతజ్ఞతలను తెలియజేస్తూనే, పార్టీ కార్యకర్తలకు వ్యక్తిగతంగా నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ఈ ఎన్నికల్లో టీవీకేకు ఓటు వేయని వారిని కూడా నేను గౌరవిస్తా. భవిష్యత్తులో వారు కూడా పార్టీకి మద్దతు ఇస్తారని ఆశిస్తున్నా' అని విజయ్ ఎక్స్‌లో రాసుకొచ్చారు. తాజా ఎన్నికల్లో తమిళనాడులో టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించింది. 234 స్థానాలకుగానూ 108 సీట్లలో నెగ్గింది. అలాగే పెరంబూర్, తిరుచిరాపల్లి ఈస్ట్ రెండు స్థానాల నుంచి పోటీ చేసిన విజయ్ రెండింట్లోనూ గెలుపొందారు.

## నేను రాజీనామా చేయను

**విశ్వంభర, కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో తాము బీజేపీతో పోరాడలేదని.. ఆ పార్టీ కోసం పని చేసిన ఎన్నికల సంఘంతో పోరాడామని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఇలాంటి ఎన్నికలను ఎప్పుడూ చూడలేదన్నారు. తాను సీఎం పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజాతీర్పు వల్ల కాదని.. కుట్ర కారణంగానే తాము ఓడిపోయామన్నారు. ఫలితాల అనంతరం.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్ తదితర నేతలు తనకు ఫోన్ చేసి సంఘీభావం తెలిపారన్నారు. ఇకపై 'ఇండియా' కూటమి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు."ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ.. ఈవీఎంలను తారుమారు చేస్తూ.. సీఈసీ ఓ విలన్‌గా మారారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా ఈవీఎంలలో 8090 శాతం ఛార్జ్ ఉంటుందా? అదెలా సాధ్యం? ఎన్నికలకు రెండు రోజుల ముందు.. మా పార్టీ శ్రేణులను అరెస్టు చేయడం మొదలుపెట్టారు. అన్నిచోట్లా సోదాలు నిర్వహించారు. ఐపీఎస్, ఐఏఎస్ అధికారులందరినీ మార్చేశారు. ఎన్నికల సంఘంతో కలిసి భాజపా గేమ్ ఆడింది. మేం అన్ని యంత్రాంగాలకు వ్యతిరేకంగా పోరాడాం. ఎస్ఐఆర్ పేరిట 90 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. మేం కోర్టుకు వెళ్తే.. 32 లక్షల పేర్లను చేర్చారు. ఓట్ల లెక్కింపులో భారీ అవకతవకలు చోటుచేసుకున్నాయి. దాదాపు 100 స్థానాల్లో మా గెలుపును కాజేశారు. టీఎంసీ మనోధైర్యాన్ని దెబ్బతీయడానికి లెక్కింపు ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా నెమ్మదిగా చేపట్టారు. చరిత్రలో ఇదొక చీకటి అధ్యాయం. ఎన్నికల అనంతర హింసతో ప్రభావితమైన ప్రాంతాలను సందర్శించి.. క్షేత్రస్థాయి పరిస్థితిని అంచనా వేసేందుకు 10 మంది సభ్యులతో కూడిన నిజనిర్ధరణ కమిటీని ఏర్పాటు చేస్తున్నాం'' అని మీడియా సమావేశంలో మమతా బెనర్జీ తెలిపారు. 2021లో ఎన్నికల అనంతరం హింస జరిగిందన్న ఆరోపణలను ఆమె నిరాధారమైనవిగా కొట్టిపారేశారు.

## అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతానికి కృషి

**విశ్వంభర, సంగారెడ్డి :** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అన్ని వర్గాల ప్రజల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జోగిపేట ఆందోల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలోరాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాబోయే రోజుల్లో అన్ని అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, ఆయాలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కనబడితే ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యం, మహిళా సాధికారత, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.అదేవిధంగా, అంగన్వాడీ టీచర్లు, ఆయాల ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి తెలిపారు. ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు.అనంతరం ఈ కార్యక్రమంలో మంత్రి 10 మంది దివ్యాంగులకు ఉచిత స్కూటీలు, 286 మంది అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి, సిడిపిఓలు, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, దివ్యాంగులు మరియు ఇతరులు పాల్గొన్నారు.






తెలుగు దిన పత్రిక
రెండవ వార్షికోత్సవ వేడుకలు























































ప్రజా విశ్వంభర
V3 NEWS లక్ష్యం సమాజహితం

# బరువుగా మారిపోతున్న సామాజిక బాధ్యత

రాజ్యాంగం ప్రకారం ఈదేశంసంక్షేమ రాజ్యం. ఒక తల్లి తన పిల్లల మంచి-చెడులను ఎలాంటి వివక్ష లేకుండా చూసుకోవడమే సంక్షేమం రాజ్య మూల సూత్రం. రాజ్య వ్యవస్థ తన ప్రజలు అందరికీ సమ అవకాశాలను అందించడం దానిలో భాగం. దానిలో భాగంగానే స్వతంత్ర భారతం అనేక సామాజిక కార్యక్రమాలను చాలా కాలంగా అమలు చేసుకుంటూ వస్తున్నది.విద్య,ఉద్యోగ రంగాల్లోనే కాకుండా రాజకీయ వ్యవస్థలో రిజర్వేషన్లను కల్పించడం ద్వారా సామాజిక సమతను నిర్మించే అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తూ వస్తున్నాయి



ప్రభుత్వాలు. సంక్షేమం అనే తాత్వికతను తొలి నాటి నుంచీ వ్యతిరేకించే రాజకీయశక్తి ఇప్పుడు అధికారం కొనసాగుతున్నది. ఈరాజకీయ శక్తికి అండగా నిలుస్తున్న సామాజిక వర్గాలు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ప్రచారంచేస్తూ వస్తు న్నాయి. మూడున్నర దశాబ్దాల క్రితం దేశ వ్యాప్తంగా జరిగిన మండల్-కమండల్ ఉద్యమం అదే. ఇప్పుడు అధికారంలో ఉన్న రాజకీయ శక్తి నాడు కమండల్ ఉద్యమాన్ని పూర్తిగా సమర్థించింది. రిజర్వేషన్లకు అనుకూలంగా మొదలైన మండల్ (మండల్ కమిషన్ నివేదిక అమలు)ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ మొదలైన ఉద్యమమే కమండల్ ఉద్యమంగా ప్రచారం పొందింది. ప్రతిభ అనేది పుట్టుకతో మాత్రమే సంక్రమిస్తుంది, ఎవరికి ప్రతిభ ఉంటే వాళ్లు చదువు కుంటారు, వాళ్లే ఉద్యోగ అవకాశాలను పొందుతారు.కాబట్టి రిజర్వేషన్లు అనవసరం అనేదికమండల్ ఉద్యమ లక్ష్యం అనేది మనకు తెలుసు కదా.ఈ తాత్వికతను భుజాన వేసు కున్న ఒక ప్రవచన కర్త ఒకాయన మధ్యాహ్న భోజన పథకంపై ఇటీవల అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయన చేసిన "ప్రవచనం" ప్రకారం ఏ విద్యార్థికీ మధ్యాహ్న భోజనాన్ని ఉచితంగా అందించకూడదు.పుస్తకాలనుసైతం ఉచితంగా అందించకూడదు. ఇష్టమైన వాడు బడికి వస్తాడు, చదువు కుంటాడు,ఇష్టం లేని వాడిని వాడి కర్మకు వదిలి వేయాలనేది ఆయన చేసిన "ప్రవచన" సారాంశం. సంక్షేమం, సామాజిక సమత పట్ల ఆయన గారు చెప్పిన ఈ మాటల పై జాతీయ ప్రభుత్వం సహా ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంత వరకూ నోరు మెదపలేదు. అంటే అర్థం ఏమిటి? సంక్షేమ వ్యతిరేక ప్రచారాన్ని ప్రభుత్వాలు సమర్థిస్తున్నట్లే కదా. ఇప్పటికే సర్కారీ బడి ఒక అనాథగా మారిపోయింది. విద్య వ్యాపారంగా మారిపోయిన(మార్చి వేసిన)పరిస్థితుల్లో ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ ఆందోళనకర స్థాయిలో క్షీణిస్తూ వస్తున్నది. అనేక సామాజిక ఒత్తిళ్ల కారణంగా పేద పిల్లలను బడికి ఆకర్షించే లక్ష్యంతో మధ్యాహ్న భోజనపథకం అమలు లోకి వచ్చింది. ఇదీ సంక్షేమం లో ఒక భాగమే. దీనిని ఎత్తివేయడం ద్వారా పేదలను విద్యకు దూరంచేయడమే ఆప్రవచన కారుడి వ్యాఖ్యలు, ఆయన మద్దతుదారులు, ప్రభుత్వాల మౌనం లోని అంతరార్థంగా అర్థం చేసుకోవాలి. ఈ కుట్రను అర్థం చేసుకోకుండా గుడ్డిగా ఆ వలలో పడిపోతే సంక్షేమం అనేది క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. అదేజరిగితే సామాన్యుడిజీవితంనరక ప్రాయమై పోవడం ఖాయం.అలాంటి వ్యవస్థలో సంక్షేమం అందని ద్రాక్ష లాగా ఓ అత్యాశగానే మిగిలి పోతుంది.విద్య, వైద్య రంగాల్లో మితి మీరినవ్యాపారాన్ని కొంత కాలంగా మనం చూస్తూనే ఉన్నాం. ప్రజారోగ్యాన్ని గాలికొది లేసిన సమాజంలో ఆరోగ్యాన్ని కొనుక్కోవలసిన దుస్థితిని మనం చూస్తున్నాం. కరోనా వైరస్ కోవిడ్ -19 జబ్బుగా మారి ప్రజలను భయ భ్రాశీతులకు గురిచేసి దాన్ని వ్యాపార అవకాశంగా మలచుకొని జనం జేబులను కార్పొరేట్ మెడికల్ మాఫియా గుల్ల చేసిన వైనాన్ని మనం ఇటీవలనే చూశాం. అల్లాడిన రోగుల తరఫున హైకోర్టులో కేసు వేయడం ,ఆసుపత్రుల దోపిడీని అదుపుచేయమని కోర్టు అప్పట్లోఆదేశించడం జరిగిపోయాయి. అయితే ఆ ఆదేశం అమలుకు నోచుకొని పేద రోగులకు ఊరటకలిగిస్తుందా అన్న ప్రశ్నకు జవాబు మాత్రం లభించదు. న్యాయ వ్యవస్థ గతంలో ఇచ్చిన తీర్పులు,అవి అమలైన తీరును గమనించిన వారెవరికైనా ఇలాంటి అనుమానం తప్పకుండా కలుగుతుంది.అంటే ప్రజారోగ్యం గాలిలో దీపం చందమే అనుకోవాలన్న మాట. ఫీజులను నియంత్రించే అధికారం తమకు లేదని ప్రభుత్వం తరఫున వాదించిన అడ్వొకేట్ చెప్పిన మాట ఇపుడు ఈ వాదనకు ఒక ఆధారంగా చూడవచ్చు. ముందుగా ప్రజల ఆరోగ్యాన్ని కనీసం చవకగా అందించే ఆలోచనే చేయని వ్యవస్థ మెడికల్ మాఫియాను నియంత్రిస్తుందని భావించడం భ్రమగానే మిగిలిపోగలదు. ప్రజారోగ్యం తనకు భారమని భావించే కదా దశాబ్దాలుగా ప్రైవేట్ వైద్యాన్ని ప్రోత్సహించింది.ప్రభుత్వ రంగంలోని వైద్య వ్యవస్థను భారంగా భావించి ఆ బరువును దింపుకొనే క్రమంలోనే కదా కార్పొరేట్ మెడికల్ మాఫియా రూపుదిద్దుకున్నది.అలాగే సర్కారీ విద్య స్థానంలో కార్పొరేట్ విద్య బలంగా స్థిరపడి పోయింది. సామాజిక సంక్షేమం అనే తాత్వికతకు పూర్తిగా తూట్లు పొడిచే ఒక పెద్ద కుట్ర ఒకటి ఈ ప్రచారం వెనక దాగిఉందని అర్థం చేసుకోని పక్షంలో భారీ మూల్యం చెల్లించుకోవలసిన దుస్థితి తలెత్త వచ్చును. సంక్షేమ వ్యతిరేక రాజ్యవ్యవస్థ ఈ ప్రచారాన్ని అడ్డుకొని ఏవో నియంత్రణ చర్యలు చేపడుతుందని,పేదలకు ఏదో ఊరట లభించే చర్యలు చేపడుతుందనే ఆశ పడడం అత్యాశగానే మిగిలిపోయే ప్రమాదమే ఎక్కువగా కనిపిస్తున్నది.



గోవర్ధన్ గందె,
9347056621.

## సొంత కోటల్లో కుప్పకూలిన దిగ్గజాలు
## మమత, స్టాలిన్ భవిష్యత్ ఏమిటి?



గతకొన్ని దశాబ్దాలుగా ఓటమి ఎరుగని, ఎవరికీ తలవంచని ప్రాంతీయ పార్టీల దిగ్గజాలు నేడు తమ సొంత గడ్డపైనే ఘోర పరాజయాన్ని మూటగట్టు కున్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ కోటను బీజేపీ బద్దలు కొట్టగా, తమిళనాడులో ఎంకే స్టాలిన్‌ను సినీ నటుడు విజయ్ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) ఓడించింది. ఇప్పటికే ఏడు పదుల వయస్సు దాటిన ఈ రాజకీయ దిగ్గజాలు వచ్చే ఎన్నికల వరకు ప్రత్యక్ష రాజకీయాల్లో కొనసాగుతారా? లేదా? అనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఒకవేళ వారిద్దరూ రాజకీయాల్లో కొనసాగితే ఎలాంటి వ్యూహాలు అనుసరించే అవకాశం ఉందో ఈ కథనంలో చూద్దాం. 2025 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు 71ఏళ్ల మమతా బెనర్జీ, 73 ఏళ్ల ఎంకే స్టాలిన్‌లకు ఒక చేదు జ్ఞాపకాన్ని మిగిల్చాయి. అంతేకాదు ఇది వారి రాజకీయ భవిష్యత్తుకు అతిపెద్ద అగ్నిపరీక్షలాగా మారింది. వయసు మీద పడుతున్న సమయంలో ఈ ఓటమి వారిద్దరిపై తీవ్ర ఒత్తిడి పెంచుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి దీదీకి 76 ఏళ్లు, స్టాలిన్‌కు 78 ఏళ్లు నిండుతాయి. అందువల్ల ఈ ఇద్దరు నేతలు తమ తమ రాష్ట్రాల్లో అధికార పార్టీలను ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరంగా మారింది. బంగాల్ వర్సెస్ ఔట్‌సైడర్స్ అనే నినాదంతో దీదీ మళ్లీ పోరాటం మొదలుపెట్టే అవకాశలున్నాయి. పార్టీ నేతలు వలస వెళ్లకుండా కాపాడుకోవడం అనేది ఇప్పుడు మమతా బెనర్జీ ముందున్న అతిపెద్ద సవాల్?గా భావిస్తున్నారు. ఇక ద్రవిడ వాదానికి తామే అసలైన వారసులం అనే నినాదంతో విజయ్‌ను ఎంకే స్టాలిన్ ఎదుర్కోవాల్సి ఉంటుంది. అయితే అన్నాదురై, ఎంజీఆర్, పెరియార్ సిద్ధాంతాలను విజయ్ కూడా బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో, ఆయన్ను ఎదుర్కొనేందుకు స్టాలిన్ కొత్త వ్యూహాలు రచించాల్సి ఉంటుంది.దాదాపు 15ఏళ్లుగా బెంగాల్‌లో బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలను అడ్డుకుంటూ వచ్చిన మమతా బెనర్జీ సామ్రాజ్యానికి ఎట్టకేలకు బీటలు వారాయి. ఎన్నికల ప్రచారంలో బీజేపీ కనబరిచిన దూకుడు ముందు ఆమె తలవంచక తప్పలేదు. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 3 స్థానాలు గెలిచిన బీజేపీ, 2019 నాటికి 77 సీట్లు సాధించింది. ఇప్పుడు ఏకంగా 206 స్థానాలతో బంగాల్‌లో ప్రభంజనం సృష్టించింది. దీదీ స్వయంగా తన సొంత నియోజకవర్గం భవానీపూర్‌లో తన మాజీ అనుచరుడు, ప్రస్తుత బీజేపీ నేత సువేందు అధికారి చేతిలో ఓడిపోవడం గమనార్హం. అయితే ఈ ఫలితాలపై మమత తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది బీజేపీ సాధించిన అనైతిక విజయం అని, ఎన్నికల సంఘం పూర్తిగా బీజేపీకి కొమ్ముకాసి, వందకు పైగా సీట్లను లూటీ చేశారని ఆమె ఆరోపించారు. అయినా తమ పోరాటం ఏమాత్రం ఆగదని ఆమె తేల్చిచెప్పారు. ఇక, తమిళనాడులో ఎవరికీ అంతుచిక్కని విధంగా సినీ నటుడు విజయ్ డీఎంకే, ఏఐఏడీఎంకేలను ఓడించారు. గత ఏడేళ్లుగా వివిధ ఎన్నికల్లో వరుస విజయాలతో ఎదురులేకుండా దూసుకుపోతున్న డీఎంకే, విజయ్ చరిష్మా ముందు నిలబడలేకపోయింది. దీనితో విజయ్ టీవీకే పార్టీ ఏకంగా 108 స్థానాలు సాధించి, మ్యాజిక్ ఫిగర్‌కు కేవలం 10 సీట్ల దూరంలో నిలిచి సంచలనం సృష్టించింది. మరోవైపు, కొళత్తూరు నియోజకవర్గంలో 2011లో స్టాలిన్ గెలుపునకు వీఎస్ బాబు వ్యూహరచన చేయగా, ఆ తర్వాత అతన్ని స్టాలిన్ దూరం పెట్టారు. ఇప్పుడు ఆ వీఎస్ బాబు చేతిలోనే స్టాలిన్ ఓడిపోవడం గమనార్హం. అయితే ఇది డీఎంకేకు ముగింపు కాదని ఒక కొత్త అధ్యాయానికి నాంది అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. తాము నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని చెప్పారు. ఓ వైపు సొంత నియోజకవర్గాల్లో పరాజయం, మరోవైపు రాష్ట్రాల్లో చేజారిన అధికారం, ఈ పరిణామాలను దీదీ, స్టాలిన్ ఎలా డీల్ చేస్తారో వేచి చూడాలి. ఏవైనా కొత్త వ్యూహాలతో తిరిగి ప్రజల ముందుకు వస్తారా? లేదా పాత వ్యూహాలతోనే ముందుకు వెళ్తారా అనేది కాలమే తేల్చాలి.

# "సైకో" పితామహుడు సిగ్మండ్ ఫ్రాయిడ్

ఆధునిక విజ్ఞానమనే మహా భవనానికి మూల స్తంభాలలో ఒకరు సిగ్మండ్ ఫ్రాయిడ్. వైద్య శాస్త్రానికి, వైద్య శాస్త్రజ్ఞులకు, మానసిక శాస్త్రజ్ఞులకు, మానసి క శాస్త్రాధ్యాపకులకు, తాత్వికు లకు విజ్ఞాన ప్రదాత. జగమం తా సెక్స్ మయంగా చూసిన ఫ్రాయిడ్ ఒక శతాబ్దం పాటు ప్రపంచంలో ఎన్నో రంగాల్ని ప్రభావితం చేశాడు. ఐన్ స్టీన్, మార్క్స్, డార్విన్ కోవలో ఫ్రాయిడ్ ను చేర్చిన సందర్భా లు లేకపోలేదు. తన సుదీర్ఘ జీవితంలో అనేక వ్యతిరేక పరిస్థితుల్ని, కష్టాల్ని, దారిద్ర్యా న్ని, వాటివల్ల కలిగే నైరాశ్యాన్నీ ఎదుర్కొన్నా, తన అన్వేషణను మాత్రం దీక్షగా కొనసాగించి, మనకు మానసిక విశ్లేషణా పద్ధతి స్వప్నాల అర్థాల ఆవిష్కరణ లాంటి విషయాలను అందించి న మహా మనీషి ఫ్రాయిడ్. ఎన్నో విజ్ఞాన గ్రంథాల, ఇతర వ్యాసాల, పరిశోధనల ఆధారం గా రచించలే కాక, విశేషంగా పర్యటిస్తూ, ఉపన్యాసాలు ఇస్తూ, చర్చా సదస్సులలో పాల్గొంటూ మానవ జాతికి జాగృతం చేసే చైతన్య వంతమైన జీవితం గడిపాడు.వైద్య శాస్త్రానికి, ప్రత్యేకించి మానసిక విశ్లేషణా పద్ధతికి ఆద్యుడయిన సిగ్మండ్ ఫ్రాయిడ్ జీవితం మానసిక వైద్యులకు మార్గ దర్శకం. మనిషి మనస్సు లో 'అచేతనం' (అన్ కాన్షియస్ నెస్) అనేది ఉంటుంది. అది మన ప్రవర్తనను మనకు తెలియ కుండానే ప్రభావితం చేస్తుంది' అన్న ఫ్రాయిడ్ విశ్లేషణ.. మనస్తత్వ విశ్లేషణలో తారక మంత్రమైంది. సిగ్మండ్ ఫ్రాయిడ్ 1856, మే 6న జెకేస్లోవేకియాలోని ఫ్రీబెర్గ్‌లో జన్మించాడు.1860లో వారి కుటుంబ మంతావియన్నాకు తరలి పోయింది. పేదరికం లోనూ కష్టపడి చదివి గ్రీస్, లాటిన్, గణితం, ప్రకృతి శాస్త్రా లు, చరిత్రలను ఒంట పట్టించు కున్న ఫ్రాయిడ్.. 1873లో వియన్నా విశ్వ విద్యాలయంలో వైద్య శాస్త్రంలో చేరాడు. నాటికి అదే వైద్య శాస్త్రంలో ప్రపంచ రాజధాని. వియన్నా యూనివర్సిటీలో 1881లో ఫ్రాయిడ్ మెడిసిన్ డిగ్రీ పుచ్చు కున్నాడు. వియన్నా జనరల్ ఆస్పత్రిలోనే పనిచేశాడు. తరువాత 1883 నుంచీ నరాలపై దృష్టి పెట్టి అధ్యయ నం చేస్తూ నిపుణుడుగా తేలాడు. పారిస్ లో అప్పటికే జీమార్టిన్ చార్కాట్ సుప్రసిద్ధ డుగా వున్నాడు. ఫ్రాయిడ్ 1885లో చార్కాట్ వద్ద అధ్యయనం చేశాడు. (1885-1886) తరువాత మెదడుపై ప్రత్యేక పరిశీలన మొదలు పెట్టి, రచనకు పూను కున్నాడు. ఫ్రాయిడ్ యిష్ట పడిందీ, అసలు చికిత్సగా నమ్మిందీ మనో విశ్లేషణ (సైకో ఎనాలసిస్). దీనివల్ల ఆయన పేరు, ప్రపంచ ఖ్యాతి వచ్చా యి. కొత్తపేర్లు ప్రచారంలోకి తేవడంలో, ఉపమానాలు వాడడంలో, గ్రీక్ రోమన్ గాథల నుండి ఉదాహరణల స్వీకరించ డంలో ఫ్రాయిడ్ దిట్ట. 30వ యేట నరాల జబ్బులను కుదిర్చే డాక్టర్ గా జీవితాన్ని ఆరంభించిన ఫ్రాయిడ్ అనువాదాలు, పుస్తక సమీక్షలు చేసేవాడు. విద్యుత్ చికిత్స, హిప్నాసిస్ (మోహనిద్ర) చికిత్సలు క్రమంగా విరమించి, కొత్త సిద్ధాంతంతో, సరికొత్త పదజాలంతో ఫ్రాయిడ్ తన ప్రాక్టీసు అవతారాన్నే మార్చేశాడు. ఆయనను ప్రపంచం గుర్తించింది. నరాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఫ్రాయిడ్ తన తొలి రచన 1891లో వెలువరించాడు. నరాల విషయంలో అది గొప్ప గ్రంథంగా పేరొందింది. 1883లో నరాల పరిశీలన ఆరంభించిన ఫ్రాయిడ్ 1897 వరకూ అందులో నిమగ్నుడయ్యాడు. ఫ్రాయిడ్ కొత్తగా వైద్యం ప్రాక్టీసు చేస్తున్న రోజులలో ఎలక్ట్రో థెరపీ వుండేది. "స్టడీస్ ఇన్ హిస్టీరియా" అనే రచనలో ఫ్రాయిడ్ "ఎలక్ట్రో థెరపీ" గురించి ప్రస్తావించాడు. ఫ్రాయిడ్ సెక్స్ సిద్ధాంతాలు ప్రపంచాన్ని బాగా ఆకర్షిం చాయి. గనేరియా, సిఫిలిస్ వంటి లక్షణాలు దృష్టిలో పెట్టుకొని ఫ్రాయిడ్ తన సెక్స్ సిద్ధాంతంలో వివరణ యిచ్చా డు. క్రమేణా "సైకో ఎనాలసిస్", అనే ఫ్రాయిడ్ సిద్ధాంతం పుంజుకున్నది. హిస్టీరియా, కలలు, కోర్కెల్ని అణచు కోవడం, చిన్న తనంలో సెక్స్, అచేతనం అనేవాటిని ఫ్రాయిడ్ ప్రచారంలోకి తెచ్చాడు. ఇరవ య్యో శతాబ్దం ఆరంభంలోనే ఫ్రాయిడ్ తన సిద్ధాంత రచనలు లోకానికి చాటాడు. దీని ఆచరణకు ఉపక్రమించిన వారు సైకో ఎనాలసిస్ ను ఒక ఉద్యమంగా స్వీకరించారు. ఎదురు చెప్పడానికి భయ పడ్డారు. ఫ్రాయిడ్ పలుకుబడి అలా వుండేది. మానసిక రుగ్మతులకు సరైన చికిత్స చేయడానికి దోహద పడే క్లినికల్ న్యూరాలజీకి సంబంధించి చాలా రకాల అధ్యయనం చేసిన ఫ్రాయిడ్.. న్యూరాలజీ, మెదడు పని చేసే విధానం గురించి అనేక పరిశోధక పత్రాలు ప్రచురిం చారు. "సైకో అనాలసిస్" అన్న పదం వాడిందీ, ఆ అంశం ఒక సబ్జెక్టుగా అభివృద్ధి చేసిందీ ఫ్రాయిడ్. సైకో అనాలసిస్‌ను ఫ్రాయిడ్ ఒక థెరపీగా ప్రతిపా దిస్తూ వ్యాసాలు రాశాడు. నరాల జబ్బుకు లైంగిక సంబంధమైన మూలం వున్నద ని, సెక్స్ కారణాలుగా జబ్బులు వస్తాయని అనేక ఉపమా నాలు, కథలు, గ్రీకు గాథలు ఉదహరించి, విస్తారంగా వివరించాడు. "సైకో ఎనాల సిస్". అంటే "మనో విశ్లేషణ" ప్రపంచ ఉద్యమంగా వ్యాపించి, సంఘాలు వెలిశాయి. రోగిని మాట్లాడనిచ్చి, అతని పదాల లో అర్థాన్ని గూఢార్థాన్ని సంకేతాలను విప్పి చెప్పడం "సైకో ఎనాలసిస్ చికిత్స". ఈ విద్యలో ఫ్రాయిడ్ ఆరితేరిన వాడు. హిస్టీరియా అంటే ఏమిటి, అణచివేతకు అర్థం ఎలా చెప్పాలి, కలలు వాటి స్వభావం, చిన్నప్పటి సెక్స్ ప్రవృత్తి, అచేతనం బలం గురించి ఫ్రాయిడ్ చెప్పినవి ఆకర్షణీయంగా అంటుకు పోయాయి. సైకో ఎనాలసిస్ రంగంలో ఫ్రాయిడ్ సిద్ధాంతాలు ప్రచారంలో పెట్టడానికి యూంగ్ యాడ్లర్ కు తోడు, కార్ల్ అబ్రహం, విల్ హెల్మ్ స్టెకల్ వంటివారు బాగా కృషిచేశారు. ఫ్రాయిడ్ అనంతరం కారన్ హార్నే, హారీస్టాక్ సల్లివన్, ఎరిక్ ఫ్రాంలు యీ రంగంలో నిలిచి పనిచేశారు. ఫ్రాయిడ్ మూలాధారం అవ్యక్త మనస్సు. అదే వ్యక్తుల్ని కదిలించి, నడిపించి, మాట్లాడిస్తుంది. అంటే మానవుడిని అవ్యక్త మనస్సు నిర్దేశిస్తుంది. మానవుడి ప్రవర్తన గురించి "ది సైకోపాథాలజీ ఆఫ్ ఎవ్విరిడే లైఫ్" లో ఫ్రాయిడ్ వివరించాడు. మెదడు పనితీరుపై అనేక పరిశోధనలు చేసి, ఆస్ట్రియా, జర్మనీ, ఫ్రాన్స్ లలో జీవించిన ఫ్రాయిడ్, తన చివరి రోజులలో హిట్లర్ నాజీ నియంతృత్వ ధోరణుల వల్ల ఇంగ్లాండ్ వెళ్ళి అక్కడే గడిపి కేన్సర్ తో 1939, సెప్టెంబరు 23న కన్ను మూశారు. "ది ఫ్యూచర్ ఆఫ్ ఇల్యూజన్" లో ఫ్రాయిడ్ మత విమర్శ చేశాడు. మతాన్ని ఆద్యంతాలు వ్యతిరే కించి, మతం అనేది ఒక భ్రమ అనీ, అయితే ఓదార్పు యిచ్చే విషయంగా అది పరిణ మించిందనీ ఫ్రాయిడ్ అన్నాడు. మతం నుండి బయట పడిన వారు, స్వేచ్ఛగా సంపూర్ణ జీవనం సాగించగలరని కూడా ఫ్రాయిడ్ చెప్పాడు. దీనితో మతస్తులు ఆయనపై విరుచుకు పడ్డారు. సనాతన మత నమ్మకాలు గల కుటుంబంలో పుట్టిన ఫ్రాయిడ్ తనకు నాస్తికుడుగా పేర్కొన్నాడు. కాని జీవితమంతా యూదుగానే వున్నాడు. ఇరవయ్యో శతాబ్దంలో మానసిక ప్రపంచం లోని అంశాల గురించి శోధించడానికి ఫ్రాయిడ్ చేసిన పరిశోధనలే మూలంగా ప్రచార మొందాయి. ఫ్రాయిడ్ పరిశోధనలు విభిన్న రంగాలపై, ప్రాంతాలపై ప్రసరించాయి. సాహిత్య కళా రంగాలపై సైతం ఫ్రాయిడ్ ఆలోచనల ప్రభావం ఉంది.

# లొంగిపోని మనసే.. విజయానికి అసలైన రహస్యం

జీవితమంటే ఒక యుద్ధభూమి. అది కేవలం బయట ప్రపంచంతో చేసే యుద్ధం మాత్రమే కాదు, ప్రతి క్షణం మన మనసులో మనతో మనం చేసుకునే అంతర్మథనం. ఆ యుద్ధభూమిలో ప్రతి మనిషీ ఒక యోధుడే. కానీ, విధి ఆడే వింత నాటకంలో కొందరు పోరాడుతూ మోకరిల్లుతారు, మరికొందరు ఓటమిని చూసి కూడా లేచి నిలుస్తారు. ఈ రెండింటి మధ్య వ్యత్యాసం ఏమిటి? కేవలం రెండు అక్షరాల నినాదం "లొంగిపోకు!" ఈ చిన్న మాటలో ఉన్న శక్తి అపారమైనది. దీనిని అర్థం చేసుకున్నవారికి, ఆత్మ విశ్వాసాన్ని నింపుకున్నవారికి ఈ ప్రపంచంలో అసాధ్యమైనదంటూ ఏదీలేదు.



ఈ వ్యాసం మీలోని ఆ అద్భుతమైన స్థైర్యాన్ని, అమూల్యమైనపట్టుదలను వెలికితీసి, మనసులో ఒక నూతన ఉత్సాహాన్ని నింపడానికి చేస్తున్న ఒక చిన్న ప్రయత్నం.అపజయం అంటే అంతము కాదు, అది ఒక మలుపు జీవితంలో ఏదైనా పని మొదలుపెట్టినప్పుడు ఆశించిన ఫలితం రాకపోతే, మనం చాలా త్వరగా నిరాశ చెందుతాం. నా వల్ల కాదు, నాకు అదృష్టం లేదు,ఇక్కడితో ఈ కథ ముగిసింది అని మనకు మనమే ఒక తీర్పు ఇచ్చేసుకుంటాం. కానీ ఒక విషయం గుర్తుంచుకోండి అపజయం అనేది ఒక గోడ కాదు, అది దారిలో వచ్చిన ఒక వంపు మాత్రమే. ఆ వంపు తిరిగితేనే కదా అసలైన గమ్యం కనిపించేది!ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ ఆల్వా ఎడిసన్ విద్యుత్ బల్బును కనుగొనే క్రమంలో దాదాపు వెయ్యి సార్లు విఫలమయ్యారు. ఒక సాధారణ వ్యక్తి అయితే వంద ప్రయత్నాలకే విసిగిపోయి ఉండేవాడు. కానీ ఎడిసన్ ప్రతి వైఫల్యాన్ని ఒక పాఠంగా మార్చుకున్నారు. ఎవరైనా వేయిసార్లు విఫలమయ్యారు కదా! అని అడిగినప్పుడు, ఆయన చెప్పిన సమాధానం చరిత్రలో నిలిచిపోయింది.నేను విఫలం కాలేదు. బల్బు తయారుకాని వెయ్యి మార్గాలను కనుగొన్నాను. ఇదే "లొంగిపోకు" అనే స్ఫూర్తి యొక్క అసలైన అర్థం. మనకు ఎదురయ్యే ఓటములు, మన గమ్యాన్ని చేరుకోవడానికి మనం అనుసరించకూడని మార్గాలను చూపే దిక్సూచీలు మాత్రమే.నిరంతర ప్రయత్నం నీటి చుక్క రాయిని గెలిచినట్లు ఒక చిన్న నీటి చుక్క, మెత్తనిది.అది కఠినమైన రాయిపై పడుతుంటే మొదట్లో ఏమీ జరగదు. కానీ నిరంతరం ఆ చుక్కలు రాయిపై పడుతూ ఉంటే, కాలక్రమేణా ఆ రాయిలో ఒక లోతైన గొయ్యి ఏర్పడుతుంది. నీటి చుక్క ఆ రాయిని తన బలంతో గెలవ లేదు, తన పట్టుదలతో గెలిచింది. అది ఆగలేదు, అలసిపోలేదు, నా వల్ల కాదేమో అని వెనక్కి తగ్గలేదు.ఇదే మనజీవన సత్యం. మనం చేసే ప్రతి చిన్న ప్రయత్నం ఆ నీటి చుక్కలాంటిదే. మీరు ఒక లక్ష్యం కోసం శ్రమిస్తుంటే, ఒక్కరోజులో ఫలితం రాకపోవచ్చు, ఒక నెలలో రాకపోవచ్చు. కానీ ఆగిపోకుండా ప్రయత్నిస్తే, అసాధ్యమైనది కూడా సుసాధ్యం అవుతుంది. పట్టుదల ముందు ఏఅడ్డంకీ, ఏ కష్టమూ శాశ్వతంగా నిలువలేదు. మీరు వెనక్కి తగ్గనంత వరకు, గెలుపు మీకు దూరంగా ఉండదు. అతిథిగా వచ్చే నిరాశ జీవితంలో కష్టాలు, నిరాశ రావడం సహజం. అది ఒక అతిథి లాంటిది. వస్తుంది, కొన్నాళ్ళు మీతో ఉంటుంది, మీ మనసును భారంగా మారుస్తుంది. కానీ ఆ అతిథి మీ ఇంటికి యజమాని కాదు. ఆ నిరాశకు మీమనసులో శాశ్వత నివాసం కల్పించకండి. మనందరికీ తెలిసిన గొప్ప గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ తన జీవితంలో ఎన్నో అవమానాలను, పేదరికాన్ని అనుభవించారు. కానీ ఆ చీకటి రోజుల్లో కూడా ఆయన తనలోని జ్ఞానదీపాన్ని ఆర్పలేదు. అట్లాగే, మన తెలుగు నేల గర్వించదగ్గ మహాకవి గురజాడ అప్పారావు తన కవితల ద్వారా సమాజాన్ని మేల్కొల్పే క్రమంలో ఎంతో ఒంటరితనాన్ని భరించారు. వీరెవరూ లొంగిపోలేదు. వారు ఆ నిరాశను తమలోని సృజనాత్మకతకు ఇంధనంగా మార్చుకున్నారు.నిరాశ మీకు ఎదురైనప్పుడు, దానికి ఒక పరిమితిని విధించండి. నువ్వు రావచ్చు, కానీ నన్ను ఆపలేవు అని గట్టిగా చెప్పే ధైర్యం మీకు ఉండాలి. ఆ శక్తి పేరే "లొంగిపోకు!"తెలుగు నేల వీరుల వారసత్వం మన తెలుగు నేల ఎందరో వీరులను, త్యాగులను కని పెంచింది. అల్లూరి సీతారామరాజు మన్యం అడవుల్లో తుపాకీకి ఎదురొడ్డి నిలిచారు. బ్రిటిష్ వారి అరాచకా లను చూసిలొంగిపోలేదు. పొట్టి శ్రీరాములు తెలుగు వారి ఆత్మగౌరవం కోసం ప్రాణాలను అర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో అశేష తెలుగు తల్లులు తమ పిల్లలను దేశం కోసం పంపారు. ఆ వీరుల నరాల్లో ప్రవహించిన రక్తమే, ఈ రోజు మనలో కూడా ప్రవహిస్తోంది. మన సమస్యలు వేరు కావచ్చు, మన యుద్ధభూమి వేరు కావచ్చు, కానీ ఆ పట్టుదల, ఆ తెగింపు మనకు వారసత్వంగా వచ్చిన గుణాలు. ఆ గుణాలను మేల్కొల్పి, మనం ఎదుర్కొనే సమస్యలనుఎదుర్కోవడమేమన కర్తవ్యం."లొంగిపోకు" అంటే ఏమిటి? చాలామంది "లొంగిపోకు" అంటే ఏదో కోపంతో, అహంకారంతో పదిమం దిని ఎదిరించడం అనుకుంటారు. అది తప్పు. నిజమైన "లొంగిపోకు" అంటే,మీ కలలకు, మీ ఆశలకు లొంగిపోకుండా వాటిని సాకారంచేసుకునే ప్రయత్నం కొనసాగించడం. పడిపోయిన ప్రతిసారీ, సరే, ఇప్పుడు నాకు ఈ పాఠం అర్థమైంది, మళ్ళీ మొదలుపెడతాను అని నిలబడటం.మీ ఆత్మగౌరవానికి, మీ విలువలకు కట్టుబడి ఉండటం. కష్టకాలంలో అడ్డదారులు తొక్కకుండా ధర్మంగా గెలవడానికి ప్రయత్నించడం.మీ ఆరోగ్యం మరియు మనసును ప్రేమించుకోవడం. అలసిపోయినప్పుడు విశ్రాంతి తీసుకోవడం కూడా లొంగిపోవడం కాదు, మళ్ళీ పోరాడటానికి సిద్ధమవ్వడమే.ఓటమి ఒక గొప్ప గురువు ప్రతి విఫలత మీకు ఒక అమూల్యమైన పాఠాన్ని నేర్పిస్తుంది. పరీక్షలో తప్పినప్పుడు, అది మీ తెలివితేటల పరీక్ష కాదు, మీ కృషిని మరింత పెంచుకోవాలనేసంకేతం. వ్యాపారంలో నష్టపోయినప్పుడు, అది మీ వైఫల్యం కాదు, మార్కెట్ పరిస్థితుల పట్ల మీకు వచ్చిన ఒక అనుభవం. ప్రేమలో విఫలమైనప్పుడు, అది మీ విలువ తగ్గినట్టు కాదు, మీలోని భావోద్వేగాలను, పరిణతిని పెంచుకునే అవకాశం. ఈ పాఠాన్ని నేర్చుకోవడానికి ధైర్యం కావాలి. ఆ ధైర్యం కేవలం ఓటమిని అంగీకరించి, దాని నుండి నేర్చుకునే వారికే లభించే వరం.కష్టకాలంలో మీ చుట్టూ ఉన్నవారిని గమనించండి మీరు ఒంటరి వారు కాదు. మీ నాన్న తన యవ్వనంలో కుటుంబం కోసం ఎన్ని కష్టాలు అనుభవించాడో ఒక్కసారి ఆలోచించండి. మీ అమ్మ ఎన్ని బాధలను దిగమింగుకుని మిమ్మల్ని నవ్వుతూ పెంచిందో గుర్తు తెచ్చుకోండి. పొలాల్లో ఎండనకా, వాననకా కష్టపడే రైతును చూడండి. ప్రతి కరువులోనూ మళ్ళీ విత్తనాలు నాటుతాడు. ఆ రైతుకి రేపు వర్షం పడుతుందో లేదో తెలియదు, కానీ ప్రయత్నం మాత్రం ఆపడు.అది "లొంగిపోకు"అనే స్ఫూర్తికి నిలువుటద్దం. మీరు కూడా ఆ పరంపరలో భాగమే. చివరి మాట నీకు నీవే నమ్మకం ప్రపంచంలో అనేకమంది మీకు కాదు అని చెప్పవచ్చు. అనేక పరిస్థితులు ఇక్కడితో ఆపేయ్ అని హెచ్చరించవచ్చు. కానీ, ఆ కాదు లను దాటి, ఆ ఆపేయ్ ల మధ్యలో నుండి లేచి నిలబడే శక్తి మీలో ఉంది. మీ కలలను వదులుకోకండి. ప్రపంచంలోని అతిపెద్ద విజేతలందరూ ఒకప్పుడు మీలాంటి సాధారణ వ్యక్తులే. వారిలో ఉన్న ఏకైక తేడా ఏమిటంటే వారు లొంగిపోలేదు.రేపటి సూర్యోదయం మీ కోసమే వస్తుంది. ఆ వెలుతురులో కొత్త ఉత్సాహంతో నిలబడండి. మీ గుండె నిండా ఆత్మవిశ్వాసాన్ని నింపుకోండి. గతాన్ని వెనక్కి వదిలేసి, వర్తమానాన్ని గెలిచేందుకు మళ్ళీ ప్రారంభించండి. లొంగిపోకు! ఎందుకంటే, రేపటి విజేత నువ్వు కావాలని నీ జీవితం నిన్ను నిరీక్షిస్తోంది. పడిపోవడం పాపం కాదు, పడిపోయిన చోటే ఆగిపోవడం మాత్రమే అసలైన అపజయం!



డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169

# హార్డ్‌వేర్ పార్క్‌లో కొత్త పెట్టుబడులు

## బిఎఎస్ ఎఫ్, ఐటీపీ ఏరో సంస్థల విస్తరణతో ఉద్యోగావకాశాలు



**విశ్వంభర, హైదరాబాదు :** హైదరాబాదు నగరానికి మరోసారి అంతర్జాతీయ పెట్టుబడులు పెద్ద ఎత్తున వచ్చాయి. ఒకవైపు జర్మనీకి చెందిన ప్రముఖ రసాయన సంస్థ బిఎఎస్ ఎఫ్ రెండు గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లను ఏర్పాటు చేయగా, మరోవైపు ఏరోస్పేస్ రంగ సంస్థ ఐటీపీ ఏరో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ హార్డ్‌వేర్ పార్క్ (ఫేజ్-3)లో కొత్త ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఐటీపీ ఏరో ఇండియా ప్లాంట్‌కు భూమిపూజ చేపట్టారు. రూ.453 కోట్ల పెట్టుబడితో 10 ఎకరాల్లో నిర్మించనున్న ఈ యూనిట్‌లో విమాన ఇంజన్లకు అవసరమైన రిజిడ్ ట్యూబ్స్‌కు సంబంధించిన ఎండ్ ఫిట్టింగ్స్, బ్రాకెట్లు తయారు చేయనున్నారు. ఈ ప్లాంట్‌లో 2027 నాటికి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభం కానుండగా, ప్రిసిషన్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో మొదటిగా 350 మందికి ఉపాధి లభించనుంది. ఈ సంఖ్య భవిష్యత్తులో 600కు పెరగనుంది. ఇక బిఎఎస్ ఎఫ్ సంస్థ హైదరాబాదులో గ్లోబల్ డిజిటల్ హబ్, గ్లోబల్ సర్వీసెస్ హబ్‌లను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ రెండు కేంద్రాల ద్వారా సుమారు 3,000 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. రాష్ట్రంలో ఐటీ, పరిశ్రమల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. వచ్చే ఏడాదిలో 100 జిసిసిల ఏర్పాటుతో లక్ష మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యమని వెల్లడించారు. హైదరాబాదును ఆవిష్కరణలు, ఇంజనీరింగ్ రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఎన్విడియా, మైక్రోసాఫ్ట్, గూగుల్, వాన్‌గార్డ్, ఎలీ లిల్లీ, మారియట్ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు నగరంలో కార్యకలాపాలు విస్తరించి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాయి. ఈ కార్యక్రమాల్లో సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా వడ్డెర సంఘం అధ్యక్షురాలి జన్మదిన వేడుకలు

**విశ్వంభర. నిజాంపేట్:** అఖిలభారత వడ్డెర సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మెడిటేషన్ టీచర్ డాక్టర్ కుంచపు రమ జన్మదిన వేడుకలు ఆశ్రయ ఓల్డ్ ఏజ్, అనాధ పిల్లల ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ, ఈ అనాధ వృద్ధులు పిల్లల సమక్షంలో తన పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందని తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి అల్పాహారం పండ్లు బట్టలు పంపిణీ, చేయడం జరిగింది. ఆశ్రయ అనాధాశ్రమం యాజమాన్యంతో మాట్లాడిన రమ ముందు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తనను సంప్రదించవలెనని తెలిపారు.

## ఆర్టీసీ క్రాస్ రోడ్ లో చలివేంద్రం ఏర్పాటు




**విశ్వంభర, చిక్కడపల్లి :** హైదరాబాదు ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద అక్షర స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్, గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు జి భారత్ గౌడ్, వినయ్ కుమార్, నవీన్, తదితరులు పాల్గొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అతిథులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, ఉమేష్, శ్రీనివాస్, సురేష్, నీరజ్, లక్ష్మి, లావణ్య, రాణి, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు కుటుంబానికి ఆర్థిక చేయూత

### చెక్కు అందజేసిన జిల్లా ఎస్పీ నరసింహ



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ పోలీస్ స్టేషన్ లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ యాదగిరి ఇటీవల మరణించడం చాడు. దివంగత పోలీసు సిబ్బంది కుటుంబాల అవసరాలు తీర్చడం లో భాగంగా పోలీసు చేయూత పథకం ద్వారా యాదగిరి కుటుంబ సభ్యులకు 2 లక్షల రూపాయల పోలీసు చేయూత పథకం చెక్కును ఎస్పీ నరసింహ ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పోలీసు శాఖ కృషి చేస్తుంది. యాదగిరి కుటుంబాన్ని పోలీస్ శాఖ అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపినారు. చేయూత పథకం నిర్వహణకు జిల్లా పోలీసు సిబ్బంది ప్రతి నెల జీతం నుండి విరాళం అందిస్తున్నారు అని అభినందించారు, పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమం నందు వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## హెచ్‌సీయూలో ఘటనలపై ఖండన

**విశ్వంభర, హైదరాబాదు :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నాటక ప్రదర్శన సందర్భంగా జరిగిన దాడిని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఖండించింది. మే 3, 4 తేదీల్లో జరిగిన ఘటనల్లో విద్యార్థులపై దాడి జరిగి పలువురు గాయపడ్డారు. క్యాంపస్‌లో హింసకు పాల్పడిన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని, గాయపడిన వారికి వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేసింది. విద్యార్థుల భద్రతకు యూనివర్సిటీ యాజమాన్యం బాధ్యత కోరింది. విద్యా స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ హక్కులను కాపాడాలని రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు ప్రకటనలో తెలిపారు.

### విశ్వంభర వార్తకు స్పందన

## ఇసుక మొరం దందాలపై వరుస కథనాలతో స్పందన

### కదిలిన జిల్లా యంత్రాంగం




విశ్వంభర
మామూళ్లు.. ఇక్కడ మామూలే.!
అకాల వర్షానికి ఐకెపి సెంటర్లో తడిసిన వరి ధాన్యం

**విశ్వంభర , నిజామాబాద్ :** నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాలలో ఇసుక, ఎర్ర మట్టి నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రవాణా పై విశ్వంభర పత్రికలో "మామూళ్ళు ఇక్కడ మామూలే " అని శీర్షికతో వచ్చిన వార్తకు నిజాంబాద్ జిల్లాలోని ప్రభుత్వ యంత్రాంగం కదిలింది . బాల్కొండ నియోజకవర్గం ఏర్గట్ల మండలం కేంద్రంలో అక్రమంగా మొరం తవ్వకాలపై అధికారులు ఉక్కుపాదం మోపారు. ఏర్కట్ల ఒక జెసిబి నాలుగు లారీలు పోలీసులు పక్కా సమాచారం అందుకొని దాడి చేసి సీజ్ చేశారు. ఎవరైనా అనుమతులు లేకుండా మొరం, ఇసుక తరలిస్తే వారికి పై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాలనుసారం వేల్పూర్ మండలం అర్ధరాత్రిలో అక్రమ రవాణా జరుగుతుందని పక్క సమాచారం అందుకుని ఇసుక రెండు లారీలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## కో ఆప్షన్ సభ్యత్వంపై నారబోయిన సరిత శ్రీనివాస్ ఆవేదన

### బీఆర్ఎస్ నాయకత్వంపై తీవ్ర అసంతృప్తి



**విశ్వంభర, సంగారెడ్డి :** జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీలో కో ఆప్షన్ సభ్యత్వం విషయంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు నారబోయిన సరిత శ్రీనివాస్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 2001 సంవత్సరం నుండి బీఆర్ఎస్ పార్టీలో చురుకుగా పనిచేస్తూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానని, 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరినా టికెట్ రాకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆహ్వానం మేరకు తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఇద్దరు కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపిస్తే కో ఆప్షన్ మెంబర్ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ మాట నమ్మి బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి గడపగడపకు తిరిగి కృషి చేశానన్నారు. రెండో వార్డు అభ్యర్థి విజయానికి తన శ్రమ కారణమైందని, మొదటి వార్డు అభ్యర్థి ఓటమికి పార్టీ నాయకుల అంతర్గత విభేదాలే కారణమని ఆరోపించారు. ఎన్నికల అనంతరం కో ఆప్షన్ సభ్యత్వం ఇస్తామని చెప్పి చివరికి మాట తప్పారని ఆయన విమర్శించారు. కో ఆప్షన్ పదవి విషయమై కౌన్సిలర్లు, స్థానిక ఎమ్మెల్యే, బొల్లారం బాల్ రెడ్డి, శంబిపూర్ రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి తదితరులను పలుమార్లు కలిసినప్పుడు తనకే పదవి ఇస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అయితే ఈ నెల 30వ తేదీన తన పేరును తిరస్కరించారనే సమాచారం రావడంతో పెద్దలను అడిగితే ఇంకా తనకే అవకాశం ఉందని చెప్పారని తెలిపారు. అయితే మంగళవారం జరిగిన పరిణామాల్లో కో ఆప్షన్ సభ్యత్వాన్ని పులిగిల్ల లక్ష్మి ప్రకాష్ చారికి కట్టబెట్టారని, మాజీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాష్ చారి బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎన్నికల్లో మద్దతుగా పనిచేయలేదని ఆరోపించారు. అలాంటి వారికి పదవి ఇవ్వడం బాధాకరమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని లాఠీ దెబ్బలు తిని, అయ్యప్ప మాలలో ఉన్న సమయంలో జైలుకు వెళ్లిన తనలాంటి ఉద్యమ నాయకుడికి అన్యాయం చేయడం బాధ కలిగించిందని నారాబోయిన సరిత శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**విశ్వంభర, సంగారెడ్డి :** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ పూర్తి పారదర్శక పాలన అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్చెరు లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. రామచంద్రాపురం, పటాన్చెరు, అమీన్పూర్ రెవెన్యూ మండలాల పరిధిలోని 226 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆడపిల్ల పెళ్లి భారం కాకూడదన్న సమన్నత లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అని విప్లవాత్మక పథకాన్ని పెట్టారని గుర్తు చేశారు. పటాన్చెరు నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఆర్థిక అభ్యున్నతికి పాటుపడుతున్నట్లు తెలిపారు.. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ రవాణా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**విశ్వంభర, ముషీరాబాదు :** ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రభుత్వం బాధ్యత వహించాలని బిపిటియంయం నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాదు ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో నిర్వహించిన మహా ధర్నాలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. యాప్ ఆధారిత సేవలు, పెరుగుతున్న చలానాలు, పార్కింగ్ సౌకర్యాల లేమి కారణంగా డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తెలంగాణ స్టేట్ ఆటో & ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి పెంటయ్య గౌడ్ మాట్లాడుతూ డ్రైవర్ల ఆత్మహత్యలకు ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. తెలంగాణ ప్రభారి గీతా సోనీ, రాష్ట్ర అధ్యక్షుడు నంద కిషోర్ పార్కింగ్ సౌకర్యాలు, కనీస భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె శ్రీధర్ రెడ్డి, అధ్యక్షుడు లిఖిత్ కుమార్, నాయకులు మీనా, సంతోష్ మాట్లాడుతూ డ్రైవర్ల కోసం ప్రత్యేక సౌకర్యాలు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, యాప్ ఆధారిత అక్రమ రవాణాపై చర్యలు, డ్రైవర్లకు గృహాలు, కనీస వేతనాలు, బీమా సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో వివిధ యూనియన్ల నాయకులు, పెద్ద సంఖ్యలో డ్రైవర్లు పాల్గొన్నారు.

## పోలీస్, స్త్రీ శిశు సంక్షేమ శాఖలో పూర్తయిన స్వీయ గణన కార్యక్రమం

### అదనపు జనాభా గణన అధికారి అనిల్ కుమార్



**విశ్వంభర, మహబూబాబాద్:** కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు జిల్లాలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, తదితర అన్ని విభాగాలలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ స్వీయ గణన కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశాల మేరకు, ఈరోజు జిల్లాలో స్త్రీ శిశు సంక్షేమ శాఖలోని (6)విభాగాలు, ఐసిపిఎస్, సిహెచ్ఎల్, సఖి, పోషణ్ అభియాన్, హబ్ ఉమెన్ సేఫ్టీ విభాగాలలో పనిచేస్తున్న 200 మంది, అలాగే వారి విభాగాల సిబ్బంది సుమారు 1500 మంది ఆన్లైన్ లో నమోదు చేసుకున్నారు. జిల్లాలోని పోలీస్ విభాగం డిఎస్పి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆన్లైన్ ద్వారా పోలీస్ అధికారులు, సిబ్బంది ఉద్యోగులు ఈరోజు స్వీయ గణన కార్యక్రమంలో తమ వివరాలను నమోదు చేసుకొని ఐడి పొందారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ స్వీయ గణన కార్యక్రమంలో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ స్వీయ గణన కార్యక్రమంలో ఆన్లైన్ ద్వారా డీఎస్పీ తిరుపతిరావు, ముఖ్య ప్రణాళిక అధికారి వల్లూరి శ్రీనివాసరావు, వెల్ఫర్ అధికారిని సబిత, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, సిడిపిఓలు శిరీష రాజ్యలక్ష్మి ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ డీసీసీ కార్యవర్గ సభ్యునిగా మామిండ్ల సురేష్



**విశ్వంభర, హనుమకొండ:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బి. మహేష్ కుమార్ గౌడ్ ఎంఎల్సీ ఉత్తర్వుల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరి, కార్యవర్గ సభ్యుల నియామకాలు ఖరారయ్యాయి. ఈ నియామకాల్లో భాగంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వెంకట్ రాం రెడ్డితో సంప్రదించి ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి రావాలని పీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 31వ డివిజన్ న్యూ శాయంపేట కు చెందిన మామిండ్ల సురేష్‌కు జిల్లా కార్యవర్గ సభ్యునిగా అవకాశం దక్కింది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నందున ఈ పదవి ఆయనకు దక్కింది. డీసీసీ సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా మామిండ్ల సురేష్ పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు వెంకటరాం రెడ్డి, ఎంపీ కడియం కావ్య, కాంగ్రెస్ నాయకులు భట్టి శ్రీనివాస్, ఈ వి శ్రీనివాస్ 31 డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు కి , డివిజన్ స్థానిక కాంగ్రెస్ నాయకు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## లేబర్ కార్డులు ఇచ్చి ప్రమాద బీమా కల్పించాలి

### ఐద్వా మహిళా సంఘం డిమాండ్



**విశ్వంభర , నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లా, ఆర్మూర్ మండల్ చేపూర్ గ్రామంలో ఐద్వా కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ఉపాధి హామీ కూలీలను కలిసి ఐద్వా జిల్లా కార్యదర్శి బెజ్గం సుజాత మాట్లాడుతూ, ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని, వారికి కూర్చోవడానికి టెంట్ ఏర్పాటు చేసి మంచినీళ్లు అలాగే అకస్మాత్తుగా ఎవరికైనా గాయాలైతే పని ప్రదేశాల్లో మెడికల్ కిట్టు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఉపాధి హామీ కూలి చేసుకునే ప్రతి ఒక్కరికి లేబర్ కార్డులు ఇచ్చి ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి అల్లెపు వెంకటేష్ చేపూర్ ఐద్వా సభ్యులు గంగు భాయ్ సత్యమ్మ రాజు భాయ్ అన్నపూర్ణ బుజ్జవ్వ చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి ఒక గేమ్ చెంజర్ : మెట్టు సాయి




**విశ్వంభర,హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలకు ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి గట్టి కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి ఒక గేమ్ చేంజర్ అని, ఆయనో వారియర్, సోల్జర్ అని అభివర్ణించారు. రేవంత్ రెడ్డిపై బీజేపీ నేతలు పనిగట్టుకుని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ ప్రచారం చేసిన చోట కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారని గుర్తుచేసిన మెట్టు సాయి.. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలన్నీ సీఎం రేవంత్ రెడ్డి వైపే చూస్తున్నాయని స్పష్టం చేశారు. ఇక బీజేపీ అంతర్గత పరిస్థితులపై మెట్టు సాయి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీలో ఎవరికి వారికే వర్గాలు ఉన్నాయని.. అసలు ఆ పార్టీని సొంత నాయకులే సరిగ్గా నమ్మరని, ఇక ప్రజలు ఎలా నమ్ముతారని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ మాటల తీరు చూస్తుంటే.. ఆయన ఇంకా ఒక కార్పొరేటర్ లాగానే మాట్లాడుతున్నారని విమర్శించారు. సొంత పార్టీ నాయకులే ఆయన్ని అగౌరవపరుస్తున్నారని ఎత్తిచూపారు. ఎండాకాలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, ఆ ఎండల వల్లే బండి సంజయ్ ఇలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కాబట్టి ఈ ఎండాకాలం ఆయన బయటకు రాకపోవడమే మంచిదంటూ మెట్టు సాయి పేర్కొన్నారు.

## గడ్డపోతారం మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక

**విశ్వంభర, సంగారెడ్డి :** పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని గడ్డపోతారం మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల ఎన్నికలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపిన అభ్యర్థులు విజయం సాధించారు. జనరల్ మహిళ కోటాలో పులిగిల్ల లక్ష్మి ప్రకాశ్ ఎన్నిక కాగా, జనరల్ పురుషుల కోటాలో ఎం. రవీందర్ విజయం సాధించారు. అలాగే మైనారిటీ మహిళ కోటాలో రైస ఖాతూన్, మైనారిటీ పురుషుల కోటాలో ఎం.ఏ. సమీర్ ఎన్నికైనట్లు అధికారులు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను అధికారులు ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. కొత్తగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులకు స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు అభినందనలు తెలియజేశారు.



ప్రజా విశ్వంభర

# సాగు విధానాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



విశ్వంభర, సూర్యాపేట: జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యానవన శాఖల సమన్వయంతో సాగు విధానాల్లో విప్లవాత్మక మార్పులు రావాలని, ముఖ్యంగా రైతులు అధిక ఆదాయం అందించే పంటలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన రైతు వారం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. వ్యవసాయం కేవలం సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే విధంగా ఆధునీకరణ చెందాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఉద్యానవన మరియు వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి, క్షేత్ర స్థాయిలో రైతుల్లో అవగాహన పెంపొం దించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్ పామ్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సాగు విస్తీర్ణాన్ని భారీగా పెంచాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి, ఇప్పటికే సాగు చేస్తున్న తోటలకు 'ఫీల్డ్ విజిట్' చేయించాలని, తద్వారా సాగు పద్ధతులు, వచ్చే లాభాలపై వారికి ప్రత్యక్ష అవగాహన కల్పించాలని సూచించారు. మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని, లబ్ధిదారుల జాబితాను తక్షణమే సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో నీటి వసతి పుష్కలంగా ఉన్న నేపథ్యంలో, కూరగాయల సాగును లాభసాటిగా మార్చాలని కలెక్టర్ పేర్కొన్నారు. కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులు, వ్యవసాయ యంత్రీకరణను జోడించి శ్రమను తగ్గించి దిగుబడిని పెంచాలని తెలిపారు.. కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె) ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలన్నారు. నీటి పొదుపుతో పాటు సాగు వ్యయం తగ్గించేందుకు సాంకేతికతను వాడాలని సూచించారు. పర్యావరణానికి మేలు చేసే, తక్కువ ఖర్చుతో కూడిన నానో యూరియా వాడకంపై విస్తృత ప్రచారం చేయాలి. ఇందులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) చొరవ చూపి రైతులకు చేరువ చేయాలని కలెక్టర్ తెలిపారు. వరి ఒక్కటే కాకుండా, మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని , ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో రైతులతో సమన్వయం చేసుకుంటూ, వారికి అదనపు ఆదాయం కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి మాట్లాడుతూ సాంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి, అధిక ఆదాయాన్నిచ్చే ఆయిల్ ఫామ్ సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణరెడ్డి పిలుపునిచ్చారు. ఆయిల్ ఫామ్ ఒకసారి నాటితే దాదాపు 25 నుండి 30 ఏళ్ల వరకు నిరంతర ఆదాయాన్ని ఇస్తుందని తెలిపారు. వరి వంటి పంటలతో పోలిస్తే పెట్టుబడి తక్కువని, కూలీల సమస్య కూడా ఉండదని రైతులకు వివరించారు. రైతులు పండించిన గెలలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే నిర్దేశిత కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుందని, అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, దళారీల ప్రమేయం ఉండదని భరోసా ఇచ్చారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఎరువులు మరియు మార్కెటింగ్ సహాయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ నాగయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా మార్కెట్ అధికారి నాగేశ్వర శర్మ, కెవికె సైంటిస్ట్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఏమి పాపం చేసింది రామన్నపేట..



విశ్వంభర, రామన్నపేట: నల్గొండ జిల్లాలోని నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలలో 5 మండలాలు నల్గొండ జిల్లా పరిధిలో ఉండగా, ఒక్క రామన్నపేట మండలం మాత్రమే యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోనికి వస్తుంది. ఇక ధాన్యం కొనుగోళ్ళ విషయానికి వస్తే మిగతా 5 మండలాలు నల్గొండ జిల్లా పరిధిలో ఉండడం చేత ధాన్యం కోతలు అవగానే మార్కెట్లలో ధాన్యం ఆరబెట్టి కాంటా వేయించి కొనుగోలు చేస్తారు. కానీ ఒక రామన్నపేట మండలం మాత్రం యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో ఉండడం చేత ధాన్యం ఆరబెట్టినాక మళ్ళీ ఫ్యానులతో తాలు, పుల్ల ఉన్నా, లేకున్నా తూర్పారబట్టిన తర్వాతనే కాంటా వేయించి కొనుగోలు చేస్తారు. దీనివల్ల రైతులకు అదనపు ఖర్చులు, సమయ నష్టం కలుగుతోంది. ఒక్క రామన్నపేటకే ఎందుకు ఈ ప్రత్యేక నిబంధన? ధాన్యం ఆరబెట్టడానికే కూలీలు దొరక్క ఖర్చు అవుతుంది అనుకుంటే, ఫ్యానల్తో తాలు, పుల్ల లేకుండా తూర్పార బట్టడానికి మళ్ళీ కూలీల ఖర్చు, ఫ్యాను అద్దెలు, సమయం వృధా, వెరసి రైతు నెత్తిన అదనపు ఆర్థిక భారం పడుతున్నాయి. ఇప్పటికే అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిచి ఇబ్బంది పడుతుంటే, ఈ అదనపు భారం ఒక్క రామన్నపేట మండలంలోని రైతుల మీదనే ఎందుకు అని మండలంలోని రైతులు ప్రశ్నిస్తున్నారు. మిగతా మండలాల మాదిరిగానే రామన్నపేట మండలానికి కూడా ఫ్యానులతో మళ్ళీ ధాన్యం పట్టే ఇబ్బంది లేకుండా వెసులుబాటు కలిగించాలని మండలంలోని రైతులు కోరుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ విషయంపై సరైన నిర్ణయం తీసుకుని ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

# ప్రతి ఒక్కరూ స్వీయ గణన చేసుకోవాలి



విశ్వంభర, కమాన్ పూర్: కమాన్ పూర్ మండలంలోని ప్రతి ఒక్కరూ స్వీయ గణన చేసుకోవాలి అని కమాన్ పూర్ తహసిల్దార్ ముస్త్యాల వాసంతి, మండల గణాంక అధికారి వడ్డేపల్లి సంతోష్ కోరారు. ఈనెల 10వ తేదీ లోపల ప్రతి ఒక్కరూ తమ తమ స్వీయ గణన తమ మొబైల్ ద్వారా కానీ లాప్టాప్ ద్వారా గాని చేసుకోవాలని కోరారు. se.census.gov.in వెబ్సైట్ ద్వారా స్వీయ గణన చేసుకోవాలి అని అని కోరారు. ఈనెల 10వ తేదీ లోపల స్వయంగా స్వీయ గణన చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 11వ తేదీ నుండి గణాంకం చేసేవారు ఇంటింటికి తిరిగి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. స్వీయ గణన చేసుకున్న వారు వారికి ఒక నంబర్ కేటాయించడం జరుగుతుందని ఆ యొక్క నంబర్ను గణాంక ల కొరకు వచ్చే అధికారులకు చెప్పాల్సి ఉంటుందని స్పష్టం చేశారు

# రైతులు ప్రైవేట్ మిల్లర్ల వద్దకు వెళ్లి మోసపోవద్దు

## నిర్మలా జగ్గారెడ్డి



విశ్వంభర, సదాశివపేట: నిర్మలా జగ్గారెడ్డి మంగళవారం సదాశివపేట, కొండాపూర్ మండలం ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తూ రైతులను నేరుగా కలిశారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో రైతు సమస్యలను కేంద్రంగా చేసుకుని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఆమె ప్రజల్లోకి తీసుకెళ్లారు. రైతులు ప్రైవేట్ మిల్లర్ల వద్దకు వెళ్లి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లు అమ్మాలని నిర్మలా జగ్గారెడ్డి సూచించారు. ప్రభుత్వ కేంద్రాల్లో సన్న బియ్యం అమ్మిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందుతుందని ప్రకటించడం రైతుల్లో ఆసక్తి రేపింది. పిఏసిఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని ఆమె వివరించారు. ఈ పర్యటనలో భాగంగా పలు కీలక గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు: సదాశివపేట మార్కెట్ కమిటీ, నందికంది, మారేపల్లి, కొండాపూర్, తేర్పోల్, గొల్లపల్లి, మాల్కాపూర్, ఈ కేంద్రాలు రైతులకు సమీపంలో ఉండేలా ప్లాన్ చేయడం ప్రత్యేకతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకత్వం పెద్ద ఎత్తున పాల్గొనడం గమనార్హం. అలివేని నర్సింహా రెడ్డి, కంది కృష్ణ అంజమ్మ సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సిద్దన్న వ్యవసాయ శాఖ అధికారులు, తహశీల్దార్లు ఇది స్థానిక స్థాయిలో రాజకీయ బలం ప్రదర్శనగా కూడా కనిపిస్తోంది. రైతు దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమం కీలకంగా మారింది.

# జానమ్మకు నివాళులర్పించిన ఎమ్మెల్యే వీరేశం



విశ్వంభర, రామన్నపేట: నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఇంద్రపాల నగరం గ్రామానికి చెందిన గర్దాసు జానమ్మ మంగళవారం రోజు మరణించగా వారి పార్ధీవ దేహానికి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పూలమాల వేసి, నివాళులర్పించి, జానమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగుల వెంకట రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెగా రైతు మేళాలో తెలంగాణ విజయ డైరీ స్టాల్



విశ్వంభర, హనుమకొండ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మెగా రైతు మేళాను హనుమకొండ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు రైతులకు నిర్వహించనున్నారు. రైతుల కోసం నిర్వహిస్తున్న ఈ మెగా రైతు మేళాలో తెలంగాణ విజయ డైరీ స్టాల్ ఏర్పాటు చేసినట్లు విజయ డైరీ హనుమకొండ ఉప సంచాలకులు ధనరాజ్ మీడియాకు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ డైరీ పాలు,పాల ఉత్పత్తులు ఎంతో నాణ్యమైన,మన్నిక గలవని తెలిపారు. తెలంగాణ విజయ డైరీ పాల ఉత్పత్తులను ప్రజలు ఆదరిస్తున్నారని,ప్రజల్లో ఇంకా అవగాహన కల్పించాలని అందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. విజయ డైరీ ఏర్పాటు చేసిన స్టాల్ కు రైతుల నుంచి విశేష స్పందన లభించిందని డీడీ. ధనరాజ్ తెలిపారు.

# రైస్ మిల్లులను తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్



విశ్వంభర, రామన్నపేట: మంగళవారం రోజు యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే.వెంక రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఇంద్రపాలనగరం గ్రామంలోని విద్యా ఆగ్రో రైస్ మిల్లును, జనంపల్లి గ్రామంలోని సాయిశ్రీ రైస్ మిల్లును తనిఖీ చేశారు. ఈ మిల్లులలో ఉన్న లారీలను వెంటవెంటనే ఖాళీ చేయించి తిరిగి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపవలసిందిగా మిల్లుల యాజమాన్యంను ఆదేశించినారు. మిల్లు వద్ద సరిపోను హమాలీలను, ఏర్పాట్లను వెంటనే పెంపొందించి, త్వరితంగా లారీలను ఖాళీ చేయించి, మండలంలోని రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడవలసినదిగా ఆదేశించినారు. వీరి వెంట డి.ఎం.సి.ఎస్ హరికృష్ణ, డి.సి.ఎస్.ఓ ఏ.రోజా, మండల తహసిల్దార్ లాల్ బహదూర్, డి.టి.సి.ఎస్ బాలమణి, కె.సురేష్ రెడ్డి, ఆర్.ఐ శోభ, ఇరు గ్రామాల గ్రామ పంచాయతీ అధికారులు ఉన్నారు.

# గాలివానతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



విశ్వంభర, మహబూబాబాద్ జిల్లా : గాలి దుమారం, వర్షంతో నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఐ ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ మహబూబాబాద్ టౌన్ కార్యదర్శి దొంతోజు ఉపేందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఉపేంద్ర చారి మాట్లాడుతూ , రైతుతో పాటు పశువుల కాపరులు, పశువులపై పిడుగులు పడి మృత్యువాత పడిన వారి కుటుంబాలను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు . అంతే కాకుండా మహబూబాబాద్ ,కేస ముద్రం, వ్యవసాయ మార్కెట్ల తోపాటు కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన మొక్కజొన్న ధాన్యం తడిసిపోయిందని తడిసిన పంటలను ప్రభుత్వమే కొనాలన్నారు . లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు .

# గూడూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ




విశ్వంభర, మోతీ నగర్: రాష్ట్రంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందువల్ల కొన్ని స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను అంబలి మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. అదేవిధంగా మోతీ నగర్ కాలనీలో గూడూరి ఫౌండేషన్ స్నేహితుడా ట్రస్ట్, స్థానిక బిజెపి కన్వీనర్ చైర్మన్ గూడూరి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు కాలనీవాసులకు వడదెబ్బ ఎండ దెబ్బ తగలకుండా సేవ చేయాలన్న దృక్పథంతో ఈ మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు..

# మతపరమైన ఆంక్షలను వెంటనే తొలగించాలి



విశ్వంభర, బషీర్ బాగ్: మతపరమైన ఆంక్షలను వెంటనే తొలగించాలని, ఎస్సీలకు సంపూర్ణ మత స్వేచ్ఛ కల్పించాలని మానవ హక్కులు నేర నిరోధక సంఘం చైర్మన్ బోడ రాకేష్ నాయక్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 కింద ఉన్న "షెడ్యూల్డ్ కాస్ట్ ఆర్డర్ 1950, క్లాజ్ 3" లోని మతపరమైన నిబంధనలు పూర్తిగా చట్టవిరుద్ధమైనవి, ఏకపక్షమైనవన్నారు. కేవలం మతం మారినంత మాత్రాన ఎస్సీ హోదాను రద్దు చేయడం అనేది సహజ న్యాయ సూత్రాలకు పూర్తి విరుద్ధం ఆయన అని అన్నారు. మానవ హక్కులు నేర నిరోధక సంఘం ఆధ్వర్యంలో మంగళ వారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతం మారినంత మాత్రాన వారిని ఎస్సీ జాబితా నుండి తొలగించడం ద్వారా వారి ప్రాథమిక హక్కులను కాలరాయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం అని ఆయన అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఎస్సీ వ్యక్తులు ఏ మతం ఆచరించినా వారికి ఎస్సీ హోదా కోల్పోకుండా, రాజ్యాంగంలోని 14, 15, 17, 21, 25 ఆర్టికల్స్ ప్రకారం అందరికీ సమాన హక్కులు దక్కేలా "షెడ్యూల్డ్ కాస్ట్ ఆర్డర్ 1950" లోని మతపరమైన ఆంక్షలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విశ్రాంత అధికారి జాన్ శ్యామ్యూల్, సంఘం నేతలు పి. ఏలియా, ఎండీ. షహబుద్దీన్ , రమేష్ , హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి



విశ్వంభర, సంగారెడ్డి: సదాశివపేట మండలం సూరారం గ్రామం లోని హజ్రత్ ఖాజే బందే నవాజ్ దర్గా 36 వ ఉర్సు ఉత్సవాల్లో టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. దర్గా ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ మూడు రోజుల పాటు జరిగిన ఉర్సు లో భాగంగా ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఖవాలీ కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం తో పాటు కర్ణాటక నుండి పెద్ద ఎత్తున భక్తులు ఈ ఉర్సు లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, సూరారం గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# 8న శ్రీ లక్ష్మీనారాయణ కళ్యాణ మహోత్సవం

విశ్వంభర, ఇనుగుర్తి: మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం కోమటిపల్లి లోని చారిత్రక మహిమాన్విత శ్రీ లక్ష్మి నారాయణ స్వామి కళ్యాణ మహోత్సవం ఈ నెల 8న నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.శ్రీ పరాభవ నామ సంవత్సర వైశాఖ మాస శుద్ధ పంచమి పురస్కరించుకుని, శుక్రవారం (08-05-2026) ఆరుద్ర నక్షత్రయుక్త అభిజిత్ లగ్నంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగే పరిణయ వేడుకకు భక్తులు తరలి రావాలని కోరారు. వైభవోపేతంగా జరిగే కళ్యాణం తిలకించి, స్వామి వారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఉ.6:00 గంటలకు సుప్రభాత సేవ,7:00 నుండి 8:15 వరకు: బాలభోగం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము. 9:00 నుండి 9:15 వరకు కంకణ పూజ, 10:05 నుండి మ.12:05 వరకు స్వామి వారి కళ్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 1:00 గం.కు మహానివేదన, తీర్థప్రసాద వినియోగం.సా.5:00 గం.లకు గ్రామంలో స్వామి వారి రథోత్సవం అనంతరం ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని తెలిపారు.

# 24న ఎల్బీనగర్ ఎస్‌కె గార్డెన్‌లో బీసీ ప్రభంజనం



విశ్వంభర, ఎల్బీనగర్: జనాభా దామాషా ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీసీలకు యాభై శాతానికి పైగా రిజర్వేషన్లు కేటాయించాలని బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం మన్సురాబాద్ డివిజన్ లో జరిగిన సన్నాహాక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీసీలకు ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కోరారు. చట్టసభల్లో అవకాశం లేకపోవడంతో అవకాశం అర్హతలు ఉండి కూడా చాలా మంది బీసీ నేతలు అగ్రవర్ణాల వారితో పోటీ పడలేక పోతున్నారు అని ఆయన అన్నారు. జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేయడానికి సాహసం చేయకపోవడంతో మెజారిటీ స్థానాల్లో అన్ని ప్రధాన పార్టీలు అగ్రవర్ణాల వారికే టిక్కెట్లు కేటాయిస్తున్నారు అని ఆయన వివరించారు. జనాభాలో 65 నుంచి 70 శాతం ఉన్న బీసీలకు అన్ని పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ వంటి రాజధాని మహా హైదరాబాద్ కార్పొరేషన్ మూడు కార్పొరేషన్ లు అయ్యాయని బీసీ ప్రభంజనం సమన్వయకర్త టియుడబ్ల్యుజె రాష్ట్ర నాయకులు జాల కిషన్ తెలిపారు. ఈ మూడు కార్పొరేషన్ ఎన్నికల్లో బీసీలకు యాభై శాతానికి పైగా రిజర్వేషన్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.. తెలంగాణ ఉద్యమంలో బీసీల త్యాగం తో రాష్ట్ర సాధన సాధ్యమైందని తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ వెంకన్న అన్నారు. బీసీ ప్రభంజనం సభకు తెలంగాణ వెంకన్న ఈ సందర్భంగా మద్దతు ప్రకటించారు. ఎల్బీనగర్ కేంద్రంగా సాగిన మలిదశ ఉద్యమంలో బీసీ వర్గానికి చెందిన శ్రీకాంత్ చారి, సిరిపురం యాదయ్యల ప్రాణ త్యాగంతో తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. రాజ్యాధికారానికి దూరంగా ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీలు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని వెంకన్న అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు బొంగు వెంకటేష్ గౌడ్, శ్యామ్ యాదవ్, ఉపేంద్ర యాదవ్, తానాజీ తదితరులు పాల్గొన్నారు.

కామాఖ్య అమ్మవారి ఆశీస్సులు అందరి మీద వుండాలి.

# పుట్టిన రోజు సందర్భంగా అమ్మగారిని దర్శించుకున్న ఉప్పల



విశ్వంభర, నాగోల్: అస్సాం రాష్ట్రంలోని కామాఖ్య టెంపుల్ లో తన పుట్టిన రోజు సందర్భంగా టి పీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త కుటుంబ సమేతంగా విశేష భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారతదేశంలో అత్యంత ప్రాచీన శక్తిపీఠాలలో ఒకటైన ఈ పవిత్ర దేవాలయంలో అమ్మవారి దర్శనం పొందడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి, దేశ ప్రజల శాంతి, సుభిక్షం, కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారి సతీమణి ఉప్పల స్వప్న, కుమారుడు ఉప్పల సాయి కిరణ్ ,కోడలు శార్వారీ, చిన్న కుమారుడు సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



విశ్వంభర, మహబూబాబాద్: బాల్యం లో వివాహం అనర్ధాలకు మూలం అని జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్ అన్నారు. మంగళవారం గూడూరు మండలం అయోధ్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఏర్పాటు చేసిన ఆశా డే కార్యక్రమానికి ముఖ్య అతిదిగా పాల్గొని మాట్లాడుతూ, భారతదేశంలో వివాహానికి సరైన వయసు అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు అని బాల్య వివాహాలను నివారించడానికి, లింగ సమానతను ప్రోత్సహించడానికి వీలు గా ఉంటుందని, సరైన వయసులో వివాహానికి అనేక లాభాలు వున్నాయని ముఖ్యంగా చిన్నపిల్లల వివాహాలను నిషేధించడం ద్వారా, చట్టం ద్వారా మౌలిక హక్కులను గుర్తిస్తుందని, బాల్య వివాహాల వల్ల వచ్చే శారీరక, భావోద్వేగ, మానసిక ఒత్తిడిలను నివారిస్తుందని ఆయన తెలిపారు. అంతేకాకుండా వివాహ వయసును ఆలస్యం చేయడం వలన అమ్మాయి శారీరక ధ్రుడత్వం పెరిగి సరైన వయస్సు లో గర్భ దారణ పొందవచ్చుని, తన విద్యను కొనసాగించడానికి, వ్యక్తిగత వృత్తిపరమైన అభివృద్ధికి కొంత మౌలిక నైపుణ్యాలను పొందడానికి అవకాశం ఇస్తుందని, ఇది వారిని శక్తివంతులుగా మార్చుతుందని అది సమాజానికి తోడ్పడుతుందని, బాల్య వివాహాలు అమ్మాయిలకు ప్రతికూల ఆరోగ్యాన్ని కలిగిస్తాయని, మాతృ మరణ రేట్లు పెరగడం, బాల్య గర్భధారణలను తగ్గించడం ద్వారా, మెరుగైన ఆరోగ్య ఫలితాలను ప్రోత్సహిస్తుందని సరైన వయసులో పెళ్లి చేసుకుంటే, అమ్మాయి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతుందని, సంబంధాలను అర్థం చేసుకుని బాధ్యతగా ముందుకు సాగుతుందని, జీవిత భాగస్వామిని ఎంచుకోవడంలో జీవిత నిర్ణయాలలో స్పష్టత ఉంటుందని ఆయన తెలిపారు. అలాగే మహిళలను సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితంలో సంపూర్ణంగా పాల్గొనడానికి వీలు కల్పించడం ద్వారా సాధికారతను కల్పిస్తుందని, ఇది వారికి జీవిత నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి, ఉన్నత విద్యను అభ్యసించడానికి తోడ్పడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆరోగ్య విద్యా బోదకుడు పురుషోత్తమ్, ఎంపిహెచ్ఈఓలు, కేఎల్ఎన్ స్వామి, గోపిచంద్, పిహెచ్ఎన్ మేరీ, సుపెర్వైజర్స్ ఫహీముద్దీన్, గణేశ్, హేమలత, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 25 నుండి ప్రజా నాట్యమండలి మహాసభలు



విశ్వంభర, హిమాయత్ నగర్ : తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర 4వ మహాసభలు మే 25, 26 తేదీల్లో హైదరాబాదులో నిర్వహించ నున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్ తెలిపారు. మహాసభల విజయవంతం కోసం ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం హైదరాబాదు హిమాయత్ నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఎంపికయ్యారు. గతంలో నాటక, సినీ రంగాల్లో ఎదిగిన అనేక మంది కళాకారులు ప్రజా నాట్యమండలి నుంచే వచ్చినట్లు పేర్కొన్నారు. సాంస్కృతిక ఉద్యమం సమాజ మార్పుకు కీలకమని, ప్రస్తుత పరిస్థితుల్లో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ మాట్లాడుతూ సాంస్కృతిక పోరాటాల ద్వారానే మార్పు సాధ్యమని చెప్పారు. మహాసభల విజయానికి ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, ప్రజా నాట్యమండలి ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై ఆగ్రహం



విశ్వంభర, కమాన్ పూర్: ధాన్యం కొనుగోళ్ల జాప్యం పై బీఆర్ ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమాన్ పూర్ మండల కేంద్రంతోపాటు సిద్ది పల్లె గ్రామపంచాయతీ పరిధిలోని బుర్రకాయలపల్లి లో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను టిఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లోని రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బి ఆర్ ఎస్ మండల శాఖ అధ్యక్షులు తాటికొండ శంకర్ మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు నత్తనడకన సాగుతున్నాయని, ధాన్యం తూకం 40 ఒక కిలోలు పెట్టాల్సి ఉండగా 42 కిలోలు పెడుతున్నారని ఆరోపించారు. మండే ఎండల్లో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెబుతున్నది ఒక్కటి ఆచరణలో అమలావుతున్నది మరొక్కటి అన్న చందంగా మారిందన్నారు. రైతులు ప్రభుత్వం వివరిస్తున్న తీరును గమనిస్తున్నారని రాబోయే కాలంలో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి త్వరితగతిన వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని, 41 కిలోల తూకం మాత్రమే వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్గౌడ్, మాజీ జడ్పిటీసి మేకల సంపత్ యాదవ్, మాజీ వైస్ చైర్మన్ ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ చిందం తిరుపతి, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీ మల్లు, మాజీ సర్పంచ్ కొండ వెంకటేష్, నాయకులు జాబు సతీష్, కుందారపు సత్యనారాయణ, పెండ్లి నారాయణ, పంతకని రవి, రాచకొండ రవి, కమ్మగోని భాస్కర్, తోట రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి



విశ్వంభర, అనంతగిరి: భారత రాష్ట్ర సమితి కోదా ద నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశన్ని విజయవంతం చేయవలసిందిగా అనంతగిరి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నల్ల భూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల ఏడో తారీఖున నియోజ కవర్గ బిఆర్ఎస్ కార్యకర్తలకు, నాయకులకు కోదాడలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నరాని అన్నారు. ఈ సమావేశానికి బిఆర్ఎస్ శాసనసభాపక్ష ఉప నాయకుడు, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు హాజరవు తున్నట్లు వారు పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో పార్టీ ప్రణాళిక గురించి నాయకుల విధివిధానాల గురించి చర్చలు జరుగుతాయని ఆయన తెలిపారు. కోదాడలో నిర్వహించబోయే విస్తృతస్థాయి సమావేశానికి మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో కార్యకర్తలు నాయకులు పాల్గొని పార్టీ బలోపేతాన్ని గుర్తుచేయాలని కోరారు.నేడు నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నడుచుకుంటున్న తీరు అమానుషమని గెలిచిన నాటినుండి ఓటర్లను మర్చిపోయి గుర్తింపు లేని అభివృద్ధికి నోచుకోని నియోజకవర్గంగా కోదాడ ఈరోజు వెలవెల బోతుందని అన్నారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీకి స్వస్తి చెప్పి బిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టే రోజులు రాబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు మహిళా నాయకులు విద్యార్థి నాయకులు ప్రతి ఒక్క కార్యకర్త పాలుపంచుకోవాలని ఆయన తెలిపారు.

## ఆటో డ్రైవర్ సాహసం.. రౌడీ షీటర్ అరెస్ట్



విశ్వంభర, సికింద్రాబాదు : సికింద్రాబాదు బేగంబజార్ ప్రాంతంలో మహిళ గొలుసు లాక్కెళ్లేందుకు ప్రయత్నించిన రౌడీ షీటర్‌ను ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ ధైర్యంగా అడ్డుకున్నారు. పారిపోతున్న నిందితుడిని ఆటోతో ఢీకొట్టి కిందపడేసి పట్టుకునేలా చేశారు. మార్చి 4న జరిగిన ఈ ఘటనలో నిందితుడు కత్రతో దాడి చేసినా వెనక్కి తగ్గకుండా ప్రతిఘటించారు. అనంతరం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సీసీటీవీ ఆధారంగా ఆటో డ్రైవర్‌ను గుర్తించిన పోలీసులు, బంజారాహిల్స్‌లో సన్మానించి నగదు పురస్కారం, ప్రశంసా పత్రం అందజేశారు. నిందితుడిపై గోషామహల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించిన మున్సిపల్ కమిషనర్



విశ్వంభర, సిద్దిపేట : హుస్నాబాద్ పట్టణంలోని ప్రసిద్ధ ఎల్లమ్మ తల్లి ఆలయంలో మునిసిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్ తన కుటుంబ సభ్యులతో కలిసి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఆలయానికి విచ్చేసిన కమిషనర్ కుటుంబాన్ని ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి, కుటుంబ సభ్యులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో పి.కిషన్ రావు కమిషనర్‌కు ఆలయ ప్రతిరూప జ్ఞాపికను అందజేసి సన్మానించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్‌లకు హెల్మెట్స్ పంపిణీ చేసిన ఎస్పీ నరసింహ




విశ్వంభర, సూర్యాపేట: రోడ్డు ప్రమాదంలో ఎవరు ప్రాణాలు కోల్పోకూడదని , ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్పి నర్సింహా సూచించారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతలో భాగంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రోడ్డు ప్రమాదాలు నివారించడంలో పోలీసు అనుక్షణం కృషి చేస్తున్నాం అని తెలిపారు. సూర్యాపేట ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ తరపున సెవెన్ స్టార్ సోలార్ ఎంటర్ప్రైజెస్ వారి సౌజన్యంతో హెల్మెట్ లు పంపిణీ చేశారు. సమాజంలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి అంశాలు, పోలీసు కార్యకలాపాలు, శాఖల కార్యకలాపాలు ఇతర అంశాల గురించి ఎప్పటికప్పుడు ప్రజలకు, సమాజానికి చేరవేయడంలో జర్నలిస్టులు అనుక్షణం పనిచేస్తున్నారని అన్నారు. ఎండ వాన చలి అనక పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హెల్మెట్స్ అందజేయడం జరిగిందని అన్నారు. ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ప్రమాదాల సమయంలో ప్రధాన రక్షణ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, 7 స్టార్ సోలార్ ఎంటర్ప్రైజెస్ అధికారి మల్లేష్, పాల్గొన్నారు.

## తెల్లబెల్లి గ్రామ పిఎసిఎస్ చైర్మన్‌గా బుర్ర వెంకటేశ్వర్లు



విశ్వంభర, అనంతగిరి: కోర్టు ఆదేశానుసారం జిల్లా సహకార అధికారి ఉత్తర్వుల మేరకు మండల పరిధిలోని సింగారం గ్రామానికి చెందిన బుర్ర వెంకటేశ్వర్లు తెల్లబెల్లి గ్రామ పిఎసిఎస్ చైర్మన్గా మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సొసైటీ పాలకవర్గం పదవీ కాలాన్ని పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పద్మావతి, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాస్ మాట్లాడుతూ చైర్మన్ వెంకటేశ్వర్లు నాయకత్వంలో పాలకవర్గం సహకారంతో సంఘం మరింత ముందు కు అభివృద్ధి పథంలో నడవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం నూతన చైర్మన్ ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లు సుబ్బారావు, దాములూరి మురళి, గుండ్లపల్లి వెంకన్న, కంటు వేణు, బుర్ర రాజబాబు ,తదితరులు పాల్గొన్నారు.


## పాఠశాల బస్సులను శుభకార్యాలకు వాడితే కఠిన చర్యలు



విశ్వంభర, నిజామాబాద్ : తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో బస్సుల వినియోగంపై ఎడ్యుకేషన్ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాల బస్సులను కేవలం విద్యార్థుల రవాణా , విద్యా సంబంధిత పనులకే ఉపయోగించాలని, పెళ్లిళ్లు లేదా ఇతర ప్రైవేట్ కార్యక్రమాలకు వాడకూడదని కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన పాఠశాల విద్యాశాఖ అధికారులకు అధికారిక లేఖ రాశారు. ప్రభుత్వ వనరులను దుర్వినియోగం చేయడం నిబంధనలకు విరుద్ధమని, ఇది విద్యార్థుల భద్రత, జవాబుదారీతనంపై ప్రభావం చూపుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బస్సులను కేవలం విద్యార్థులను పాఠశాలకు చేరవేయడానికి, అధికారిక విద్యా పర్యటనలకు మాత్రమే వాడాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్, వాణిజ్య లేదా వివాహాది శుభకార్యాలకు ఈ వాహనాలను కేటాయించకూడదు. ఈ నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# జనగణనలో మీ వివరాలు మీరే నమోదు చేసుకోవచ్చు

తహసిల్దార్ శ్రీనివాసులు



విశ్వంభర, ఇనుగుర్తి: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2027 జనగణన పురస్కరించుకొని ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు జన గణన నమోదుకు సంబంధించిన వివరాలను ఎవరికి వారే తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించినట్లు ఇనుగుర్తి మండల తాసిల్దార్ సుంకరి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 11 తర్వాత ఇంటికి వచ్చే జనగణన అధికారికి మీరు నమోదు చేసిన ఎస్ ఈ ఐ డి చూపిస్తే వారు అప్రూవ్ చేస్తారని పేర్కొన్నారు. జనగణనలో 33 ప్రశ్నలు ఉండడం వల్ల ఎవరికి వారు ఫిలఫ్ చేసినట్లయితే తప్పులు దొర్లకుండా సమయం సైతం వృధా కాకుండా ఉంటుందని తెలిపారు.నమోదు చేసుకునే వివరాలు తహసిల్దార్ ఈ విధంగా పేర్కొన్నారు.మొదట https://se.census.gov.,HZ అనే లింకును ఓపెన్ చేయాలని, సెల్ఫ్ ఎన్యూరలేషన్(హెచ్ ఓ ఎల్) లాగిన్ వద్ద తెలంగాణ ఎంపిక చేసి, కాప్చ ఎంటర్ చేసి వెరిఫై,ప్రొసీడ్ క్లిక్ చేయాలని పేర్కొన్నారు. వెల్కమ్ పేజీలో కుటుంబ పెద్ద పేరు మొబైల్ నెంబర్ నమోదు చేసి,ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నంబర్ ఉపయోగించాలి.వచ్చిన ఓటిపి ఎంటర్ చేసి వెరిఫై,ప్రొసీడ్ క్లిక్ చేయండి. తరువాత మీకు నచ్చిన భాషను ఎంచుకోండి. మీ జిల్లా, పట్టణం/గ్రామం, పిన్ కోడ్ వివరాలు నమోదు చేయండి. మొబైల్ లో లొకేషన్ ఆన్ చేసి, మీ ఇంటి వద్ద రెడ్ మార్క్ సెట్ చేయాలని వివరించారు. ఇళ్ల వివరాలకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి,ప్రివ్యూ ద్వారా చెక్ చేసి సబ్మిట్ చేయాలి. అనంతరం హెచ్ తో ప్రారంభమయ్యే 11 అంకెల ఎస్ ఈ ఐ డి వస్తుంది.దాన్ని స్క్రీన్‌షాట్ లేదా నోట్ చేసుకుని భద్రపరచుకోవాలి.మే 11 తరువాత మీ ఇంటికి వచ్చే గణన అధికారికి సంబంధిత ఎస్ ఈ ఐడిని చూపిస్తే వారు అప్రూవ్ చేస్తారని తహసిల్దార్ వివరించారు.

## బాధిత కుటుంబానికి బాసటగా నిలిచిన సిపిఎం



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, సిరిపురం గ్రామానికి చెందిన సిపిఎం గ్రామ నాయకుడు దోమలపల్లి నర్సింహా ఇటీవల అనారోగ్యంతో మరణించగా సీపీఎం గ్రామశాఖ బాసటగా నిలవడం జరిగింది. నరసింహ కుటుంబ సభ్యులకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి చేతుల మీదుగా 50వేల రూపాయలు నరసింహ భార్య పేరున ఫిక్సడ్ డిపాజిట్ చేసి చెక్కును అందించటం జరిగింది. తను మరణించిన రోజు అంత్యక్రియల ఖర్చు మొత్తం పార్టీ గ్రామ శాఖ పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి మాట్లాడుతూ, దోమలపల్లి నరసింహ పార్టీ ప్రజా సంఘాల ఉద్యమంలో కీలక భూమిక పోషించాడని, ప్రజల పక్షాన నిరంతరం తాపత్రయ పడేవాడని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు బల్గూరి అంజయ్య, శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ బడుగు రమేష్, మాజీ సర్పంచ్ మిరియాల భాస్కర్, నాయకులు కూనూరు వెంకటేశం, మోటే స్వామి, కూనూరు గణేష్, బైరెడ్డి మధుసూదన్ రెడ్డి, సిల్వేరు రాజు, మార్త భూపాల్ రెడ్డి, దోమలపల్లి నర్సింహా కుటుంబ సభ్యులు దోమలపల్లి మల్లేశం, లక్ష్మణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లాలో భూసేకరణపై ఆగ్రహం



విశ్వంభర, వికారాబాద్ : వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాడ్లాపూర్, రాపోల్ గ్రామాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ పార్క్ పేరుతో రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం దారుణమని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పశ్యపద్మ విమర్శించారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 43 రోజులుగా దీక్షలు కొనసాగిస్తున్న భూ బాధితులను సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సాగుభూములను పరిశ్రమల కోసం తీసుకోవడం సరికాదని, ప్రత్యామ్నాయ భూములను ఎంపిక చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి దీక్షా శిబిరాన్ని సందర్శించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సిపిఐ నాయకులు మాట్లాడుతూ బలవంతపు భూసేకరణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీక్షకు మద్దతుగా వెళ్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామ్యకమని ఖండించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, సిపిఐ, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విశ్వంభర, నెల్లికుదురు: ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నైనాల గ్రామం లో చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మాదారపు రాములు(55) మద్యం తాగిన మైకంలో మంగళవారం మధ్యాహ్నం తన ఇంటి ఆవరణంలోని మరుగుదొడ్డిలో ఐరన్ రాడ్ కు ఉరి వేసుకుని చనిపోయాడు.మృతినికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. మృతిని భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## 14న పద్మశ్రీ రఘు రాయ్ స్మారక సభ

విశ్వంభర, హైదరాబాదు :వెటరన్ ఫోటో జర్నలిస్టు పద్మశ్రీ రఘు రాయ్ స్మారక సభ మే 14న ఉదయం 11 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర సాధారణ సభ, ప్రెస్ ఫోటోగ్రాఫర్స్ మ్యాక్స్ కో-ఆప్ హౌసింగ్ సొసైటీ సాధారణ సభలు జరగనున్నాయి. ఈ రెండు సమావేశాల్లో నూతన కార్యవర్గాలను ఎన్నిక చేయనున్నారు. ఫోటో జర్నలిస్టులు తప్పకుండా హాజరుకావాలని నిర్వాహకులు కోరారు. అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గంగాధర్, హరి ప్రకటనలో తెలిపారు.

# రెచ్చిపోతున్న మట్టి మాఫియా.. పట్టించుకోని అధికారులు

## అసైన్డ్ భూములే అడ్డాగా మట్టి తవ్వకాలు





విశ్వంభర, మహేశ్వరం : మహేశ్వరం మండలంలోని గంగారం, ఉప్పుగడ్డ తండా, కావలోని భాయ్ తండా సమీపంలోని అసైన్డ్ భూములలో ప్రతిరోజు అర్ధ రాత్రిలో మట్టి మాఫియా యదేచ్ఛగా మట్టి దందాలను నడుపుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో మాఫియా మట్టి దందాను నిర్వహిస్తుంటే అధికారులు నిర్లక్ష్యం, పోలీసులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు, రైతులు, రాత్రి అయితే చాలు నిద్ర పోవాలంటే కష్టంగా మారింది. రాత్రి సమయంలో మట్టి టిప్పర్లు నడుపుతుంటే పోలీస్, పెట్రోలింగ్ ఎస్ ఓ టి నిఘా సంస్థలు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇంత పెద్ద పెద్ద ఎత్తున నడుపుతుంటే చూసి చూడనట్లు అధికారులు వ్యవహరించడంతో మట్టి దందా వ్యాపారస్తులు రెచ్చిపోతున్నారనే ఆరోపణలున్నాయి. ఉప్పుగడ్డ తండా, కావలోని భాయి తండా అసైన్డ్ భూములలో ప్రతిరోజు వందల కొద్ది మట్టి టిప్పర్లు తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అసైన్డ్ భూములలో పెద్ద ఎత్తున మట్టి దందాలు జరుపుతూ నిబంధనలకు విరుద్ధంగా మట్టిని విక్రయిస్తున్నారు. అసైన్డ్ భూములను అడ్డాగా మార్చుకొని మట్టి తవ్వకాలను జోరుగా నడిపిస్తున్న వ్యాపారస్తులు, రాత్రి 9,10 గంటల సమయంలో భారీ వాహనంలో హిటాచ్ లను అసైన్డ్ భూములకు తరలించటం జరుగుతుంది. ఉదయం 6 గంటల లోపు తిరిగి భారీ వాహనాలు హిటాచిల ద్వారా మట్టి ని తరలిస్తున్నారు. కోట్లకు కోట్ల విలువ చేసి మట్టిని తరలిస్తున్న అధికారులు, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి, రాత్రిపూట భారీ టిప్పర్లతో మట్టి వ్యాపారాలను నడుపుతున్నారని అంటున్నారు. ఉప్పుగడ్డ తండా, గంగారం, కావలోని భాయ్ తండా, గ్రామస్తులు మట్టి టిప్పర్ల శబ్దాలతో రాత్రిపూట బెంబేలెత్తిపోతున్నారు. వ్యాపారస్తులు వారి ధన బలంతో అధికారులను లో బరుచుకొని మట్టి వ్యాపారాలను కొనసాగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో ధ్వని, వాయు కాలుష్యంతో తండా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం : తాసిల్దార్ చిన్న అప్పలనాయుడు**

అసైన్డ్ భూములలో మట్టిని విక్రయించినా, అక్రమంగా అమ్మకాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని, అసైన్డ్ భూములలో మట్టి వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకొని వాహనాలను సీజ్ చేసి, సదరు వ్యక్తులపై రెవెన్యూ చట్ట ప్రకారం శిక్షిస్తామని తాసిల్దార్ చిన్న అప్పలనాయుడు తెలిపారు.

# ఘనంగా రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా




విశ్వంభర, హనుమకొండ: హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళాను మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ , ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మేళాలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, సాంకేతిక స్టాళ్లను సందర్శించి, రైతులతో మమేకమయ్యారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ రైతు సంక్షేమ పథకాలపై అధికారులు అందిస్తున్న వివరాలను ఆసక్తిగా పరిశీలించారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, మేళా ద్వారా రైతులకు అందుతున్న అవగాహన కార్యక్రమాలు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయని మంత్రులు పేర్కొన్నారు. రైతులు కొత్త పద్ధతులను అవలంబించి దిగుబడులు పెంచుకొని, ఆదాయాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ రెడ్డి, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర స్థాయి అధికారులు, సురేంద్ర మోహన్, యస్మిన్ బాషా,హన్మకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# దేవుడి సాక్షిగా హరీశ్ రావు అబద్ధాలు

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేదారి సదాశివరెడ్డి




విశ్వంభర, సిద్దిపేట: మాజీ మంత్రి హరీశ్ రావు దేవుడి సాక్షిగా అబద్ధాలు మాట్లాడి అబద్దాల హరీశ్ రావుగా నిరూపించుకున్నాడని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కేదారి సదాశివరెడ్డి విమర్శించారు. రూరల్ మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీరప్ప గుడికి ఎస్డీఎఫ్ నిధులు రూ. 5లక్షలు ఇచ్చారని హరీశ్ రావు పచ్చి మోసపూరిత మాటలు మాట్లాడారని ఫైర్ అయ్యారు. రూ. 5 లక్షల నిధులు ఎవరికిచ్చారు, ఎప్పుడిచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారం రాగానే నాటి ఇన్ ఛార్జి మంత్రి కొండా సురేఖ దగ్గరికి వెళ్లి రూ. 5లక్షల నిధులు తీసుకొచ్చామని గుర్తు చేశారు. రూ. 5లక్షల నిధులతో స్లాబ్ వరకు గుడిని నిర్మించామన్నారు. గుడికి నిధులు సరిపోకపోవడంతో ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి కలిశామని, అడగగానే రూ6. 50వేల నిధులు మంజూరు చేశారని చెప్పారు. మరీ హరీశ్ రావు మంజూరు చేసిన నిధులు ఎవరు తిన్నారని ప్రశ్నించారు. నిధులను గోల్ మాల్ చేసి, పక్కదారి పట్టించడం హరీశ్ రావుకు కొత్తేం కాదన్నారు. వందల కోట్ల సీఎంఆర్ఎఫ్ నిధులను మింగిన చరిత్ర హరీశ్ రావుకు ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుస్సాపూర్ హనుమాన్ ఆలయానికి రూ. 20లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారని, కానీ రూ. 12 లక్షల నిధులే మంజూరయ్యాయని చెప్పారు. మరీ మిగతా రూ. 8లక్షల నిధులు ఎవరీ ఖాతాలోకి పోయాయని ప్రశ్నించారు. హనుమాన్ టెంపుల్ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నది బీఆర్ఎస్సేనని మండిపడ్డారు. గుడి ఆవరణలోని రావి చెట్టును తొలగిస్తే గుడి నిర్మాణాన్ని స్టార్ట్ చేస్తామని చెప్పారు. హరీశ్ రావు, ఆయన చెంచాలు తన గురించి ఇష్టరీతిగా మాట్లాడుతున్నారని, వారు నాలుకలను కొండ నాలుకలను బయటకు గుంజే సమయం దగ్గరకొచ్చిందన్నారు. టెండర్ల కోసం తెలియని వారు కూడా టెండర్ల గురించి మాట్లాడుతున్నారన్నారు. సదాశివరెడ్డి గురించి మాట్లాడాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఆంజనేయులు గౌడ్, కిషన్ గౌడ్, కొండల్ రెడ్డి, ఎర్రం రాములు, పర్శరాములు, మల్లేశం గౌడ్, జిల్లా మత్స్య సహకార డైరెక్టర్ సురేశ్, పాల్గొన్నారు.

# విశ్వనాథన్‌కి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేత



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ సెక్రటరీగా ఉన్న పి విశ్వనాథన్ ఇటీవల తమిళనాడులో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వనాథం కి కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ , తెలంగాణ రాష్ట్ర స్పోక్స్ పర్సన్ సత్యం శ్రీరంగం శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.


# అంగారక సంకష్టహర చతుర్దశి ప్రత్యేక పూజలు



విశ్వంభర, పటాన్ చెరు : సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఇస్నాపూర్ మున్సిపాలిటీ రుద్రారం గ్రామంలోని శ్రీ గణేష్ గడ్డ సిద్ధి గణపతి దేవస్థానంలో అంగారక సంకష్టహర చతుర్దశి సందర్భంగా శ్రీ సిద్ధి గణపతికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే స్వామివారికి విశేష పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, సింధూర వరణం నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, అధికారులు, రాజకీయ నాయకులు, పుర ప్రముఖులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అంగారక సంకష్టహర చతుర్దశి సందర్భంగా శ్రీ గణేష్ గడ్డ సిద్ధి గణపతి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ సిద్ధి గణపతిని దర్శించుకున్నారు. సుమారు 30 వేల నుంచి 50 వేల వరకు భక్తులు స్వామివారిని దర్శించుకుని నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారని ఆలయ నిర్వాపకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ హరి ప్రసాద్ రెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పైపుల్లో రాళ్లు .. కాలనీలకు నీళ్లు రావు

## ప్రత్యామ్నాయ చర్యలకై మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం



విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 25 వ వార్డు పరిధిలో నందమూరి నగర్ ధర్మాన్న కాలనీ, జగన్ కాలనీలలో మిషన్ భగీరథ పైపులైన్లు వేసి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా నీళ్లు సరిగా రావడం లేదని 25 వ వార్డు కౌన్సిలర్ సంధ్య శ్రావణ్ తెలిపారు. వచ్చిన కొద్ది మేరకు భగీరథ పైపులలో అడ్డంకిగా రాళ్లు రావడం వలన నీరుసరిగా అందడం లేదు గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్ల నీరు అందిస్తామని హామీ ఇచ్చి నిధులు విడుదలలో జాప్యం చేయడం వలన కంకర బోర్డ్ లోని నిర్మించిన మిషన్ భగీరథ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ వినియోగంలోకి రాకపోవడం వలన శివారు కాలనీయులైన ధర్మన్న కాలనీ జగన్ కాలనీ నందమూరి నగర్ లలో నీరు అందడం లేదు. మిషన్ భగీరథ నీళు ఎందుకు రావడం లేదని అధికారులను ప్రశ్నించగా మిషన్ భగీరథ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ కాంట్రాక్టర్ కు 9 కోట్ల రూపాయల నిధులు బకాయిల చెల్లించకపోవడం వల్ల పూర్తి నిర్మాణం కాక నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయని కావున నీళ్లు ఇవ్వలేమని అంటున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం కూడా నిధులు ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. కావున తాత్కాలికంగా మూడు బావులు, బోరును వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా తక్షణమే కమిషనర్ స్పందించి ప్రత్యామ్నాయ చర్యలలో భాగంగా జగన్ నగర్ కాలనీ, ధర్మన్న కాలనీ, నందమూరి నగర్ లో ఉన్న మూడు మంచినీటి బావులను, ధర్మన్న కాలనీలో నీతి ఎద్దడి నివారణ కోసం సుమారు నాలుగు సంవత్సరాల క్రితం ధర్మన్న ట్రస్ట్ ద్వారా వేసిన బోరును వినియగం లోకి తేవాలని, తద్వారా వేసవి నీటి ఎద్దడి నివారణ కై తక్షణమే కమిషనర్ , పాలకవర్గం స్పందించి నీటి ఎద్దడి నివారణకై మున్సిపల్ నిధులు వెచ్చించి తక్షణమే మంచినీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు 25వ వార్డు సిపిఐ కన్వీనర్ నర్రా శ్రావణ్ ధర్మన్న కాలనీ శాఖ కార్యదర్శి మంద శంకర్, సహాయ కార్యదర్శి తండా శ్రీనాథ్ ,తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ రౌండ్ టేబుల్ సమావేశం




విశ్వంభర, దుండిగల్: బారాస పార్టీ సర్వసభ్య సమావేశం దుండిగల్ గండిమైసమ్మ బారాస పార్టీ కార్యాలయం లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద , శంబిపూర్ కృష్ణ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వచ్చే కార్పొరేషన్ ఎలక్షన్ నందు అందరూ కష్టపడి పని చేయాలని సాధ్యమైనంత ఎక్కువ సీట్లు సాధించాలని, ఈ ప్రభుత్వం చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని, నియోజకవర్గ కాలనీ మున్సిపల్ డివిజన్ పరిధిలో ప్రజలతో ఎప్పుడు నాయకులు అందుబాటులో ఉండాలని సూచించారు.

# వన్యప్రాణులను వేటాడే ముఠా అరెస్ట్



విశ్వంభర, షాద్‌నగర్ : షాద్‌నగర్, మక్తల్ అటవీ ప్రాంతాల్లో ఎయిర్ గన్లతో వన్యప్రాణులను అక్రమంగా వేటాడుతున్న ఆరుగురు సభ్యుల ముఠాను టాస్క్‌ఫోర్స్, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి నాలుగు ఎయిర్ గన్లు, ఒక లైసెన్స్ రైఫిల్, 20 తూటాలు, స్కార్పియో కారు సహా పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు జింకలు, నెమళ్లు, కుందేళ్లు తదితర వన్యప్రాణులను ఎయిర్ గన్లతో వేటాడి మాంసాన్ని వినియోగిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. గత ఏడాది కాలంగా షాద్‌నగర్, మక్తల్ అటవీ ప్రాంతాల్లో పలుమార్లు వేట జరిపినట్లు అధికారులు తెలిపారు. వేట దృశ్యాలు ఉన్న మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి నిందితులను అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. ఈ ఆపరేషన్ టాస్క్‌ఫోర్స్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు.


# పటాన్‌చెరులో ఘనంగా బీజేపీ విజయోత్సవాలు

## మూడు రాష్ట్రాల్లో విజయంపై సంబరాలు



విశ్వంభర, పటాన్ చెరు: సంగారెడ్డి జిల్లా పటాన్చెరు పట్టణంలోని జాతీయ రహదారి వద్ద భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు ఘనంగా విజయోత్సవాలు నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మూడు రాష్ట్రాలలో బీజేపీ సాధించిన విజయాన్ని పురస్కరించుకుని ఈ సంబరాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి ఆనందం వ్యక్తం చేయడంతో పాటు ఒకరికి ఒకరు స్వీట్లు తినిపించుకున్నారు.సమీపంలోని దుకాణదారులకు కూడా స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోదావరి అంజి రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజలు మరోసారి బీజేపీపై విశ్వాసం ఉంచారని అన్నారు. మూడు రాష్ట్రాల్లో సాధించిన విజయం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. అభివృద్ధి, పారదర్శక పరిపాలన, ప్రజల సంక్షేమం కోసం బీజేపీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఇదే ఉత్సాహంతో రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ విజయ పతాకాన్ని ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.అలాగే మే 10న ప్రధాని నరేంద్ర మోదీ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌కు విచ్చేసి సుమారు రూ. 8 వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారని తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొలుకూరి రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్ గుప్త, సుజాతతో పాటు స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పంటల కొనుగోళ్లలో అవకతవకలు అరికట్టాలి



విశ్వంభర, ముషీరాబాదు : యాసంగి పంటల కొనుగోళ్లలో అవకతవకలను అరికట్టి వేగంగా కొనుగోళ్లు పూర్తి చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాదు గాంధీ నగర్ లోని రైతు సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు 14 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేసినట్లు తెలిపారు. 8,500 కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించినా, 6,500 మాత్రమే ప్రారంభమయ్యాయని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు 3 నుంచి 5 కిలోల వరకు తరుగు తీస్తున్నారని, కనీస సౌకర్యాలు లేవని విమర్శించారు. ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మొక్కజొన్న కొనుగోళ్లలో పరిమితులు విధించడంతో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. లోపాలను వెంటనే సరిచేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరిబండి ప్రసాద్ రావు, కోశాధికారి మూడ్ శోభన్, సహాయ కార్యదర్శి ఉడత రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ క్రషింగ్ యూనిట్లపై హైడ్రా చర్యలు



విశ్వంభర, హైదరాబాదు : అనుమతిలేని క్రషింగ్ యూనిట్లు, ఆర్ఎంసీ ప్లాంట్లపై హైడ్రా మంగళవారం విస్తృత చర్యలు చేపట్టింది. రంగారెడ్డి జిల్లాలో గౌలిదొడ్డి, వట్టినాగులపల్లి, గోపన్నపల్లి, శంషాబాద్ కొత్వాల్‌గూడ ప్రాంతాల్లో నిర్వహించిన ఆపరేషన్లలో 8 క్రషింగ్ యూనిట్లతో పాటు 3 ఆర్ఎంసీ ప్లాంట్లను తొలగించారు. మిగిలిన ప్లాంట్ల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. పీసీబీ, మైనింగ్, రెవెన్యూ శాఖల ఫిర్యాదుల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అనుమతులు లేకుండా కొండలను ధ్వంసం చేస్తూ, వాయు కాలుష్యానికి కారణమవుతున్న యూనిట్లను లక్ష్యంగా తీసుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోనే అక్రమంగా నడుస్తున్న ఈ యూనిట్లు బినామీ పేర్లతో కొనసాగుతున్నట్లు గుర్తించారు. కొత్వాల్‌గూడలో విస్తృతంగా కొండలను తవ్వి నాశనం చేసిన ఆనవాళ్లు బయటపడ్డాయి. భవిష్యత్తులో ఇలాంటి కార్యకలాపాలకు అవకాశం లేకుండా యంత్రాలను నేలమట్టం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

# పాక్‌పై భారత్‌దే సంపూర్ణ ఆధిపత్యం.. యుద్ధంలో ఇండియాదే విజయం

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్, పీఓకేలోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలే టార్గెట్‌గా భారత్ చేసిన దాడులపై ఆస్ట్రియన్ వైమానిక యుద్ధ విశ్లేషకుడు, చరిత్రకారుడు టామ్ కూపర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాక్‌పై భారత్ దాడులను స్పష్టమైన సైనిక విజయంగా అభివర్ణించారు. పాకిస్థాన్‌తో జరిగిన ఘర్షణల్లో భారత్‌కు ఉన్న నిర్ణయాత్మక ఆధిక్యాన్ని ఈ సందర్భంగా హైలైట్ చేశారు. భారత్ సైనికపరంగా పాక్‌ను మించిపోవడమే కాకుండా తన ప్రణాళికాబద్ధమైన, కచ్చితమైన ప్రతిస్పందన ద్వారా ఒక బలమైన వ్యూహాత్మక సందేశాన్ని కూడా దాయాది దేశానికి ఇచ్చిందని చెప్పారు. ఓ ఇంటర్వ్యూలో టామ్ కూపర్ ఈ మేరకు వ్యాఖ్యానించారు."పాకిస్థాన్‌లోని ప్రధాన ఉగ్రవాద శిబిరాలపై భారత్ అత్యంత విజయవంతమైన ప్రతీకార దాడులు నిర్వహించింది. అంతేకాకుండా భారత్ చేరుకోలేదని భావించిన అసాధ్యమైన లక్ష్యాలను కూడా ఛేదించింది. దీంతో పాక్ తీవ్రంగా నష్టపోయింది. అందుకే పాకిస్థాన్ రక్షణాత్మక ధోరణిలోకి వెళ్లిపోయింది. భారతదేశ కార్యాచరణ సామర్థ్యం దాని వ్యూహాత్మక విధానంలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తుంది. పాకిస్థాన్‌లోని దేనిపైనైనా దాడి చేయగలమని, తమను ఆపలేరని పాక్‌కు భారత్ స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. భారత్ చేపట్టిన దాడులకు ప్రతీకారం తీర్చుకోవాలని పాక్ ప్రయత్నించింది. భారత వైమానిక, సైనిక స్థావరాలు, పౌర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఉద్రిక్తతను పెంచడానికి ప్రయత్నించింది. భారత వైమానిక రక్షణ వ్యవస్థలు అనుకున్న విధంగానే కచ్చితంగా పనిచేశాయి. పాక్ నుంచి దూసుకొస్తున్న రాకెట్లు, క్షిపణులు, యూఏవీలు వంటి 95-98 శాతానికి పైగా క్షిపణులను అవి అడ్డుకుని ధ్వంసం చేశాయి.పాక్ ప్రతీకార చర్యలు దాదాపు పూర్తిగా విఫలమయ్యాయి" అని టామ్ కూపర్ పేర్కొన్నారు. పాక్ వ్యూహాత్మక బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులతో భారత్‌పై దాడులకు యత్నించిందని టామ్ కూపర్ తెలిపారు. అయితే భారత్ ఆ ప్రయత్నాలను అడ్డుకోవడమే కాకుండా, పాక్‌లోని కీలక సైనిక సామర్థ్యాలను నాశనం చేసే అత్యంత కచ్చితమైన దాడులను కూడా చేసిందని పేర్కొన్నారు. ఈ పరిణామాలు పాకిస్థాన్ నాయకత్వంలో గణనీయమైన ఒత్తిడిని సృష్టించాయని అన్నారు. ఇండియా-పాక్ వార్‌లో భారతే విజేత అని స్పష్టం చేశారు. పాక్ గరిష్ఠంగా భారత్‌కు చెందిన ఒకట్రెండు యుద్ధ విమానాలను కూల్చేసి ఉండొచ్చు కానీ,యుద్ధంలో మాత్రం ఓడిపోయిందన్నారు."పాకిస్థాన్ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. బయటి దేశాల మద్దతు లేకుండా భారీ స్థాయి సైనిక ఆయుధాలను కొనుగోళ్లను కొనసాగించలేదు. భారత్-పాక్ మధ్య అంతర్లీనంగా ఉన్న ఉద్రిక్తతలు కొనసాగుతాయి. దీని అర్థం భవిష్యత్తులో కూడా ఇండియా- పాక్ మధ్య ఇలాంటి పరిస్థితులే ఉంటాయి. ఇరు దేశాల మధ్య ఉన్న ప్రధాన సమస్యలు ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదు. ఆపరేషన్ సిందూర్ ఫలితం భారతదేశ సంసిద్ధతను, సాంకేతిక బలాన్ని, కొత్తగా తలెత్తే ముప్పులకు నిర్ణయాత్మకంగా స్పందించగల సామర్థ్యాన్ని తెలియజేసింది" అని టామ్ కూపర్ అభిప్రాయపడ్డారు. మరోవైపు, అమెరికా-ఇరాన్ చర్చలకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించడంపైనా టామ్ కూపర్ స్పందించారు. ఈ



క్రమంలో పాకిస్థాన్ చేస్తున్న దౌత్య ప్రయత్నాలను ప్రాధాన్యం లేనివిగా కొట్టిపారేశారు. అంతర్గత అసమర్థత, స్వల్పకాలిక ఎత్తుగడలతో బలహీనపడిన ఒక చిన్న శక్తిగా పాక్‌ను అభివర్ణించారు. వాషింగ్టన్, టెహ్రాన్‌ల మధ్య ఉన్నత స్థాయి మధ్యవర్తిగా ఇస్లామాబాద్ తనను తాను ప్రదర్శించుకుంటున్న తీరును తప్పుపట్టారు. వాస్తవానికి పాక్ అంతటి ప్రతిష్ఠాత్మకమైన దేశం కాదన్నారు. తక్షణ ప్రయోజనాలు పొందడం కోసం ట్రంప్ పరిపాలనను బుజ్జగించడంపైనే పాకిస్తాన్ ప్రభుత్వం ప్రస్తుతం దృష్టి సారించిందని ఆరోపించారు."పాకిస్థాన్ విషయానికొస్తే రెండు విభిన్న ప్రపంచాలు ఉన్నాయి. ఒకవైపు పాక్ తనను తాను ఒక గొప్ప సంధానకర్తగా చిత్రీకరించుకుంటోంది. వాస్తవానికి పాక్ ప్రభుత్వం అనుకూలతలకు బదులుగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను బుజ్జగిస్తోంది. కశ్మీర్ సమస్య వంటి అజెండాలను ముందుకు తీసుకెళ్లడానికి ఇస్లామాబాద్ అమెరికా లాబీయింగ్‌ను కోరుకుంటోంది. అయితే ఈ ప్రయత్నాల వల్ల ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. పాకిస్థాన్ వాస్తవానికి తమ సొంత సైనికుల గుప్పిట్లో బందీగా ఉంది. రాజకీయ, పరిపాలనా అసమర్థత ప్రపంచ వేదికపై ఆ దేశం ఎలాంటి అర్థవంతమైన పాత్ర పోషించకుండా నిరోధిస్తోంది. పశ్చిమాసియాపై ఆధిపత్యం చెలాయించడానికి ఇజ్రాయెల్, యూఏఈ ఒక అజెండాను నడుపుతున్నాయి. ఇరాన్‌తో యుద్ధంలో ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు ఇచ్చింది. దీంతో పశ్చిమాసియా సంఘర్షణలో యూఎస్ చిక్కుకుపోయింది. దీంతో అమెరికా ప్రస్తుత ప్రభుత్వానికి యుద్ధం నుంచి గౌరవప్రదమైన నిష్క్రమణ వ్యూహం లేకుండా పోయింది" అని కూపర్ తెలిపారు.

## ఆ ఒక్క పార్టీ మద్దతుతోనే టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదు: ఇళంగోవన్



**విశ్వంభర, చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా అవతరించిన విజయ్ సారథ్యంలో టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న వేళ డీఎంకే నేత టీకేఎస్ ఇళంగోవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే ఒక్క కాంగ్రెస్ పార్టీ మద్దతు మాత్రమే సరిపోదని వ్యాఖ్యానించారు. ఆ పార్టీకి కేవలం ఐదుగురు ఎమ్మెల్యేలే ఉన్నారని, అందువల్ల ఆ పార్టీ మద్దతుతో సర్కార్ ఏర్పాటు సాధ్యంకాదన్నారు. ఏప్రిల్ 23న తమిళనాట మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఈ నెల 4న వెలువడిన ఫలితాల్లో టీవీకే 108 సీట్లు గెలుచుకొని సంచలన విజయంతో రాష్ట్రంలోనే అతి పెద్ద పార్టీగా అవతరించింది. ఈ ఎన్నికల్లో డీఎంకేకు 59 సీట్లు రాగా.. అన్నాడీఎంకేకు 47 సీట్లు వచ్చాయి. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ (118 సీట్లు) టీవీకేకు సాధించలేకపోవడంతో ఇతర పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా తీవ్ర మంతనాలు సాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఇళంగోవన్ మాట్లాడుతూ.. అన్నాడీఎంకేకు భాజపా ఎలాంటి సూచనలు చేసిందో తనకు తెలియదన్నారు. ఒకవేళ అన్నాడీంఎకే గనక టీవీకేకు మద్దతు ఇవ్వకపోతే.. ఏ పార్టీకీ సరైన మద్దతు రాకపోవడంతో హంగ్ వస్తే.. మళ్లీ కొత్తగా ఎన్నికలకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తవచ్చని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ డీఎంకే ఓటమిపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏదో పొరపాటు జరిగిందని.. అదేమిటో తాము పరిశీలిస్తున్నామన్నారు. ఒక్క అధికారంలోకి రావడం మాత్రమే డీఎంకే అజెండా కాదని, కొన్ని దశాబ్దాలుగా తమ పార్టీ అధికారంలో ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

# రాజీనామాకు మమత నో.. ఇప్పుడేం జరుగుతుంది?

**విశ్వంభర,నేషనల్ బ్యూరో:**

ఐదు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రాల్లో ప్రజలు మార్పునకు ఓటేశారు. దీంతో కేరళ, తమిళనాడు ముఖ్యమంత్రులు పినరయి విజయన్, ఎంకే స్టాలిన్ తమ పదవులకు రాజీనామా చేశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాత్రం సీఎం పదవికి రాజీనామా చేయబోనని భీష్మించారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ ఆమె ఆరోపిస్తున్నారు. మరి సీఎం పదవికి మమత రాజీనామా చేయకపోతే తర్వాత ఏమవుతుంది? నిబంధనలు ఏం చెప్తున్నాయి? రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 ప్రకారం.. ముఖ్యమంత్రిని గవర్నర్ నియమిస్తారు. ముఖ్యమంత్రి సలహా మేరకు మంత్రుల చేత గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. గవర్నర్ అభీష్టం మేరకు ముఖ్యమంత్రి, ఆయన మంత్రి మండలి పదవిలో కొనసాగుతుంది. ఒకవేళ మెజారిటీ కోల్పోయిన ముఖ్యమంత్రి రాజీనామా చేయకపోతే గవర్నర్‌కు వారిని తొలగించే అధికారం ఉంటుంది. ఒక ముఖ్యమంత్రి శాసనసభలో మెజారిటీ సభ్యుల మద్దతు ఉన్నంత కాలం మాత్రమే ఆ పదవిలో కొనసాగగలరు. అసెంబ్లీలో మెజారిటీ కోల్పోయినప్పుడు, ఆ పదవిలో కొనసాగే అధికారం వారికి ఉండదు. అందుకే నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రులు తమ పదవులకు రాజీనామా చేస్తుంటారు. పశ్చిమ బెంగాల్ సీఎం అందుకు నిరాకరించడంతో ఇక్కడ గవర్నర్ పాత్ర కీలకం కానుంది. పరిపాలనలో ఏదైనా ప్రతిష్టంభన తలెత్తినప్పుడు రాజ్యాంగబద్ధంగా పదవిలో ఉండే రాష్ట్ర గవర్నర్ తన అధికారాలను వినియోగిస్తారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు వీలుగా ముఖ్యమంత్రిని తన పదవికి రాజీనామా చేయాలని గవర్నర్ కోరొచ్చు. ఒకవేళ అందుకు నిరాకరిస్తే.. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో సభను సమావేశపరిచి బలపరీక్ష నిర్వహించి బలం నిరూపించుకోవాలని ఆదేశించొచ్చు. తృణమూల్ కాంగ్రెస్‌కు ఎలానూ బలం లేదు కాబట్టి ప్రభుత్వం పడిపోతుంది. ఒకవేళ ముఖ్యమంత్రి తన మెజారిటీని నిరూపించుకోలేకపోయినా లేదా రాజీనామా చేయకపోయినా గవర్నర్‌కు మంత్రిమండలిని రద్దు చేసి మెజారిటీ సీట్లు సాధించిన పార్టీని ప్రభుత్వ



ఏర్పాటుకు ఆహ్వానించొచ్చు.మండలి తరహాలో అసెంబ్లీ అనేది శాశ్వత సభ కాదు. ఐదేళ్ల గడువు పూర్తికాగానే ఆటోమేటిక్‌గా సభ రద్దు అవుతుంది. ప్రస్తుత బెంగాల్ అసెంబ్లీ గడువు మే 7తో ముగియనుంది. ఆ తర్వాత పాత ప్రభుత్వం అధికారంలో కొనసాగే అవకాశం ఉండదు. అప్పుడు మెజారిటీ సీట్లు సాధించిన భాజపాను ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా గవర్నర్ ఆహ్వానించొచ్చు. ఏ పార్టీకీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పరిస్థితుల్లో ఆర్టికల్ 356 ప్రకారం రాష్ట్రపతి పాలనకు గవర్నర్ సిఫార్సు చేయొచ్చు. ప్రస్తుతం బెంగాల్లో ఆ పరిస్థితులు లేవు కాబట్టి భాజపా ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది.

## విజయ్ మా మద్దతు కోరారు: కాంగ్రెస్


**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ.. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ మార్కును (118 సీట్లను) సాధించలేకపోయింది. ఇందుకు మరో 10 మంది సభ్యుల మద్దతు అవసరం. ఈ క్రమంలోనే విజయ్ తమ పార్టీ మద్దతు కోరినట్లు కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. విజయ్ అభ్యర్థనపై తుది నిర్ణయం తీసుకోవాల్సిందిగా టీఎన్‌సీసీని పార్టీ అధిష్ఠానం ఆదేశించిందన్నారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను



దృష్టిలోఉంచుకొని నిర్ణయం తీసు కోవాలని సూచించిందన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి నుంచి పోటీ చేసిన కాంగ్రెస్.. ఐదు చోట్ల విజయం సాధించిన విషయం తెలిసిందే.

## విమాన సంస్థల కోసం క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్



**విశ్వంభర, ఢిల్లీ:** పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ సవాళ్లు ఎదుర్కొంటున్న ఎంఎస్ఎంఈ, విమానయాన సంస్థలు, ఇతర కంపెనీలకు కేంద్రం ఊరట కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా సంస్థలు మూలధన అవసరాలను తీర్చడంలో సాయపడేందుకు రూ.18,100 కోట్లతో అత్యవసర రుణ హామీ పథకాన్ని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.ఈ పథకం వల్ల మొత్తం రూ.2.55 లక్షల కోట్ల అదనపు రుణ ప్రవాహం లభిస్తుందని అంచనా వేస్తున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం వల్ల ప్రభావితమైన విమానయాన సంస్థలతో పాటు ఎంఎస్ఎంఈలను ఆదుకోవడానికి ఈ పథకాన్ని తీసుకొచ్చామన్నారు. ఆయా వ్యాపారాలను నిలబెట్టడంతో పాటు, ఉద్యోగాలు కోల్పోకుండా నివారిస్తుందన్నారు. సప్లయ్ చైన్ అవరోధాలనూ నివారించడానికి ఈ పథకం దోహదపడుతుందని తెలిపారు.

# ఇరాన్ దాడుల్లో భారతీయులకు గాయాలు.. స్పందించిన కేంద్రం

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

యూఏఈలోని ఫుజైరా ఆయిల్ ఇండస్ట్రీ జోన్‌లోని ఓ చమురు శుద్ధి కేంద్రంపై ఇరాన్ చేసిన డ్రోన్ దాడి లో ముగ్గురు భారతీయులకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేంద్ర విదేశాంగ శాఖ స్పందించింది. ఈ దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఖండించింది. మౌలిక సదుపాయాలు, అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. పశ్చిమాసియా అంతటా శాంతి, స్థిరత్వం పునరుద్ధరించేలా పరిస్థితులు చక్కదిద్దడానికి చర్చలు, దౌత్యం కోసం భారత్ తన మద్దతును కొనసాగిస్తుందని తెలిపింది.అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా హర్మూజ్ జలసంధి గుండా స్వేచ్ఛాయుత, నిరాటంకమైన నౌకాయానం, వాణిజ్యం జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్‌పేర్కొన్నారు. పశ్చిమాసియాలో సమస్యల పరిష్కారానికి చేసే అన్ని ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడానికి భారత్ సిద్ధంగా ఉందన్నారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. యూఏఈపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. పౌరులను, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రపంచ ఇంధన భద్రత కోసం హర్మూజ్ గుండా సురక్షితమైన నౌకాయానం జరగడం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

**ప్రపంచాన్ని బందీగా చేయొద్దు..**

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌పై జరిగిన దాడుల నేపథ్యంలో.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించాలని ప్రపంచ దేశాలు పిలుపునిచ్చాయి. అమెరికాతో చర్చలు జరిపి.. ఈ సమస్యను పరిష్కరించుకోవాలని యూకే, ఫ్రాన్స్, జర్మనీ, సౌదీ అరేబియా ఇరాన్‌ను కోరాయి. ఈ ఘర్షణలతో హర్మూజ్‌ను, ప్రపంచాన్ని బందీగా చేయొద్దని పేర్కొన్నాయి.



**కావాలని చేయలేదు: ఇరాన్**

ఫుజైరా ఆయిల్ ఇండస్ట్రీ జోన్‌లోని ఓ చమురు శుద్ధి కేంద్రంపై కావాలని దాడి చేయలేదని ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. నిషేధిత మార్గాల గుండా హర్మూజ్‌లో నౌకలను బయటకు తీసుకురావడానికి అమెరికా చేస్తున్న దుస్సాహసమే ఈ ఘటనకు కారణమని ఆరోపించింది. ఇకనైనా అమెరికా దౌత్య ప్రక్రియలో బలప్రయోగం చేసే ప్రవర్తనను వీడాలని పేర్కొంది. ప్రపంచంలోని అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేసే సున్నితమైన హర్మూజ్ జలసంధిలో అగ్రరాజ్యం తన సైనిక సాహసకృత్యాలను ఆపాలని డిమాండ్ చేసింది.

## హైదరాబాద్- చండీగఢ్ విమానంలో పవర్ బ్యాంక్ పేలుడు!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

విమానంలో ఓ ప్రయాణికుడికి సంబంధించిన పవర్ బ్యాంక్ పేలి, మంటలు చెలరేగిన ఘటన చండీగఢ్ ఎయిర్‌పోర్ట్‌లో చోటు చేసుకుంది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది.. వెంటనే ప్రయాణికులందరినీ అత్యవసర ద్వారం నుంచిసురక్షితంగాకిందికిదించే శారు. దాదాపు 200మంది ప్రయాణికులు,సిబ్బందితోకూడినఓ ఇండిగో విమానం మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి చండీగఢ్‌కు చేరుకుంది. ల్యాండ్




అయిన అనంతరం నిలిచి ఉన్న సమయంలో.. ఓ ప్రయాణికుడు తన పవర్ బ్యాంక్ నుంచి మంటలు చెలరేగినట్లు గుర్తించాడు. వెంటనే సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో.. వారు హుటాహుటిన అత్యవసర ద్వారం నుంచి ప్రయాణికులను ఖాళీ చేయించారు. అగ్నిమాపక పరికరాలతో మంటలను ఆర్పేశారు. ఈ ఘటనతో విమానం క్యాబిన్‌లో పొగ అలము కుంది. ఇండిగో సంస్థ ఈ ఘటనను ధ్రువీకరించింది. "ఓ ప్రయాణికుడికి చెందిన వ్యక్తిగత ఎలక్ట్రానిక్ పరికరానికి నిప్పంటుకుంది. భద్రతా కారణాల దృష్ట్యా.. వెంటనే అందరినీ ఖాళీ చేయించాం. సంబంధిత అధికారులకు సమా చారం అందించాం. ప్రయాణికులందరినీ సురక్షితంగా టెర్మినల్‌కు తరలించాం" అని తెలిపింది. అవసరమైన తనిఖీలు చేపట్టిన అనంతరం ఈ విమాన కార్యకలాపాలను పునఃప్రారంభిస్తామని పేర్కొంది.

## ఓడిన మరుసటి రోజే నియోజకవర్గానికి స్టాలిన్..

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**



ఎన్నికల్లో ఓడిన మరుసటి రోజే డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ తన సొంత నియోజకవర్గం కొళత్తూరులో పర్యటించారు. అక్కడి ప్రజలతో కలిసి మాట్లాడారు. 15 ఏళ్ల పాటు తనను ఆదరించినందుకు గాను కృతజ్ఞతలు తెలియజేస్తూ పలు వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తన పర్యటన ఫొటోలతో 'ఎక్స్'లో పోస్టు పెట్టారు."కొళత్తూర్‌కు నాకు మధ్య ఉన్న అనుబంధం గెలుపోటములకు అతీతమైనది. ఇక్కడి ప్రజలు గత 15 ఏళ్లుగా నాకు అండగా నిలిచారు. ఇక్కడి నుంచే పదేళ్లు ప్రతిపక్షంలో, ఐదేళ్లు అధికారంలో ఉన్నాను. నా శక్తి మేరకు అభివృద్ధి పథకాలను విజయవంతంగా అమలు చేశాను. తమిళనాడులో దీన్నొక ఆదర్శమంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మౌలిక వసతులను కల్పించా. ప్రజలు లేవనెత్తిన ప్రతి సమస్యనూ నెరవేర్చినందుకు సగర్వంగా ఈరోజు నా నియోజకవర్గంలో ప్రజల్ని వ్యక్తిగతంగా కలిసి కృతజ్ఞతలు తెలిపాను. ప్రతి వీధిలో వెళ్తూ నేను ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు, పార్కులు, లైబ్రరీలు, మ్యారేజ్ హాల్స్, బస్టాండ్లు, ఆస్పత్రులు, స్కూళ్లు, కాలేజీలను చూసి నా విధుల్ని ఎంతో విశ్వాసంతో నిర్వర్తించాననే ప్రగాఢమైన సంతృప్తి కలిగింది. ఎప్పుడూ మీకు అండగా ఉంటాను" అని తన పోస్టులో పేర్కొన్నారు.

# మే 9న బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం

విశ్వంభర, నేషనల్ బ్యూరో:

పశ్చిమబెంగాల్‌లో మే 9న బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య వెల్లడించారు. నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆ రోజున నూతన సీఎం ప్ర మాణస్వీకారం చేస్తారని తెలిపారు. ఠాగూర్ ఆశీర్వాదంతో రాష్ట్రంలో ఒక కొత్త ఆరంభానికి నాంది పలకడానికి ఈ తేదీని నిర్ణయించామన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన పనులుచేస్తున్నామన్నారు. కాగా బెంగాల్ ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది.బెంగాల్ ఎన్నికల ఫలితాల అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను ఈసీ ఉన్నతాధికారులు.. ప్రధానఎన్నికల అధికారి మనోజ్‌కుమార్ అగర్వాల్‌కు నేడు అందజేయనున్నారు. బుధవారం ఈ అధికారిక పత్రాలను సీఈసీ.. గవర్నర్ ఆర్.ఎన్.రవికి ఇస్తారు. అనంతరం కొత్త ప్రభుత్వఏర్పాటుకు వీలుగారాజ్యాంగప్రక్రియ కొనసాగుతుంది.

**ఏళ్ల తర్వాత తెరుచుకున్న ఆలయం..**

బెంగాల్‌లోనిఅసన్‌సోల్ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా మూసి ఉన్న దుర్గాదేవి ఆలయం సోమవారం తిరిగి తెరుచుకుంది. వివిధ వర్గాల మధ్య ఉద్రిక్తతలు, పాలనాపరమైన ఆంక్షల వల్ల ఈ ఆలయం చాలాకాలంగా మూసేసి ఉంది. దుర్గా పూజ, లక్ష్మీ పూజ వంటి వేడుకల కోసం మాత్రమే దీనిని తెరిచేవారు. తాను గెలిస్తే ఆలయాన్ని తెరిపిస్తానని అసన్‌సోల్ ఉత్తర్ స్థానం నుంచి పోటీ చేసిన భాజపా ఎమ్మెల్యే కృష్ణేందు ముఖర్జీ ప్రజలకు వాగ్దానం చేశారు. చెప్పినట్లుగానే సోమవారం గెలిచిన వెంటనే ఆయన ఆలయాన్ని సందర్శించి పునఃప్రారంభించారు.

## ఇద్దరు భారతీయ జర్నలిస్టులకు పులిట్జర్..

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** పాత్రికేయ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే పులిట్జర్ పురస్కారం ఇద్దరు భారతీయ జర్నలిస్టులను వరించింది . డిజిటల్ నిఘా, సైబర్ మోసాలను విస్తృతంగా వెలుగులోకి తెచ్చినందుకు ఆనంద్ ఆర్కే, సుపర్ణాశర్మ ఈ అవార్డును దక్కించుకున్నారు. ఇలస్ట్రేటెడ్ రిపోర్టింగ్, కామెంటరీ విభాగం కింద దీనిని ప్రకటించారు. ప్రముఖ మీడియా సంస్థ బ్లూమ్‌బెర్గ్‌కు చెందిన నటాలీ ఒబికో పియర్సన్‌తో కలిసి ఆనంద్, సుపర్ణ ఈ అవార్డును షేర్ చేసుకోనున్నారు.




## ఖతార్ గగనతలంలో అమెరికా 'గ్యాస్ స్టేషన్' మిస్సింగ్..!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

పశ్చిమాసియా ఘర్షణల వేళ అమెరికాకు మరో ఎదురుదెబ్బ తగిలినట్లు కనిపిస్తోంది. ఆ దేశ మిలిటరీ విమానాలకు ఎగిరే గ్యాస్ స్టేషన్‌గా పనిచేసే బోయింగ్ కెసి-135 స్ట్రాటోట్యాంకర్ ఖతార్ గగనతలంలో రాడార్‌తో సంబంధాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అల్ దఫ్రా ఎయిర్‌బేస్ నుంచి టేకాఫ్ అయిన ఈ ట్యాంకర్ పర్షియన్ గల్ఫ్ మీదుగా ప్రయాణిస్తున్నప్పుడు ఎమర్జెన్సీ సిగ్నల్ పంపినట్లు ఇరాన్ మీడియా సంస్థ పేర్కొంది. అత్యవసరంగా ల్యాండింగ్ చేయాల్సి వచ్చినప్పుడే అలాంటి కోడ్‌ను ప్రసారం చేస్తారని పేర్కొంది.పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో అక్కడ మోహరించిన విమానాలకు అవసరమైన ఇంధనాన్ని సరఫరా చేసేందుకు ఈ ట్యాంకర్‌ను అమెరికా సైన్యం ఉపయోగిస్తోంది. దీనివల్ల ఫైటర్ జెట్స్, బాంబర్లు, ఇతర సైనిక విమానాలు ఎక్కువ గంటలు ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది. తాజాగా ఈ విమానం అత్యవసర ల్యాండింగ్‌కు యత్నిస్తోన్న సమయంలో కొద్దిసేపు గుండ్రంగా తిరిగినట్లు ఫ్లైట్‌రాడార్24 డేటాలో కనిపించింది. అయితే అది ఎందుకు అత్యవసరంగా ల్యాండ్ కావాల్సి వచ్చిందో మాత్రం తెలియరాలేదు. అలాగే ఇరాన్-అమెరికా ఉద్రికత్తలకు దీనికి ఏమైనా సంబంధం ఉందా..? అనేది కూడా స్పష్టత లేదు. తమ ప్రమేయంపై ఇరాన్ ఎలాంటి ప్రకటనా చేయలేదు.


# విశాఖ కేంద్రంగా కొత్త రైల్వేజోన్.. ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది

**విశ్వంభర, ఏపీ బ్యూరో:**
సాగర తీర నగరమైన విశాఖ కేంద్రంగా కొత్త రైల్వేజోన్ ఏర్పాటు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ నిర్ణయం ఎంతో దోహదం చేస్తుందని నేతలు సంబరపడుతున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడి తమ బిడ్డల భవిష్యత్ బాగుంటుందని స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై ముఖ్య మంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందన్నారు. ఏపీ విజ్ఞప్తిని మన్నించి చరిత్రాత్మక గెజిట్ విడుదలకు సహకరించిన ప్రధాని మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం అవుతాయన్నారు. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస-ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ఉత్తరాంధ్ర రవాణా రంగ ముఖచిత్రాన్ని మారుస్తుందని అభిప్రాయపడ్డారు. నూతనంగా ఏర్పాటైన విశాఖ డివిజన్, రాయగడ డివిజన్‌ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని వెల్లడిం చారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రత్యేకించి ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి ఈ జోన్ దోహదపడుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. గుంతకల్లు డివిజన్ నుంచి "రాయచూర్ - వాడి సెక్షన్" సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీ అయింది. రాయగడ నుంచి కొన్ని సెక్షన్లను విశాఖ డివిజన్‌లో కలుపుతూ ఉత్తర్వులు విడుదల చేసింది. తాజా ఉత్తర్వులతో రాయగడ డివిజన్‌లో ఇంతకు ముందున్న పలాస-ఇచ్ఛాపురం రైల్వే లైన్, ఇచ్ఛాపురం-దువ్వాడ-విజయ నగరం లైన్?ను విశాఖ డివిజన్?లో చేరాయి. అదే విధంగా నౌపడ -పర్లాకిమిడి, బొబ్బిలి-సాలూరు లైన్?లు సింహాచలం-వడ్లపూడి, విశాఖ-జగ్గయ్యపాలెం రైల్వేలైన్లను విశాఖ డివిజన్?లో విలీనం చేశారు. కోరాపుట్-కిరండోల్ లైన్?ను విశాఖ, రాయగడ డివిజన్లకు సంయుక్తంగా కేటాయించింది. ఈ మార్పులన్నీ జూన్ 1, 2026 నుంచి అమల్లోకి వస్తాయని నోటిఫికేషన్‌లో రైల్వే బోర్డు స్పష్టం చేసింది.

**ఇవే గీటురాళ్లు..**
ఉత్తరాంధ్ర అభివృద్ధికి విశాఖ రైల్వే జోన్ గ్రోత్ ఇంజిన్‌లా మారుతుందని నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైళ్ల సంఖ్య పెరిగి కనెక్టివిటీ మెరుగుపడుతుందని చెప్పారు. ఇచ్ఛాపురం, పలాస సెక్షన్లను విశాఖ డివిజన్‌కు బదిలీ చెయ్యడంలో ప్రభుత్వం చూపిన చొరవ అభినందనీయమని కొనియాడారు.ఇటీవల అమరావతికి చట్టబద్ధత, నేడు విశాఖ రైల్వే జోన్‌కు గెజిట్? వచ్చిందని టీడీపీ నేత ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వేగవంతమైన పాలనకు ఇవే గీటురాళ్లని ఆయన అన్నారు. రాష్ట్రాన్ని లాజిస్టిక్స్ హబ్ చేయాలన్న సీఎం ఆలోచనకు తొలి అడుగు పడిందన్నారు. వచ్చే నెల 1 నుంచి విశాఖ రైల్వే జోన్ అమల్లోకి వస్తుందన్న ప్రత్తిపాటి ఈ జోన్‌తో పారిశ్రామిక అభివృద్ధికి మార్గం సుగమమవుతుందన్నారు. కొత్త రైల్వే జోన్ పరిధిలో 74 స్టేషన్ల ఆధునికీకరణ, 1,039 కి.మీ. మేర కొత్త లైన్ ఏర్పాటు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రధాన పోర్టులు, పారిశ్రామిక హబ్‌లు కలుపుతూ రైల్వే లైన్ వస్తుందని ప్రత్తిపాటి వివరించారు.రైల్వే జోన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదలపై ఉత్తరాంధ్ర ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ బిడ్డలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



## ఐపీఎస్ అధికారి విశాల్ గున్నికి హైకోర్టులో ఎదురు దెబ్బ



విశ్వంభర, అమరావతి: ఐపీఎస్ అధికారి విశాల్ గున్నికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. విశాల్ సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ గతేడాది ఇచ్చిన క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పిటిషన్‌పై లోతైన విచారణ అవసరమని ధర్మాసనం అభిప్రాయ పడింది. సినీనటి కాదంబరీ జత్వాని అక్రమ అరెస్ట్, అధికార దుర్వినియోగం కేసులో విశాల్ గున్నిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. తన సస్పెన్షన్‌పై విశాల్ గున్ని క్యాట్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన క్యాట్.. సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేసి వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని గతేడది ఆగస్టు 28న ఉత్తర్వులు జారీ చేసింది.క్యాట్ ఉత్తర్వులను ఏపీ సీఎస్, డీజీపీలు హైకోర్టులో సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదన లు విని పించారు. సస్పెన్షన్ కాల పరిమితి ముగియక ముందే ఉత్తర్వులను క్యాట్ రద్దు చేసిందని, దీంతో విచారణ ముందుకు వెళ్లలేదని అడ్వొకేట్ జనరల్ పేర్కొన్నారు. విశాల్ గున్ని తరుపున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనల అనంతరం క్యాట్ ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించింది. తదుపరి విచారణను ధర్మాసనం ఆగస్టు 29కి వాయిదా వేసింది.

## భార్యను చంపడం ఎలా..? యూట్యూబ్‌లో శోధించి హత్య



విశ్వంభర, ప్రొద్దుటూరు : కడప జిల్లా ప్రొద్దుటూరులో వివాహిత పద్మజ అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. భర్త కిరణ్ కుమార్ హత్య చేసినట్లు నిర్ధరించారు. అతడిని అరెస్టు చేసి విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రొద్దుటూరు ఏఎస్పీ విబూ కృష్ణ కేసు వివరాలు మీడియాకు వెల్లడించారు.భార్య లావుగా ఉండటంతోపాటు, తనను నిత్యం అనుమానిస్తోందన్న కారణంతో ఆమె హత్యకు భర్త ప్రణాళిక రచించాడు. భార్యను సులువుగా చంపడం ఎలా..? అని యూట్యూబ్‌లో శోధించాడు. రూ.80 వేలు ఖర్చు చేసి హైదరాబాద్ నుంచి కొరియర్ ద్వారా విషాన్ని ప్రొద్దుటూరు తెప్పించాడు. గత నెల 29న పాలకోవాలో విషం కలిపి భార్యకు ఇవ్వడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. అనంతరం ఆమె చనిపోయిందో లేదోనని ముఖంపై దిండుతో నొక్కాడు. ఆ తర్వాత ఏమీ తెలియనట్టు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. శరీరంపై ఎలాంటి గాయాలు లేకుండానే పద్మజ చనిపోవడంతో పోలీసులు అనుమానంతో విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పదింతల ప్రోత్సాహం

### - నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధుల సత్కారం

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**
వివిధ నియోజకవర్గాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సన్మానించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను వారు ఘనంగా సత్కరించి, వారితో కలిసి భోజనం చేశారు. అంతేకాకుండా వారికి ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. భవిష్యత్తులో మరింత గొప్ప విజయాలను సాధించే దిశగా సాగే వారి ప్రయాణంలో ప్రభుత్వం అండగా ఉంటుందని వారు విద్యార్థులకు భరోసా ఇచ్చారు. : కూటమికి చెందిన ప్రజా ప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో 10వ తరగతి ఫలితాల్లో అసాధారణ ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని తన నివాసంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు విద్యార్థుల కోసం ఒక విందును ఏర్పాటు చేశారు. అయ్యన్న కుటుంబ సభ్యులు స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా స్పీకర్ విద్యార్థులకు ఏటికొప్పాక చెక్కతో రూపొందించిన సరస్వతీ అమ్మవారి విగ్రహాలను బహుమతులుగా అందజేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో ప్రభుత్వ విప్ జి.వి. ఆంజనేయులు విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ఆ నియోజకవర్గ పరిధిలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ ర్యాంకు సాధించిన ఒక ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి రూ. 20,000 నగదు బహుమతిని అందజేశారు. అదేవిధంగా మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆయన ఒక్కొక్కరికీ రూ.10,000 చొప్పున బహుమతులు అందజేశారు. : అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే సురేంద్ర బాబు విద్యార్థులను ఘనంగా సన్మానించి వారికి బ్యాగులను బహుమతులుగా అందజేశారు. విజయవాడలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ మండలి ఛైర్మన్ బాలకోటయ్య సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ 10వ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ విజయవాడలో '10వ తరగతి టాపర్లతో భోజనం' పేరుతో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. 580కి పైగా మార్కులు సాధిం చిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఆయన కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన విద్యార్థులను శాలువాలతో సన్మానించి వారికి జ్ఞాపికలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుకున్న బాలబాలికలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించడం అభినందనీయమని బాపట్లజిల్లా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మార్టూరు మండలం ఇసుకదర్శి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే ఏలూరి సత్కరించారు.మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం మండలాల్లో ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను జ్ఞాపికలతో సన్మానించారు. ప్రోత్సాహక బహుమతులు అందజేసి, శ్రమించిన ఆయాపాఠశాలలఉపాధ్యాయులనూ సత్కరించారు.



## ఆకివీడు రామాలయ నిర్మాణంపై దాఖలైన పిటిషన్ కొట్టేసిన హైకోర్టు



**విశ్వంభర, అమరావతి:** పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో రామాలయం నిర్మాణంపై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. రామాలయం నిర్మాణానికి అధికారులు అనుమతులు ఇవ్వడంపై హైకోర్టులో కొందరు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం గత 80 ఏళ్లుగా అక్కడ రామాలయం ఉన్నట్లు రికార్డులు చెబుతున్నట్లు పేర్కొంది. అన్ని ఆధారాలు, రికార్డులు పరిశీలించాకే అధికారులు అనుమతులు ఇచ్చినట్లు తెలిపింది. ఈ నేపథ్యంలోనే పిటిషన్ కొట్టివేసినట్లు స్పష్టం చేసింది.

## ఏపీ హైకోర్టుకు ముగ్గురు జడ్జిలను సిఫారసు చేసిన కొలీజియం




**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు జడ్జిలను సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. అన్ని రాష్ట్రాలకు న్యాయ మూర్తులను సిఫారసు చేసే ప్రక్రియలో భాగంగా నిన్న సమావేశమైన కొలీజియం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని వివిధ న్యాయస్థానాల్లో న్యాయాధికారులుగా పనిచేస్తోన్న ముగ్గురు అధికారులను న్యాయమూర్తులుగా ప్రమోట్ చేయాలని.. కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఏపీలో వివిధ కోర్టుల్లో న్యాయాధికారులుగా ఉన్న గంధం సునీత, ఆలపాటి గిరిధర్, చింతపూడి పురుషోత్తమ్ కుమార్‌లు ఈ జాబితాలో ఉన్నారు. రాష్ట్రపతిఆమోదం తర్వాతవీరినియా మకంపై అధికారికఉత్తర్వులు వెలువడనున్నాయి.

## ఏపీ పాలిసెట్ ఫలితాలు విడుదల



**విశ్వంభర, అమరావతి:** ఏపీ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్-2026 ఫలితాలు విడుదలయ్యాయి. మంగళవారం ఉదయం ఎక్స్ వేదికగా మంత్రి లోకేశ్ ఫలితాలు విడుదల చేశారు. పాలిసెట్‌కు మొత్తం 1,77,581 మంది దరఖాస్తు చేయగా.. 1,63,008 మంది పరీక్ష రాశారు. వీరిలో 1,48,950 మంది అర్హత సాధించారు. పాలిసెట్‌లోనూ బాలికలే పైచేయి సాధించారు. 93.57 శాతం మంది అర్హత పొందారు. బాలురు లో 89.88 మంది అర్హులయ్యారు. మొత్తంగా.. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికంగా 99.11 శాతం మంది అర్హత సాధిం చగా.. తర్వాతి స్థానాల్లో పోలవరం (95.46శాతం), పార్వతీపురం మన్యం (93.45 శాతం) జిల్లాలు నిలిచాయి.

# విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ గెజిట్ జారీ




**విశ్వంభర, ఢిల్లీ:** ఉత్తరాంధ్ర వాసుల చిరకాల కోరిక అతిత్వరలోనే సాకారం కానుంది. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2026 జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని గెజిట్‌లో పేర్కొంది. గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లను విశాఖ జోన్ పరిధిలోకి తీసుకొచ్చింది. దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వే నుంచి కొన్ని ప్రాంతాలను కలిపి దక్షిణ కోస్తా రైల్వే ఏర్పాటు చేస్తున్నట్లు గెజిట్‌లో కేంద్రం పేర్కొంది. రాయగడ నుంచి కొన్ని సెక్షన్లను విశాఖ డివిజన్‌లో కలుపుతూ ఉత్తర్వులు విడుదల చేసింది.తాజా ఉత్తర్వులతో రాయగడ డివిజన్‌లో ఇంతకుముందున్న పలాస-ఇచ్ఛాపురం రైల్వే లైన్, ఇచ్ఛాపురం - దువ్వాడ- విజయనగరం రైల్వే లైన్లు విశాఖ డివిజన్‌లో చేరాయి. అదే విధంగా నౌపడా- పర్లాకిమిడి- బొబ్బిలి - సాలూరు లైన్లు, సింహాచలం- వడ్లపూడి- విశాఖ జగ్గయ్యపాలెం రైల్వే లైన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేశారు. కోరాపుట్-కిరండోల్ లైన్‌ను విశాఖ, రాయగడ డివిజన్లకు సంయుక్తంగా కేటాయించారు.ఆరిలోవలో దక్షిణ కోస్తా రైల్వే శాశ్వత కార్యాలయ నిర్మాణం చేపట్టనున్నారు. వీఎంఆర్‌డీఏ డెక్‌లోని రెండు అంతస్తుల్లో దక్షిణ కోస్తా రైల్వే జీఎం తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేశారు. జూన్ 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభించడానికి అధికారులు ఇప్పటికే రంగం సిద్ధం చేశారు. 2019 ఫిబ్రవరిలో కేంద్రం ఈ జోన్ ఏర్పాటుపై ప్రకటన చేసింది. తర్వాత అది ముందుకు సాగలేదు. చివరికి 2025 జనవరిలో డీపీఆర్‌కు ఆమోదం తెలిపి అదే నెలలో జోనల్ కార్యాలయం భవన నిర్మాణానికి ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. తాజాగా కీలకమైన గెజిట్ నోటిఫికేషన్ రావడంతో అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి.ఈ జోన్ కార్యకలాపాలకు కీలక అధికారుల నియామకం ఇప్పటికే పూర్తయింది. ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్, ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్, ప్రిన్సిపల్ చీఫ్ ఫైనాన్షియల్ అధికారుల నియామకం పూర్తయింది. ఇతర డివిజన్ల నుంచి ఆప్షన్లు కోరగా 3వేల మంది విశాఖ జీఎం కార్యాలయం పరిధిలో పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. జీఎం కార్యాలయంలో 1200 మంది అవసరం, జోన్ అంతటా 17వేల మంది వరకు పనిచేస్తారు.

## రూ.5.11 లక్షల కోట్లతో నాబార్డు రుణ ప్రణాళిక.. ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు



**విశ్వంభర, అమరావతి:** నాబార్డు 2026-27 సంవత్సరానికి గాను రూ.5.11 లక్షల కోట్ల రుణ ప్రణాళికతో రూపొందించిన నాబార్డు క్రెడిట్ ప్లాన్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. రుణ ప్రణాళిక గతేడాది రూ.4.24 లక్షల కోట్లు ఉండగా... ఈ ఏడాది 20 శాతం పెంచి రూ.5,11,491 కోట్లతో ప్రాథమిక రంగానికి రుణ ప్రణాళిక ప్రకటించింది. సాగుకు మొత్తం రూ.2.55 లక్షల కోట్లు కేటాయించింది. ఇందులో పంట రుణాలు రూ.1.66 లక్షల కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.34,972 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.8,265 కోట్లు, ఫిషరీస్‌కు రూ.21,098 కోట్లు, హార్టికల్చర్‌కు రూ.11,961 కోట్లు కేటాయించింది. హార్టికల్చర్‌లో రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు రూ.5,313 కోట్లు కేటాయించారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.9,957 కోట్లు, అనుబంధ కార్యకలాపాలకు రూ.12,687 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసింది. అలాగే ఎంఎస్‌ఎంఈ లకు రూ.1.64 లక్షల కోట్లు చొప్పున కేటాయించింది.

## తమను ఆదుకోవాలని వృద్ధ దంపతుల నిరసన.. మంత్రి లోకేష్‌కు విన్నపం



**విశ్వంభర, ఏపీ బ్యూరో:** ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట వృద్ధ దంపతులు నిరసనకు దిగారు. కుంటముక్కల గ్రామానికి చెందిన ఈ దంపతులు భూ వివాదం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఫోటోతో కార్యాలయం ఎదుట బైఠాయించి తమ సమస్యపై దృష్టి సారించాలని కోరారు. భూ సమస్య విషయంలో అనేకసార్లు అధికారులను సంప్రదించినప్పటికీ న్యాయం జరగలేదని ఆరోపించారు. గత ఐదు నెలలుగా ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరవుతున్నప్పటికీ ఎలాంటి పరిష్కారం లభించలేదని తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ స్థానిక రెవెన్యూ అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తమకు న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగిస్తామని వృద్ధ దంపతులు స్పష్టం చేశారు. ప్రస్తుతం పని చేయలేని పరిస్థితిలో ఉన్న తమను ఆదుకోవాలని మంత్రి నారా లోకేష్‌ను వేడుకున్నారు.

## తల్లీ, ముగ్గురు పిల్లల్ని కాపాడిన బ్లూకోల్ట్స్ సిబ్బంది



విశ్వంభర, కడప : భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ, తన ముగ్గురు పిల్లలతో కలిసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని యత్నించారు. ఈ విషయాన్ని డయల్ 112 ద్వారా తెలుసుకున్న వైఎస్సార్ కడప బ్లూకోల్ట్స్ సిబ్బంది హుటాహుటిన వెళ్లి ఆ నలుగురిని కాపాడారు.వివరాల్లోకి వెళ్తే.. చెన్నూరు మండలం శాటిలైట్ సిటీలో ఉంటున్న ఓ మహిళను ఆమె భర్త ప్రతి రోజు వేధిస్తుండే వాడు. రోజు రోజుకు వేధింపులు ఎక్కువవడంతో భరించలేక మనస్తాపానికి గురయ్యారు. ఆత్మహత్య చేసుకునేందుకు ఆమె తన 11, 10, 8 ఏళ్ల ముగ్గురు పిల్లలతో మంగళవారం కడప-తిరుపతి రైల్వే మార్గంలో పట్టాలపై నిలబడ్డారు.మహిళ బంధువులు వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వడంతో కమాండ్ కంట్రోల్ సీఐ పురుషోత్తంరాజు తమ సిబ్బందిని అప్రమత్తం చేశారు. అదే సమయంలో సీపీ బ్రౌన్ గ్రంథాలయం వద్ద విధుల్లో ఉన్న బ్లూకోల్ట్స్ సిబ్బంది సుబ్బ రాయుడు, రాజీవ్‌కుమార్‌కు చేరవేయడంతో వారు సమయస్ఫూర్తితో బాధిత మహిళతో ఫోన్‌లో మాట్లాడుతూ ఆమె ఉన్న ప్రాంతానికి చేరుకుని నలుగురినీ కాపాడారు. అనంతరం కుటుంబ సభ్య ల కు అప్పగించారు. జిల్లా పోలీసు అధికారి నచికేత్ విశ్వనాథ్ బ్లూకోల్ట్స్ సిబ్బందిని అభినందిం చారు. కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే నలుగురి ప్రాణాలను కాపాడటం అభినందనీయమన్నారు.

## పోలీసు కస్టడీకి వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు



**విశ్వంభర, రాజమహేంద్రవరం:** డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసుకు సంబంధించి సాక్షులను బెదిరించిన కేసులో వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబును పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. అతడిని ఒకరోజు కస్టడీలోకి తీసుకునేందుకు కాకినాడలోని మొబైల్ కోర్టు అనుమ తించింది. సాక్షులను ప్రలోభపెట్టి.. చంపుతానని బెదిరించినట్లు అనంతబాబుపై అభియోగాలున్నాయి. కోర్టులో తనకు అనుకూలంగా సాక్ష్యం చెప్పాలని, లేదంటే చంపేస్తానని సాక్షులను బెదించినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల అనంతబాబును అరెస్టు చేసిన పోలీసులు అతడి ఐఫోన్‌ను స్వాధీనం చేసుకొని కాల్‌డేటా సేకరించారు. తాజాగా న్యాయస్థానం కస్టడీకి అనుమతించడంతో పలు ప్రశ్నలు సంధించి అనంతబాబు నుంచి సమాధానాలు రాబట్టనున్నారు.

# సినీ తార నుంచి సింహాసనం వరకు

## విజయ్ రాజకీయ యాత్రలో కీలక ఘట్టం

తమిళనాడు రాజకీయ చరిత్ర ఎప్పుడూ ఒక విలక్షణమైన ప్రవాహం. వెండితెర వెలుగుల నుంచి ప్రజాక్షేత్రం లోకి వచ్చి, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన ఎం.జి. రామచంద్రన్, జయలలిత వంటి ఉద్దండుల వారసత్వం ఆ నేలపై బలంగా నాటుకు పోయింది. సరిగ్గా ఇదే బాటలో, 2026 అసెంబ్లీ ఎన్నికల వేళ 'దళపతి' విజయ్ తన 'తమిళగ వెట్రి కళగం' (టీ వీ కే) పార్టీతో సృష్టించిన ప్రభంజనం కేవలం ఒక నటుడి రాజకీయ ప్రవేశం మాత్రమే కాదు, అది దశాబ్దాల ద్రావిడ రాజకీయ గుత్తాధిపత్యానికి విసిరిన సవాలు. డీఎంకే, అన్నాడీఎంకే అనే రెండు ప్రధాన ధృవాల మధ్య నలిగిపోతున్న సామాన్యుడికి, ప్రత్యామ్నాయం కోరుకుంటున్న యువతకు విజయ్ ఒక ఆశాకిరణంగా కనిపించారు. అయితే, ఎన్నికల అనంతరం వెలువడిన ఫలితాలు విజయ్‌ను సింహాసనానికి చేరువగా తెచ్చినప్పటికీ, పూర్తి మెజారిటీకి అవసరమైన మేజిక్ ఫిగర్‌కు కొద్ది దూరంలోనే నిలిపివేసి, రాష్ట్ర రాజకీయాలను ఒక అనిశ్చిత, ఆసక్తికర మలుపు వద్ద నిలబెట్టాయి.?తమిళనాడు అసెంబ్లీలోని మొత్తం 234 స్థానాలకు గాను, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 118 స్థానాల మద్దతు అవసరం. ప్రస్తుత గణాంకాల ప్రకారం టీవీకే 108 స్థానాలను కైవసం చేసుకుని అతి పెద్ద పార్టీగా అవతరించింది. ఒక కొత్త పార్టీకి, అందునా తొలి ఎన్నికల్లోనే సుమారు 35 శాతం ఓట్లను కొల్లగొట్టి 100 దాటడం అనేది భారత రాజకీయాల్లోనే అరుదైన విషయం. కానీ, ఈ 'విజయ్ విజయం' మెజారిటీ మార్కును దాటక పోవడమే ఇప్పుడు అసలైన రాజకీయ చదరంగ ప్రాధాన్యతను పెంచింది. సంప్రదాయ రాజకీయ శక్తులైన డీఎంకే తన పట్టును కోల్పోవడం, అన్నాడీఎంకే ఆశించిన స్థాయిలో పుంజుకోలేక పోవడం గమనిస్తే, ప్రజలు మార్పును కోరుకున్నారనేది స్పష్టమవుతోంది. ఈ మార్పు ఆకాంక్షే విజయ్‌ను కింగ్ మేకర్ స్థాయి నుంచి ఏకంగా కింగ్‌అయ్యే దిశగానడిపించింది. ఇప్పుడు ఆయన ముందున్న ఏకైక మార్గం 'మద్దతుల మేళవింపు'. ఈక్లిష్ట పరిస్థితుల్లోజాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ పాత్ర అత్యంత కీలకంగా మారింది. గత కొన్నేళ్లుగా డీఎంకేతో అంటకాగుతున్న కాంగ్రెస్, ఇప్పుడు తమిళనాడులో తన ఉనికిని చాటుకోవడానికి, అధికారంలో భాగస్వామి కావడానికి విజయ్ వైపు మొగ్గు చూపే అవకాశాలు మెండుగా ఉన్నాయి. జాతీయ స్థాయిలో బీజేపీని నిరోధించాలనే లక్ష్యం ఉన్నప్పటికీ, రాష్ట్ర స్థాయిలో ఒక బలమైన ప్రాంతీయ శక్తిగా ఎదుగుతున్న విజయ్‌తో చేతులు కలపడం వల్ల కాంగ్రెస్‌కు భవిష్యత్తులో లబ్ధి చేకూరుతుంది. ముఖ్యంగా మైనారిటీలు, క్రైస్తవ ఓటు బ్యాంకు విజయ్ వైపు మళ్ళడం కాంగ్రెస్‌ను పునరాలోచనలో పడేసింది. మరోవైపు, సిద్ధాంతపరంగా బద్ధశత్రువులైన డీఎంకే, విజయ్ మధ్య ఉన్న వైరం ఇప్పుడు రాజీ ధోరణిలోకి వస్తుందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. బీజేపీని రాష్ట్రంలో అడుగుపెట్ట నివ్వకూడదనే ఉమ్మడి లక్ష్యంతో, డీఎంకే బయటి నుంచి మద్దతు ఇచ్చే సాపసం చేస్తుందా లేక ప్రతిపక్షంలో కూర్చుని వ్యూహాత్మక దాడులు చేస్తుందా అనేది వేచి చూడాలి.?అన్నాడీఎంకే విషయానికి వస్తే, జయలలిత మరణానంతరం ఆ పార్టీలో ఏర్పడిన శూన్యం, అంతర్గత విభేదాలు విజయ్‌కు వరంగా మారాయి. గణాంకాల పరంగా అన్నాడీఎంకే మద్దతు లభిస్తే విజయ్ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుంది. కానీ, రాజకీయాల్లో ఇద్దరు బలమైన నేతలు ఒకే ఒరలో ఇమడటం కష్టం. భవిష్యత్తులో ఓటు బ్యాంకు పంపకాలపై వచ్చే ఘర్షణలు ఈ కూటమికి అవరోధంగా మారవచ్చు. అయినప్పటికీ, రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరనేసూత్రం ప్రకారం, అధికారాన్ని పంచుకోవడానికి ఈ రెండు శక్తులు కలిసినా ఆశ్చర్య పోనక్కర్లేదు. ఇవే కాకుండా, ఈ హంగ్ అసెంబ్లీలో చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు అకస్మాత్తుగా శక్తిమంతులుగా మారారు. ఒక్కో ఓటు ఒక ప్రభుత్వాన్ని కూల్చగలదు లేదా నిలబెట్టగలదు. ఇలాంటి తరుణంలో విజయ్ తన వ్యక్తిగత చరిష్మాతో ఈ చిన్నాచితకా శక్తులను ఎలా ఏకతాటిపైకి తెస్తారనేది ఆయన నాయకత్వ పటిమకు నిదర్శనం. విజయ్ ప్రస్థానంలో గమనించాల్సిన మరో ముఖ్య విషయం ఆయన సిద్ధాంత పరమైన పరిణతి. కేవలం సినీ గ్లామర్‌ను నమ్ముకోకుండా, ఆయన తన ప్రసంగాల్లో అంబేద్కర్, పెరియార్, కామరాజర్ వంటి మహనీయుల ఆశయాలను ప్రస్తావించడం ద్వారా ద్రావిడ సిద్ధాంతానికి సరికొత్త భాష్యం చెప్పారు. అవినీతి నిర్మూలన, సామాజిక న్యాయం, సెక్యులరిజం వంటి అంశాలను ఆయన తన ఎజెండాలో చేర్చడం ద్వారా విద్యావంతులను, యువతను ఆకర్షించారు. అయితే, ఇప్పుడుప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి వస్తే, ఇతర పార్టీలతో రాజీ పడాల్సి ఉంటుంది. ఎన్నికల ముందు 'ఒంటరి పోరు' అన్న మాట మార్చుకుని, కూటమి రాజకీయాలకు తెరలేపితే ప్రజల్లో ఉన్న 'నిఖార్సైన నాయకుడు' అనే ముద్రకు ఎంతో కొంత నష్టం కలిగే ప్రమాదం ఉంది. ప్రజాదరణను పరిపాలనగా మార్చడం కత్తి మీద సాము వంటిదే. ముఖ్యంగా పాలనా అనుభవం లేని టీమ్, ఇతర పార్టీల ఒత్తిళ్లు విజయ్‌ను ఇబ్బందులకు గురిచేయవచ్చు. తమిళనాడు ఓటర్ల తీర్పును లోతుగా విశ్లేషిస్తే, అక్కడ ప్రజలు పాత పద్ధతులపై విసుగు చెందారు. వారసత్వ రాజకీయం కంటే సమర్థతకు పట్టం కట్టాలని భావిస్తున్నారు. విజయ్ సాధించిన ఓటు శాతం మరియు సీట్ల సంఖ్య ఆయనను ఒక సీరియస్ పొలిటికల్ ప్లేయర్‌గా నిలబెట్టాయి. 2026 నాటికి రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగం, పెరుగుతున్న ధరలు, డీఎంకే ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను విజయ్ సమర్థంగా వాడుకున్నారు. ఇప్పుడు ఆయన ముందున్న తక్షణ కర్తవ్యం మైనారిటీ ప్రభుత్వం ఏర్పాటు చేయడమా లేక కూటమి ప్రభుత్వాన్ని నడిపించడమా? మైనారిటీ ప్రభుత్వం అయితే ఎప్పుడూ అస్థిరత నీడలోనే ఉండాలి. అదే కూటమి అయితే అధికారాన్ని, నిర్ణయాలను పంచుకోవాలి. ఏది ఏమైనా, విజయ్ సినీ రంగం నుంచి సింహాసనం వైపు వేసిన అడుగులు ఇప్పుడు తుది అంకానికి చేరుకున్నాయి. విజయ్ ప్రస్థానం తమిళనాడులో ఒక రాజకీయ పునరుజ్జీవనానికి నాంది పలికింది. డీఎంకే, అన్నాడీఎంకేల కంచుకోటలు బద్దలవుతున్న వేళ, ఒక కొత్త శక్తి ఉద్భవించడం ప్రజాస్వామ్యానికి శుభ పరిణామం. కానీ, సంఖ్యా బలం సరిగ్గా లేని స్థితిలో, ఆయన తీసుకునే నిర్ణయాలు తమిళనాడు భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ఇతర పార్టీల మద్దతు కూడగట్టడంలో ఆయన చూపే నేర్పు, కూటమిని నడపడంలో ఆయన చూపే సహనం ఆయనను ఒక పరిపూర్ణ రాజకీయ వేత్తగా మారుస్తాయి. తమిళనాడు ప్రజలు తమ ఆకాంక్షలను విజయ్ రూపంలో చూసుకుంటున్నారు. ఆ ఆకాంక్షలను నెరవేర్చి, సుస్థిరమైన పాలనను అందించడమే విజయ్ ముందున్న అసలైనసవాలు. 2026 ఎన్నికలు కేవలం విజేతను నిర్ణయించలేదు, ఒకకొత్త రకమైన రాజకీయ సంస్కృతికి పునాది వేసాయి. విజయ్ ఆపీఠం ఎక్కుతారా లేదా అన్నదానికంటే, ఆయన సృష్టించిన ఈ రాజకీయ ప్రకంపనలు భవిష్యత్తు తరాలకు ఒక గొప్ప పాఠం. సంప్రదాయ ద్రావిడ రాజకీయాల నుంచి నవ ద్రావిడ రాజకీయాల వైపు తమిళనాడు చేస్తున్న ఈ ప్రయాణంలో విజయ్ ఒక కీలక మలుపు. ఆయన వేసే ప్రతి అడుగు ఇప్పుడు రాష్ట్రానికే కాదు, దేశ రాజకీయాలకేదిశానిర్దేశం చేయనుంది.





రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## ఘనంగా సబితా ఇంద్రారెడ్డి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, మీర్ పేట్:** మాజీమంత్రి ,మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పట్లోల్ల సబితా ఇంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా మీర్ పేట్ బి.ఆర్.యస్ పార్టీ అధ్యక్షుడు ఆర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లెలగూడ క్యాంపు కార్యాలయం లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. జన్మదినం సందర్భంగా వారు ఆయురారోగ్యాలతో ఇదే తరహా ఉత్సాహంతో వారు ఎప్పుడూ ఇలానే ఉండాలని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి అనంతరం అమ్మవారికి 1001 కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం బి.ఆర్.యస్.వి నాయకులు షేర్ రమణ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేసి ఈ రక్తదాన శిబిరంలో సుమారు 70మంది రక్తదానం చేయడం, భారీ కేక్ కట్ చేశారు. అనంతరం మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేయడంతో పాటు విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసి అన్నదానం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్కల భూపాల్ రెడ్డి,సిద్ధాల లావణ్య బీరప్ప,సిద్ధాల పద్మ అంజయ్య, అనిల్ కుమార్ ,ధనలక్ష్మి రాజ్ కుమార్,రేఖ లక్ష్మణ్, స్నేహలత, సిరూర్ బాల్ రాజ్, సిద్ధాల భరత్,మేకల యాదగిరి,శ్రీనివాస్ గుప్తా,గోపి యాదవ్, సహదేవ్, దయానంద్ ,అర్జున్, మహేం దర్, సుదర్శన్ రెడ్డి,రామకృష్ణ, సాయి, పంతంగి మాధవి, సునీత బాల్ రాజ్,లత శేఖర్ పాల్గొన్నారు.

## వీర్లపాటి రామయ్యకు పీహెచ్‌డీ ప్రదానం

**విశ్వంభర, వరంగల్:**



వరంగల్‌లోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్‌డబ్ల్యూ) ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగంలో 32 ఏళ్ల బోధన, పరిశోధన అనుభవం ఉన్న సీనియర్ ఫ్యాకల్టీ వీర్లపాటి రామయ్యకు, చెన్నైలోని వెల్ టెక్ రంగరాజన్ డాక్టర్ సగుంతల ఆర్‌డడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో, కిట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ, వీర్లపాటి రామయ్య "డీఈఏ--మాల్మ్‌క్విస్ట్ ఇండెక్స్ ఉపయోగించి భారతీయ విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరు అంచనా" అనే శీర్షికతో తన పీహెచ్‌డీ సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారని తెలిపారు. ఆయన చెన్నైలోని వెల్ టెక్ రంగరాజన్ డాక్టర్ సగుంతల ఆర్‌డడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన ఈఈడీ ప్రొఫెసర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ పర్యవేక్షణలో తన పరిశోధనను పూర్తి చేశారు. వీర్లపాటి రామయ్య, డేటా ఎన్వలప్‌మెంట్ అనాలిసిస్, మాల్మ్‌క్విస్ట్ ప్రొడక్టివిటీ ఇండెక్స్ పద్ధతులను ఉపయోగించి భారతీయ విద్యుత్ డిస్కామ్‌ల కార్యాచరణ సామర్థ్యం మరియు ఉత్పాదకతను మూల్యాంకనం చేయడానికి ఈ పరిశోధనను నిర్వహించారు.

**ముఖ్య ఫలితాలు:** చాలా డిస్కామ్‌లు గరిష్ట సామర్థ్య స్థాయిల కంటే తక్కువగా పనిచేస్తున్నాయని, ఇన్‌పుట్‌ను గణనీయంగా అధికంగా వినియోగించుకుంటున్నాయని మరియు అధిక అగ్రిగేట్ టెక్నికల్ & కమర్షియల్ నష్టాలను ఎదుర్కొంటున్నాయని ఈ విశ్లేషణ వెల్లడిస్తుంది. కార్యాచరణ సామర్థ్యంలో మోస్తరు మెరుగుదలలు కనిపించినప్పటికీ, సాంకేతిక పురోగతి క్షీణించింది, దీని ఫలితంగా మొత్తం ఉత్పాదకత పడిపోయింది. విస్తృత ప్రాంతీయ వ్యత్యాసాలు దేశవ్యాప్తంగా సంస్కరణల అమలులో అసమానతలను ఎత్తి చూపుతున్నాయి. సిఫార్సు: భారతదేశంలో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న డిస్కామ్‌ల కోసం దశలవారీగా, ఏఐ-ఆధారిత డిజిటల్ పరివర్తనను సిఫార్సు చేస్తున్నాము. స్మార్ట్ మీటరింగ్ పైలట్‌లతో ప్రారంభమై, నష్టాల గుర్తింపు మరియు సేకరణ ఆప్టిమైజేషన్‌కు పురోగమించి, చివరకు రియల్-టైమ్ గ్రిడ్ నిర్వహణతో ముగిసే ఈ విధానం, వ్యయ-నష్టాల విషవలయాన్ని ఛేదించడానికి తక్కువ పెట్టుబడితో అధిక ప్రభావాన్ని చూపే మార్గాన్ని అందిస్తుంది. ఇటువంటి ఏఐ-ఆధారిత జోక్యం లేకుండా, సరఫరా సగటు వ్యయం మరియు వాస్తవ సగటు రాబడి మధ్య అంతరంమరియు కార్యనిర్వహణ అసమర్థతలు తీవ్రమవుతాయి. అందువల్ల, ఆర్థిక స్థిరత్వం మరియు సుస్థిర వృద్ధి కోసం వ్యూహాత్మక ఏఐ స్వీకరణ అత్యవసరం అవుతుంది.

**సామాజిక ప్రాముఖ్యత:** ఈ సిఫార్సులు విశ్వసనీయమైన విద్యుత్ సరఫరాకు, ఆర్థిక నష్టాల తగ్గింపునకు, మరియు సేవా నాణ్యత మెరుగుదలకు మద్దతు ఇవ్వడంతో పాటు, కాన్ఫరెన్స్ ఆఫ్ ది పార్టీస్ (కాప్26) కింద భారతదేశం చేసుకున్న వాతావరణ కట్టుబాట్లకు మరియు 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే దార్శనికతకు కూడా దోహదపడతాయి. ఆయన ఇంకా ఇలా అన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ ఎంపీ మరియు కిట్స్ వరంగల్ చైర్మన్ కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, కోశాధికారి శ్రీ పి. నారాయణ రెడ్డి, యాజమాన్య సభ్యులు శ్రీ ఇ. వెంకట్రామ్ రెడ్డి, మరియు మాజీ హుస్నాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే & కిట్స్ వరంగల్ అదనపు కార్యదర్శి వొడితాల సతీష్ కుమార్ మరియు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి, ఇంధన విధాన రంగంలో, ముఖ్యంగా భారతదేశంలోని విద్యుత్ డిస్కామ్‌ల పనితీరు మూల్యాంకనంపై సమాజానికి మరింత అవసరమైన పరిశోధన చేస్తున్నందుకు ఆయనను అభినందించి, ప్రశంసించారు. ఈ సందర్భంగా, చెన్నైలోని వెల్ టెక్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో పిహెచ్.డి పట్టా పొందిన వీర్లపాటి రామయ్యకు కిట్స్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, పరిపాలనా అధికారి ప్రొఫెసర్ పి. రమేష్ రెడ్డి, నిట్ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ బి.ఎల్.ఎన్. రాజు, కిట్స్ వరంగల్ అకడమిక్ కౌన్సిల్, డీన్లు అందరూ, విభాగాధిపతులు అందరూ, అధ్యాపకులు, సిబ్బంది మరియు రసాయన శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ & పి.ఆర్.ఓ డాక్టర్ డి. ప్రభాకర చారి అభినందనలు తెలిపారు.

# ద్రవిడ గడ్డపై నవ సంచలనం.. బెంగాల్ కోటలో కమల కేతనం

### 2026 ఎన్నికల సునామీ: కుప్పకూలిన పాత కోటలు.. ఆవిర్భవించిన కొత్త శక్తులు

### బహుముఖ పోరు.. అద్భుత తీర్పు: భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చిన 'పంచ' రాష్ట్రాలు

భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో 2026 నాటి పంచ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు కేవలం ఒక సాధారణ అధికార మార్పిడి ఘట్టాలుగా కాకుండా, దేశ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చివేసిన చారిత్రక పరిణామాలుగా విశ్లేషించ బడుతున్నాయి. అస్సాం బ్రహ్మపుత్ర తీరం నుండి బెంగాల్ గంగమ్మ ఒడి వరకు, కేరళ కొబ్బరి తోటల నుండి తమిళనాడు ద్రవిడ కోటల వరకు విస్తరించిన ఈ ఎన్నికల పోరులో భారతీయ ఓటరు తన పరిణతిని చాటుకున్నాడు. దశాబ్దాల రాజకీయ ఆధిపత్యాలను సవాలు చేస్తూ, సరికొత్త శక్తులకు పట్టం కడుతూ, అభివృద్ధి మరియు సిద్ధాంతాల మేళవింపుతో వెలువడిన ఈ ఫలితాలు జాతీయ రాజకీయాల్లో నవ శకానికి నాంది పలికాయి. ముఖ్యంగా ఈ ఎన్నికల ఫలితాలు జాతీయ పార్టీల విస్తృతిని, ప్రాంతీయ సమీకరణాల మార్పును, యువత రాజకీయ ఆకాంక్షలను స్పష్టంగా ప్రతిబింబించాయి.?ఉత్తర తూర్పు భారతావనిలో వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన అస్సాం రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ సాధించిన విజయం ఒక అప్రతిహత రాజకీయ ప్రస్థానానికి నిదర్శనంగా నిలిచింది. 126 స్థానాలు కలిగిన అస్సాం అసెంబ్లీలో ఎన్డీఏ ఏకంగా 102 స్థానాలను కైవసం చేసుకోవడం, ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమిని కేవలం 21 స్థానాలకే పరిమితం చేయడం ఒక చారిత్రక రికార్డు. 2016లో మొదటిసారి అధికారంలోకి వచ్చిన నాటి నుండి, 2021లో పట్టు నిలుపుకుని, ఇప్పుడు 2026లో వరుసగా మూడవసారి అఖండ మెజారిటీతో హ్యాట్రిక్ సాధించడం ద్వారా భాజపా ఈశాన్య భారతంలో తన అజేయ శక్తిని చాటుకుంది. ఈ అద్భుత విజయా నికి ప్రధాన కారణం ప్రభుత్వం అమలు చేసిన సమగ్ర అభివృద్ధి నమూనా. మారుమూల ప్రాంతాలను అనుసంధానిస్తూ నిర్మించిన భారీ వంతెనలు, రహదారులు, మరియు మౌలిక సదుపాయాల కల్పన అస్సాం ప్రజల్లో అభివృద్ధిపై గట్టి నమ్మకాన్ని కలిగించింది. దీనికి తోడు, అక్రమ వలసల విషయంలో ప్రభుత్వం అవలంబించిన కఠిన వైఖరి, జాతీయ పౌర పట్టిక అమలుపై ఉన్న స్పష్టత, మరియు స్థానిక సంస్కృతిని కాపాడే ప్రయత్నాలు గిరిజన మరియు స్థానిక వర్గాలను భాజపా వైపు మొగ్గు చూపేలా చేశాయి. కాంగ్రెస్ పార్టీ బలమైన నాయకత్వం లేక, క్షేత్రస్థాయిలో ఉనికిని కోల్పోవడం కూడా ఎన్డీఏకు ఇంతటి భారీ మెజారిటీ రావడానికి మార్గాన్ని సుగమం చేసింది. దేశవ్యాప్త రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయానికి గురిచేసిన పరిణామం పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకుంది. గత దశాబ్ద కాలానికి పైగా బెంగాల్ గడ్డపై ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ కోటను కూల్చివేస్తూ భాజపా సాధించిన విజయం జాతీయ రాజకీయాల్లోనే అత్యంత కీలక మలుపు. 293 స్థానాలు కలిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో భాజపా 206 స్థానాలతో అఖండ విజయాన్ని నమోదు చేసి అధికారాన్ని హస్తగతం చేసుకుంది. గతంలో ఎదురులేని శక్తిగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కేవలం 81 స్థానాలకే పరిమితం కాగా, కాంగ్రెస్ పార్టీ నామమాత్రంగా 2 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రాజకీయ హింస, అవినీతి ఆరోపణలు, మరియు పాలనాపరమైన అసంతృప్తి బెంగాల్ ఓటర్లలో ఒక నిశ్శబ్ద విప్లవానికి దారితీశాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లడంలో భాజపా విజయం సాధించింది. సామాజిక సమీకరణాలను తమకు అనుకూలంగా మార్చుకోవ డమే కాకుండా, పరిపాలనలో మార్పు రావాలని కోరుకున్న యువత మరియు మధ్య తరగతి ఓటర్లు భాజపాకు బాసటగా నిలిచారు. ఈ విజయం ద్వారా దేశంలో 21 రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ఏకైక పార్టీగా భాజపా తన ప్రాబల్యాన్ని మరింత పటిష్టం చేసుకుంది. దక్షిణ భారత రాజకీయాలలో సుదీర్ఘ కాలంగా 'మార్పు'కు వేదికగా నిలిచే కేరళ రాష్ట్రం ఈసారి కూడా తన సాంప్రదాయాన్ని కొనసాగించింది. గత ఎన్నికల్లో సాంప్రదాయక పద్ధతిని పక్కన పెట్టి వరుసగా రెండోసారి ఎల్డీఎఫ్‌కు పట్టం కట్టిన కేరళ ప్రజలు, ఈసారి తిరిగి యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ను అధికార పీఠంపై కూర్చోబెట్టారు. 140 స్థానాల కేరళ అసెంబ్లీలో యూడిఎఫ్ 102 స్థానాలను కైవసం చేసుకుని తన సత్తా చాటగా, అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ కేవలం 35 స్థానాలకు పడిపోయింది. ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలో లోపాలు, నిరుద్యోగ సమస్య, మరియు విదేశీ పెట్టుబడుల కొరత వామపక్ష కూటమి పతనానికి కారణమయ్యాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ ప్రచారంలో చూపిన సమన్వయం, యువ ఓటర్లను ఆకట్టుకునేలా రూపొందించిన ప్రణాళికలు ప్రజల్లో మార్పు పట్ల ఆసక్తిని పెంచాయి. ముఖ్యంగా విద్యావంతులైన కేరళ ఓటర్లు పరిపాలనలో నూతన జవజీవాలు రావాలని కోరుకుంటూ యూడిఎఫ్‌కు స్పష్టమైన తీర్పునిచ్చారు. భారత రాజకీయ యవనికపై 2026 ఎన్నికల్లో అత్యంత సంచలనాత్మక మలుపు తమిళనాడులో వెలువడింది. దశాబ్దాలుగా ద్రవిడ మున్నేట్ర కజగం, అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం ల మధ్యే సాగుతున్న తమిళ రాజకీయాల్లోకి మూడవ శక్తిగా సినీ నటుడు విజయ్ ప్రవేశించడం, ఆయన స్థాపించిన తమిళగ వెట్రి కళగం టి వి కె పార్టీ అపూర్వ విజయాన్ని సాధించడం ఒక అద్భుతం. 234 స్థానాల తమిళనాడు అసెంబ్లీలో విజయ్ పార్టీ 108 స్థానాలను గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. దశాబ్దాల చరిత్ర కలిగిన డీఎంకే 73 స్థానాలకు, ఏఐఏడీఎంకే53 స్థానాలకు పరిమితమయ్యాయి. ఇది కేవలం ఒక నటుడి గ్లామర్ విజయం మాత్రమే కాదు, ద్రవిడ రాజకీయాల పేరుతో సాగుతున్న అవినీతి, వారసత్వ రాజకీయాలపై తమిళ ప్రజల ఆగ్రహానికి నిదర్శనం. యువతలో ఉన్న విపరీతమైన ఆదరణను విజయ్ తన రాజకీయ సిద్ధాంతాలతో మేళవించి, క్షేత్ర స్థాయిలో బలమైన పునాదిని నిర్మించు కున్నారు. పారదర్శక పాలన, కులాలకు అతీతమైన రాజకీయం,తమిళ అస్తిత్వాన్ని కాపాడుతూనే ఆధునిక అభివృద్ధిని కాంక్షించే ఆయన విధానం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. ఇది భవిష్యత్తులో తమిళనాడులో ద్విధ్రువ రాజకీయాలకు స్వస్తి పలికి, సరికొత్త రాజకీయ ప్రత్యామ్నాయాలకు మార్గం చూపింది. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో సైతం ఓటరు తీర్పు అభివృద్ధికి అనుకూలంగా వెలువడింది. 30 స్థానాలు కలిగిన పుదుచ్చేరి అసెంబ్లీలో ఎన్డీఏ కూటమి 18 స్థానాలను సాధించి తన అధికారాన్ని నిలబెట్టుకోగా, కాంగ్రెస్ పార్టీ 6 స్థానాలకే పరిమితమైంది. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం ఉంటేనే చిన్న రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని పుదుచ్చేరి ప్రజలు భావించారు. పర్యాటక రంగం, మౌలిక వసతుల కల్పనలో వచ్చిన మార్పులు ఓటర్లను ఆకర్షించాయి. స్థానిక నాయకత్వం మరియు కేంద్రం మధ్య ఉన్న అవగాహన పుదుచ్చేరిలో రాజకీయ స్థిరత్వాన్ని కలిగించింది. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను సమగ్రంగా పరిశీలిస్తే భారత రాజకీయాల్లో కొన్ని కీలక ధోరణులు స్పష్టమవు తున్నాయి. మొదటిది, ప్రజలు ఇప్పుడు కేవలం సిద్ధాంతాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఫలితాలను ఇచ్చే 'నిష్పాక్షిక అభివృద్ధి' వైపు మొగ్గు చూపుతున్నారు. అస్సాం మరియు బెంగాల్ ఫలితాలు దీనికి నిదర్శనం. రెండవది, యువ ఓటర్ల పాత్ర గతంలో కంటే నిర్ణయాత్మకంగా మారింది. తమిళనాడులో విజయ్ పార్టీ సాధించిన విజయం, యువత ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం ఎంత ఆకలితో ఉన్నారో తెలియజేస్తోంది. మూడవది, సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న పార్టీలపై ఉన్న వ్యతిరేకత క్షేత్ర స్థాయిలో బలంగా పనిచేస్తోంది. కేరళ,బెంగాల్ ఫలితాలు ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. నాలుగవది, జాతీయ పార్టీలు ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ తన ఉనికిని దక్షిణాది మరియు తూర్పు రాష్ట్రాల్లో గణనీయంగా విస్తరించు కుంటోంది. ప్రస్తుతం దేశంలోని 21 రాష్ట్రాలలో అధికారంలో ఉండటం ద్వారా భాజపా జాతీయ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదిగింది. మరోవైపు, ప్రాంతీయ పార్టీలు కూడా తమ మనుగడ కోసం సిద్ధాంతపరమైన మార్పులను చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఎన్నికలు గుర్తుచేశాయి. తమిళనాడులో ద్రవిడ పార్టీల ఆధిపత్యాన్ని విజయ్ పార్టీ సవాలు చేయడం అనేది ప్రాంతీయ రాజకీయాల్లో వస్తున్న పెనుమార్పులకు సంకేతం. ఎన్నికల ప్రచార శైలిలో కూడా విప్లవాత్మక మార్పులు వచ్చాయి. సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రచారం ఓటర్ల ఆలోచనలను ప్రభావితం చేయడంలో కీలక పాత్ర పోషించాయి. తమిళనాడులో విజయ్ పార్టీ మరియు బెంగాల్‌లో భాజపా ఈ సాంకేతికతను సమర్థవంతంగా వాడుకున్నాయి.? 2026 పంచ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థలోని వైవిధ్యతను మరియు చైతన్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాయి. ఓటరు తన తీర్పు ద్వారా సుస్థిరతకు, అభివృద్ధికి మరియు సరికొత్త మార్పులకు పట్టం కట్టాడు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటముల లెక్కలు మాత్రమే కాకుండా, రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ఒక దిక్సూచీగా నిలుస్తున్నాయి. అభివృద్ధి పరమావధిగా, ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా సాగే రాజకీయాలకే భవిష్యత్తు ఉంటుందని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. జాతీయ రాజకీయ యవనికపై కొత్త నాయకత్వాలు, సరికొత్త సమీకరణాలు ఆవిర్భవించడంతో భారత ప్రజాస్వామ్యం మరింత పరిణతి చెందిన దిశగా అడుగులు వేస్తోంది. ఈ చారిత్రక పరిణామాలు దేశ రాజకీయ దిశను, దశను మార్చి వేస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. అభివృద్ధి, పారదర్శకత మరియు ప్రజా ఆకాంక్షలను గౌరవించే రాజకీయ ప్రస్థానానికి ఈ ఫలితాలు ఒక బలమైన పునాదిగా నిలుస్తాయి.



వైశ్య వికాస వేదిక
(Regd. No. 1514/2017)
ప్రతిభ పురస్కారాలు – 2026
ఇంటర్మీడియట్ - 2026 ఫలితాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వైశ్య విద్యార్థినీ విద్యార్థులకు శుభాకాంక్షలు
వైశ్య వికాస వేదిక అధ్వర్యంలో ప్రతి సం॥ నిర్వహిస్తున్న "ప్రతిభా పురస్కారాలు-2026" కార్యక్రమానికి ఇంటర్మీడియట్ 2026లో ద్వితీయ సం॥ (SECOND YEAR) ఫలితాల్లో 95% మరియు అంతకన్నా ఎక్కువ ప్రతిభ కనబరచిన వైశ్య విద్యార్థిని, విద్యార్థుల అప్లికేషన్స్ ఆహ్వానిస్తున్నాము.
ప్రతి విద్యార్థిని, విద్యార్థులను సర్టిఫికెట్ మరియు మొమెంటోతో సత్కరిస్తాము
నోట్: ప్రతిభా పురస్కారాలు కేవలం తెలంగాణ వైశ్య విద్యార్థిని, విద్యార్థులకు మాత్రమే, ఇతరులు ఎవరు అప్లికేషన్స్‌ను పంపించకండి.
Please fill your details in the below website
https://app.vysyavikasavedika.com
SCAN FOR APPLICATION
మజిలీప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి వచ్చిన విద్యార్థులకు లక్కీడ్రా ద్వారా 10 మందికి ల్యాప్‌టాప్స్ ఇవ్వబడును
చివరి తేది 30-04-2026

Ln. డా॥ కాచం సత్యనారాయణ గుప్త
MA,LLB,PGDCJ,MSW
ఫౌండర్ చైర్మన్ - వైశ్య వికాస వేదిక
V3 న్యూస్, ప్రజా విశ్వంభర దినపత్రిక
Cell: 9441222429
మరిన్ని వివరాలకు
కాసం సాయి: 8885402108, కాచం సుష్మ: 9849632429
కండె రామ్ నరేష్: 9848488149

